# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 56 | హైదరాబాద్ | బుధవారం 13-08-2025 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు గృహ నిర్బంధం

## నేటి భారతం...

* ఒకడు తలొంచుకున్నాడు కదా అని తక్కువగా చూడకు..
* పలుచన చేయకు..
* నీ ముందు చేయి చాచాడు కదా అని చులకనగా చూడకు..
* బ్రతిమిలాడుతున్నాడని గతిలేని వాడు అనుకోకు..
* ఎందుకంటే నీ జీవన ప్రయాణంలో కూడా నువ్వు
* ఇలాంటి పరిస్థితులు ఎదుర్కొనే ఉంటావు..
* కానీ ఒకప్పటిలా నువ్వు ఇప్పుడు లేవు..
* ఇప్పుడున్నట్టు ఎదుటివాడు కూడా ఎప్పటికీ ఉండడు..
* వాస్తవం ఏమిటంటే..
* వాడి స్థాయికి నువ్వు దిగజారాకపోవచ్చు..
* కానీ నీ స్థాయికి వాడు ఖచ్చితంగా ఎదుగుతాడు..
* ఇది ప్రకృతి ధర్మం గ్రహించు..

– బోయినపల్లి రమణా రావు, సీనియర్ జర్నలిస్ట్



## ఫీజు రీఎంబర్స్ మెంట్ లేక
# విద్యార్థుల అరిగోస..

ఫీజ్ రీ యంబర్స్ మెంట్ పుణ్యమా అని సామాన్య విద్యార్థులు సైతం ఉన్నత చదువులు చదివే అవకాశం కల్గింది.. కొంత కాలం ఈ ప్రక్రియ బాగానే కొనసాగింది.. కానీ రాను రాను ప్రభుత్వాలు కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజ్ రీ యంబర్స్ మెంట్ బకాయిలను చెల్లించకుండా నిలిపివేసింది.. దీంతో ఆర్థికంగా వెనుకబడ్డ విద్యార్థులు ఇరకాటంలో పడ్డారు.. కోర్సు పూర్తయినా కూడా కళాశాలల యాజమాన్యం ఫీజు బకాయిలు ఉండటంతో ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు.. దీంతో విద్యార్థులు పైచదువులకు వెళ్లలేక, ఉద్యోగ ఇంటర్వ్యూలకు హాజరు కాలేక నా నా యాతన పడుతున్నారు.. అదేమని అడిగితే ప్రభుత్వం మాకు బకాయిలు చెల్లించడం లేదు.. మీకు అంత అత్యవసరంగా సర్టిఫికెట్స్ కావాలంటే డబ్బులు కట్టి తీసుకువెళ్ళండి అని కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి.. కొంత ఆర్థికంగా వెసులుబాటు ఉన్న వారు ఫీజులు చెల్లించి సర్టిఫికెట్స్ తీసుకుంటున్నారు.. ఇక కొంతమంది అప్పో సొప్పో చేసి ఫీజులు కట్టి సర్టిఫికెట్స్ తీసుకుంటున్నారు.. కానీ ఇటు ఆర్థిక పరిస్థితి బాగా లేక, అప్పులు పుట్టే అవకాశం లేక ఎంతో మంది పేద విద్యార్థులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.. ఇదే విషయమై కళాశాలల యాజమాన్యాలను ప్రశ్నిస్తే.. ఫీజు బకాయిలు ప్రభుత్వం నుండి అందకపోవడంతో.. తాము ఆర్థికంగా ఎన్నెన్నో ఇబ్బందులకు గురి అవుతున్నామని.. కనీసం మా దగ్గర పనిచేసే ఉద్యోగులకు కూడా జీతాలు చెల్లించలేకపోతున్నామని వారు వాపోతున్నారు.. తప్పని సరి పరిస్థితుల్లో విద్యార్థులను డిమాండ్ చేయాల్సి వస్తోందని వారు అంటున్నారు..

- సర్టిఫికెట్స్ ఇవ్వడానికి నిరాకరిస్తున్న కళాశాలలు..
- పై చదువులకు వెళ్లలేక, ఉద్యోగాలకు అటెండ్ కాలేక..
- చెల్లించడానికి ఆర్థిక స్థోమత లేక అల్లాడుతున్న స్టూడెంట్స్..

12లో




గుజరాత్ లోని రిలయన్స్ రిఫైనరీని
## టార్గెట్ చేస్తాం



అసిమ్ మునీర్ హెచ్చరిక

11లో

తిరుమల వెళ్లే భక్తుల వాహనాలకు
## 'ఫాస్టాగ్' లేకపోతే నో ఎంట్రీ



ఆగస్టు 15 నుంచి కొత్త నిబంధన అమలులోకి

12లో

సైబర్ నేరాల్లో
# తెలంగాణ టాప్..

**దేశ సగటు కంటే 10 రెట్లు ఎక్కువ!**

- సైబర్ నేరాల్లో దేశంలోనే తెలంగాణకు అగ్రస్థానం
- జాతీయ సగటు కంటే పది రెట్లు అధికంగా క్రైమ్ రేటు
- వెల్లడించిన జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ)
- జాబితాలో రెండో స్థానంలో నిలిచిన మరో దక్షిణాది రాష్ట్రం కర్ణాటక
- ఏపీలో 4.4 శాతంగా నమోదైన సైబర్ క్రైమ్ రేటు
- నేరాల కట్టడికి కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు

12లో





12లో

అమరావతి పనులు రికార్డు
## సమయంలో పూర్తి కావాలి

- అమరావతి నిర్మాణ పనుల పురోగతిపై సీఎం సమీక్ష
- మొత్తం రూ. 81,317 కోట్ల విలువైన పనులకు సీఆర్డీఏ ప్రతిపాదన
- ఇప్పటికే రూ. 50,552 కోట్ల పనులకు టెండర్లు పూర్తి
- సమీక్షకు హాజరైన మంత్రి నారాయణ, ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్లు
- భవనాలు, రోడ్లు, వరద నియంత్రణ పనులపై చర్చ

## రెడ్ అలర్ట్...

తెలంగాణలో పలు జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు

- మూడు రోజుల పాటు భారీ వర్షాలు
- హన్మకొండ, జనగాం, వరంగల్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు
- పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ

12లో



# 225 చుట్టూ రాజకీయం

విజయవాడ, ఆగస్టు 12,

రాష్ట్రంలో రాజకీయాలు కీలక మలుపులు తిరుగుతున్నాయి. కూటమి దూకుడు మీద ఉంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం దిశగా ప్రణాళికలు వేస్తోంది. మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల అరెస్టుల పర్వం కొనసాగుతోంది. ముఖ్యంగా వైసీపీ హయాంలో భారీ ఎత్తున అవినీతి, కుంభకోణాలు జరిగాయని కూటమి ప్రభుత్వం చెబుతోంది. ఇంకోవైపు అవన్నీ రాజకీయ కక్షపూరిత కేసులని వైసీపీ చెప్పుకొస్తోంది. అయితే లోలోపల మాత్రం ఎవరికీ వారే పట్టుబిగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. 2029 ఎన్నికలను టార్గెట్ చేసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో జగన్మోహన్ రెడ్డికి అవకాశం ఇవ్వకూడదని చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ బలంగా నిర్ణయం తీసుకున్నారు. అయితే ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని చెబుతూ ప్రజల్లోకి వెళ్లేందుకు జగన్ నిర్ణయించుకున్నారు. దీంతో ఏపీలో రాజకీయం రోజుకో మలుపు తిరుగుతోంది. ఎత్తుకు పైఎత్తులు కొనసాగుతున్నాయి.అయితే వచ్చే ఎన్నికల నాటికి ఏపీవ్యాప్తంగా నియోజకవర్గాల సంఖ్య పెరుగుతుందని అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం ఏపీలో 175 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. నియోజకవర్గాల పెంపు విషయాన్ని ప్రస్తావించారు. ఏపీలో మరో 50 అసెంబ్లీ నియోజకవర్గాలు పెరుగుతాయని అంచనా వేశారు. తద్వారా అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య 225 కు చేరుకోనుంది. అయితే నియోజకవర్గాల పెంపును దృష్టిలో పెట్టుకొని ప్రధాన రాజకీయ పార్టీలు సరికొత్త వ్యూహంతో ముందుకు వెళుతున్నాయి. ఈ విషయంలో ఎవరి అంచనాలు వారికి ఉన్నాయి. అయితే నియోజకవర్గాల విభజనతో పాటు పెంపునకు సంబంధించి అధికార కూటమి మాట చెల్లుబాటు అయ్యే అవకాశం ఉంది. వారికి అనుకూలంగా నియోజకవర్గాల పునర్విభజన ఉండే అవకాశం ఉంటుంది. చివరిసారిగా 2009లో నియోజకవర్గాల పునర్విభజన సమయంలో అప్పటి కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా జరిగింది. ఇప్పుడు కూడా టిడిపి కూటమికి లాభం చేకూరే అవకాశం ఉంది.ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ బలమైన స్థితిలో ఉంది. 135 అసెంబ్లీ సీట్లలో ఆ పార్టీ విజయం సాధించింది. అయితే ఇంకా భవిష్యత్తు వ్యూహరచన లో భాగంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలను భారీగా ఆకర్షించగలిగింది. కేవలం నియోజకవర్గాల పునర్విభజన దృష్టిలో పెట్టుకొని వైసీపీలో ఉన్న బలమైన నేతలను టిడిపిలోకి రప్పించింది. అనివార్య కారణాలతో సిట్టింగ్ ఎమ్మెల్యేలను మారిస్తే ప్రత్యామ్నాయంగా కొంతమంది నేతలను సిద్ధం చేసుకుంది. నియోజకవర్గాల పెంపుతో లభించే స్థానాలకు ముందస్తుగానే నేతలను సంసిద్ధులను చేసింది తెలుగుదేశం పార్టీ. ఒకటి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని దెబ్బతీయడం.. రెండు భవిష్యత్తు అవసరాల దృష్ట్యా వైసీపీ నేతలను ఆకర్షించడం.. ఇలా ద్విముఖ వ్యూహంలో తెలుగుదేశం పార్టీ ఉంది.జనసేనకు సంబంధించి నియోజకవర్గాల పెంపు పై కూడా దృష్టి పెట్టింది. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తోంది. మొన్నటి ఎన్నికల్లో సూపర్ విక్టరీ కొట్టింది జనసేన. 21 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసి శతశాతం విజయం సాధించింది. వచ్చే ఎన్నికల నాటికి మరిన్ని సీట్లు పొందాలని చూస్తోంది. నియోజకవర్గాల పెంపులో భాగంగా.. పెరిగిన సీట్లలో మెజారిటీ స్థానాలను దక్కించుకోవాలన్న ఆలోచనలో ఉంది. ముఖ్యంగా రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో పార్టీని విస్తరించాలని చూస్తోంది. అందుకే బలమైన నేతలను ముందుగా పార్టీలోకి రప్పించింది. నియోజకవర్గాల పెంపు పై ఒక అంచనాకు వస్తే మరింత మంది నేతలను పార్టీలోకి రప్పించేందుకు వ్యూహరచన చేస్తోంది. ముఖ్యంగా ఈసారి జనసేన రాయలసీమ జిల్లాలపై దృష్టి పెట్టే ఛాన్స్ కనిపిస్తోంది.

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి భిన్నంగా ఆలోచన చేస్తున్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకతతో ప్రజలు తమ వైపు చూస్తారని అంచనా వేస్తున్నారు. ఒకేసారి 50 నియోజకవర్గాల పెంపుతో తమకు కలిసి వస్తుందని ధీమాతో ఉన్నారు. పొత్తులో భాగంగా చాలామంది నేతలకు సీట్లు దక్కవని.. అటువంటి వారంతా వైసిపి వైపు చూడడం ఖాయమని భావిస్తున్నారు. ఇలా నియోజకవర్గాల పెంపు పై అన్ని పార్టీలు ఆశలు పెట్టుకున్నాయి. అయితే అసలు నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందా? నియోజకవర్గాల పెంపు ఉంటుందా? అన్నదానిపై స్పష్టత లేదు.

# కానుకలతో పవన్ కళ్యాణ్

పిఠాపురం, ఆగస్టు 12

రాజకీయాల్లో ట్రెండ్ మారింది. ఇన్నాళ్ల మాదిరిగా ఏడాదికి ఒకసారి నియోజకవర్గానికి వెళ్తామంటే ఓటర్లు నుంచి నిరసనలు తప్పదు. ఫలితంగా అధికార ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పవు. దీన్ని గమనించిన ప్రధాన పార్టీలు బీజేపీ, కాంగ్రెస్, టీడీపీ పార్టీల నేతలు రూటు మార్చారు. నిత్యం ప్రజలతో ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉండాలని పదే పదే అగ్రనేతలు చెబుతున్నారు. ఈ ట్రెండ్‌ని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బాగానే ఫాలో అవుతున్నారు. ఒకవేళ బిజీ వల్ల నియోజకవర్గానికి వెళ్లకపోయినా నిత్యం అక్కడి ప్రజలతో టచ్‌లో ఉంటున్నారు. సమయం, సందర్భం బట్టి రకరకాల కానుకలను ప్రజలకు అందజేస్తున్నారు. శనివారం రాఖీ పండగ సందర్భంగా పిఠాపురం నియోజకవర్గంలో 1500 మంది వితంతు మహిళలకు చీరలు పంపారు. వాటిని నియోజకవర్గంలో నేతలు మహిళలకు అందజేశారు. వాటిని అందుకున్న మహిళలు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. రక్షాబంధన్ రోజు ఊహించని కానుక డిప్యూటీ సీఎం నుంచి రావడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అన్నట్లు మొన్న అల్లూరు జిల్లా టూర్‌కి వెళ్లారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. ఆ గిరిజన గ్రామానికి తన తోటలో పడిన మామిడిపండ్లను పంపి అక్కడి ప్రజలకు అందజేశారు. దీంతో ఆ గ్రామ ప్రజలు పవన్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞత తెలిపారు. ఓ వైపు సినిమాలు, మరోవైపు అధికారులు, ఇంకోవైపు నేతల వరుస సమావేశాలతో నిత్యం బిజీగా ఉంటున్నారు పవన్ కళ్యాణ్. దీంతో నియోజకవర్గానికి ఆయన దూరమయ్యారనే వాదన లేకపోలేదు. ఇప్పుడు ఆ గ్యాప్‌ని ఫుల్ చేసుకునే పనిలో పడినట్టు కనిపిస్తోంది. ఈ క్రమంలో రాఖీ పండగ నేపథ్యంలో నియోజకవర్గంలో 1500



మందికి చీరలు పంపారని అంటున్నారు. రేపటి రోజున డిప్యూటీ సీఎం ప్రజలకు ఇవ్వబోయే గిఫ్ట్ ఏంటంటూ చర్చించుకోవడం మొదలైంది. ఒకవిధంగా చెప్పాలంటే ఆ తరహా పద్ధతి ఇప్పటివరకు ఏ రాజకీయ నేతలు పాటించిన సందర్భాలు లేవు. కానీ పవన్ అలా కాదని అంటున్నారు. జరుగుతున్న పరిణామాలు గమనించిన రాజకీయ విశ్లేషకులు పవన్ కొత్త ట్రెండ్ సెట్ చేస్తున్నారని అంటున్నారు. రాబోయే రోజుల్లో పవన్ నుంచి ప్రత్యేక కానుక ఏ ప్రాంతానికి వెళ్తుందో చూడాలి. పిఠాపురం ఆడపడుచులకు రాఖీ కానుక పంపించిన పిఠాపురం ఓఒం, ఉపముఖ్యమంత్రి శ్రీ ఏఖజీలిజీనిఐజీశ్రీఎజీని గారు. పిఠాపురానికి చెందిన 1,500 మంది వితంతు మహిళలకు చీరలు పంపిన శ్రీ పవన్ కళ్యాణ్ గారు. ఊహించని రక్షాబంధన్ కానుకకి ధన్యవాదాలు తెలిపారు.

# ఏపీకి ఫుల్ కనెక్టివిటీ

విజయవాడ, ఆగస్టు 12,

ఏపీని అన్నివిధాలుగా అభివృద్ధి చేయాలని ఆలోచన చేస్తోంది ప్రభుత్వం. ఎటువైపు వెళ్లినా రోడ్డు, రైలు, విమాన సర్వీసులు ఉండాలన్నది సీఎం చంద్రబాబు ప్రధాన కోరిక. ఆ విధంగా అడుగులు వేస్తున్నారు. ఓ వైపు రోడ్లు-ఎయిర్‌పోర్టుల పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇంకోవైపు రైల్వే శాఖ అధికారులు కొత్త ప్రాజెక్టులపై ఫోకస్ చేశారు. ఏపీకి కొత్త రైల్వే జోన్ అపాయింటెడ్ డే కోసం తెర వెనుక వేగంగా పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం కొత్త జోన్ పీహెచ్ఓడీల నియామకం జరుగుతోంది. జనవరిలో జోన్ నోటిఫికేషన్ రావచ్చని అంచనా వేస్తున్నారు. ఇదెలా వుంచితే ఏపీలో వివిధ మార్గాల్లో కొత్త రైల్వేలైన్ల నిర్మాణం జరుగుతోంది. ప్రస్తుతమున్న లైన్లకు అదనంగా మరికొన్ని కలిపి 1,336.60 కిలోమీటర్ల మేరా లైన్ల నిర్మాణానికి ఆ శాఖ అధికారులు రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపారు. వీటికి దాదాపు రూ. 33 వేల కోట్ల వ్యయం అవుతుందని ఓ అంచనా. వాటిలో కొత్త లైన్ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. భద్రాచలం-కొవ్వూరు కొత్త లైన్ అందులో ఉంది. ముద్దనూరు-పులివెందుల-ముదిగుబ్బ-ప్రశాంతి నిలయం కొత్త లైన్ అంటే 100 కిలోమీటర్లు ప్రతిపాదన చేశారు. దీనికితోడు అట్టిపట్టు-పుత్తూరు కొత్త లైన్ ఇది ఏపీ పరిధిలో ఉండనుంది. వెస్ట్ గోదావరి జిల్లాలో నిడదవోలు నుంచి విశాఖ దువ్వాడ వరకు మూడో, నాలుగు లైన్ల నిర్మాణాల కోసం డీపీఆర్ చేసిన వాటిలో ఉన్నాయి. అలాగే నల్లపాడు-కృష్ణ కెనాల్ స్టేషన్ల మధ్య మూడు-నాలుకతో లైన్, ఓబుళవారి పల్లి-రేణిగుంట- గుంతకళు మధ్య మూడు, నాలుగు లైన్ ఉన్నాయి. దీనికితోడుఇందుపల్లి-దుగ్గిరాల వద్ద బైపాస్ లు, రేణిగుంట వద్ద రైల్ ఓవర్ బ్రిడ్జి, బళ్లారి నుంచి బిక్కజాజూర రెండో లైన్ కు సంబంధించిన డీపీఆర్‌ను అధికారులు బోర్డుకు పంపారు. అక్కడి గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఏపీలో రైల్వేకి చూడాల్సిన అవసరం లేదన్నది ప్రభుత్వ ఆలోచన. ఇవికాకుండా కొత్తగా రానున్న రైళ్లను విశాఖతోపాటు తిరుపతి నుంచి పెట్టాలని భావిస్తోంది. డీపీఆర్ పంపిన ప్రాజెక్టులకు సంబంధించి కొంతభాగం ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు భరించాలి. లేకపోతే భూములను సేకరించి ఇవ్వాలన్నది బోర్డు మాట. కాకపోతే విభజన చట్టం ప్రకారం ఈ ప్రాజెక్టులను రైల్వే నిధులతో చేట్టాలని దక్షిణ మధ్య రైల్వే జీఎంకు ఏపీ ప్రభుత్వం లేఖ రాసింది. వీటిలో కొన్నింటికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశముందని కొందరు అధికారులు

# న్యాయవాద దంపతుల హత్య కేసు సిబిఐకి బదిలీ చేసిన సుప్రీంకోర్టు

మంథని

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కల్గించిన హై కోర్టు న్యాయవాదులు గట్టు వామన్ రావు, పివి నాగమణి దంపతుల హత్య కేసు విచారణను సీబీఐకి బదిలీ చేస్తూ దేశ అత్యున్నత న్యాయ స్థానం ఆదేశాలు జారీ చేసింది.. 2021 ఫిబ్రవరి 17న మంథని పెద్దపల్లి రహదారిలోని రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో వామన్ రావు, నాగమణీలు హత్యకు గురైన సంగతి తెలిసిందే. మంథని కోర్టులో కేసు విచారణ కోసం వెళ్లివస్తుండగా వీరిద్దరూ హత్యకు గురి కాగా ఈ కేసులో పలువురిని అప్పుడు పోలీసులు అరెస్ట్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అడ్వకేట్ల మర్డర్ కేసు విషయంలో సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశాయి. దీంతో అప్పటి ప్రభుత్వం ఐజీ నాగిరెడ్డి పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టాలని ఆదేశించింది. రామగుండం కమిషనరేట్ పరిధిలో జరిగిన ఈ హత్య కేసులో కుట్ర కోణం దాగి ఉందని వామన్ రావు తండ్రి కిషన్ రావు పలు మార్లు ఆరోపించారు. అంతేకాకుండా వామన్ రావు, పివి నాగమణిల హత్య కేసు దర్యాప్తు పారదర్శకంగా జరగలేదని, సీబీఐకి కేసు విచారణ బాధ్యతలు అప్పగించాలని కోరుతూ సుప్రీంకోర్టును కూడా అభ్యర్థించారు. ఈ మేరకు విచారణ చేపట్టిన కోర్టు తెలంగాణ ప్రభుత్వం నుండి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. వామన్ రావు, నాగమణిల హత్య కేసును సీబీఐకి అప్పగించడానికి తమకేమీ అభ్యంతరం లేదని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు విన్నవించింది. మంగళవారం విచారించిన సుప్రీం కోర్టు ఈ కేసును సీబీఐకి బదిలీ చేయాలని ఆదేశించింది.మళ్లీ మొదటి నుండి...వామన్ రావు, పీవీ నాగమణీల హత్య కేసుపై సీబీఐ అధికారుల బృందం విచారణ చేపట్టే అవకాశాలు ఉన్నాయి. 2021 ఫిబ్రవరి 17న జరిగిన పరిణామాలు, కేసులో అరెస్ట్ అయిన వారి ద్వారా దర్యాప్తు అధికారులు సేకరించిన వాంగ్మూలాలను క్షుణ్ణంగా స్టడీ చేయనుందని సమాచారం.

## భారతం...చాణుక్య వ్యూహం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై 50% టారిఫ్‌లు విధించాడు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిషేధించాలని ఒత్తిడి చేయడం ద్వారా భారత్‌ను శత్రు దేశంగా చూస్తున్నారనే సంకేతాలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత్ తన సంప్రదాయ బహుముఖ విదేశాంగ విధానాన్ని ఉపయోగిస్తూ, రష్యా, చైనాలతో సంబంధాలను బలోపేతం చేస్తోంది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ రష్యా పర్యటన, ఆగస్టు 31న ప్రధాని నరేంద్ర మోదీ చైనా సందర్శన, కేంద్ర మంత్రులు జైశంకర్, రాజ్‌నాథ్ సింగ్‌ల ఇటీవలి చైనా పర్యటనలు ఈ వ్యూహాత్మక దృక్పథాన్ని సూచిస్తున్నాయి. పంచతంత్ర నీతి ప్రకారం భారత్ అమెరికా శత్రుదేశాలను ఏకం చేస్తోంది.ట్రంప్ భారత్‌పై 50% టారిఫ్‌లు విధించడం, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ఆపాలని ఒత్తిడి చేయడం ద్వారా భారత్?అమెరికా సంబంధాలు గణనీయమైన సవాలును ఎదుర్కొంటున్నాయి. భారత్ రష్యా చమురు కొనుగోళ్లు ఉక్రెయిన్ యుద్ధానికి ఆర్థిక సహాయం చేస్తున్నాయని ట్రంప్ ఆరోపించారు. అయితే, భారత్ ఈ ఆరోపణలను "అన్యాయమైనవి, అసమంజసమైనవి" అని తిరస్కరించింది, రష్యా చమురు కొనుగోళ్లు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం కాదని, ఇది జాతీయ ఇంధన భద్రతకు కీలకమని స్పష్టం చేసింది. 2024లో భారత్?అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యం 190 బిలియన్లు కాగా, ఈ టారిఫ్‌లు 64 బిలియన్ల ఎగుమతులను ప్రభావితం చేయవచ్చని అంచనాఇదిలా ఉంటే ట్రంప్ బ్రిక్స్ దేశాలను (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా) "యాంటీ?అమెరికన్" బ్లాక్‌గా భావిస్తున్నారు, ఇది డాలర్ ఆధిపత్యాన్ని సవాలు చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిక్స్ సభ్య దేశాలపై అదనంగా 10% టారిఫ్‌లు విధించాలనే ట్రంప్ బెదిరింపు, భారత్‌ను రష్యా, చైనాలతో మరింత చేరువ చేసే అవకాశం ఉంది. ఈ ఒత్తిడి భారత్‌ను తన బహుముఖ విదేశాంగ విధానాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రేరేపిస్తోంది.భారత్?రష్యా సంబంధాలు "సమయ పరీక్షిత, విశ్వసనీయ" భాగస్వామ్యంగా కొనసాగుతున్నాయి. 2023?24 ఆర్థిక సంవత్సరంలో ద్వైపాక్షిక వాణిజ్యం 65.7 బిలియన్ డాలర్లకు చేరింది, ఇందులో రష్యా నుంచి 61.44 బిలియన్ డాలర్ల దిగుమతులు (ప్రధానంగా చమురు) ఉన్నాయి. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ రష్యా పర్యటన, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ ఏడాది చివరలో భారత్ సందర్శనకు సన్నాహాలు చేస్తున్నాయి. ఈ సందర్శనలో ట్రంప్ టారిఫ్‌లు, రష్యా?ఇండియా?చైనా (ఆర్ఐసీ) త్రికోణ సహకారం ప్రధాన అంశాలుగా ఉంటాయని భావిస్తున్నారు. భారత్ రష్యా నుంచి చమురు కొనుగోళ్లను కొనసాగించడం ద్వారా జాతీయ ఇంధన భద్రతను కాపాడుకుంటోంది, ఇది ట్రంప్ ఒత్తిడిని ఎదుర్కొనే వ్యూహంగా కనిపిస్తోంది.2020 గల్వాన్ ఘర్షణ తర్వాత భారత్?చైనా సంబంధాలు ఒడిదొడుకులను ఎదుర్కొన్నప్పటికీ, ఇటీవలి కాలంలో సాధారణీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. 2024 అక్టోబర్‌లో కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సులో మోదీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ సమావేశమై, సరిహద్దు సమస్యలపై చర్చించేందుకు ప్రత్యేక ప్రతినిధుల సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఆగస్టు 31న మోదీ చైనాలోని టియాంజిన్‌లో జరిగే షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీవో) సదస్సుకు హాజరవుతారు, ఇది ఏడేళ్లలో ఆయన తొలి చైనా సందర్శన. ఈ సందర్శనలో ట్రంప్ టారిఫ్‌లు, ద్వైపాక్షిక వాణిజ్యం, సరిహద్దు సమస్యలు ప్రధాన అంశాలుగా ఉంటాయి. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఆగస్టు 18న భారత్ సందర్శనలో ధోవల్‌తో సరిహద్దు సమస్యలపై చర్చిస్తారని తెలుస్తోంది.బ్రిక్స్ దేశాలు (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా) గ్లోబల్ సౌత్ దేశాలకు ప్రత్యామ్నాయ ఆర్థిక, రాజకీయ వేదికగా ఉద్భవించాయి. ట్రంప్ బ్రిక్స్‌ను యాంటీ?అమెరికన్ బ్లాక్‌గా ఆరోపిస్తున్నప్పటికీ, భారత్ ఈ సమూహంలో తన పాత్రను బలోపేతం చేస్తోంది. బ్రిక్స్ దేశాలు డాలర్ ఆధిపత్యానికి ప్రత్యామ్నాయ కరెన్సీలపై చర్చిస్తున్నాయనే ట్రంప్ ఆందోళన, భారత్‌ను ఈ సమూహంలో మరింత చురుకుగా పాల్గొనేలా ప్రేరేపిస్తోంది. అయితే, భారత్ బ్రిక్స్ కరెన్సీ ఆలోచనను ప్రత్యక్షంగా సమర్థించలేదు, దాని బహుముఖ విధానాన్ని కొనసాగిస్తోంది.రష్యా?ఇండియా?చైనా (ఆర్ఐసీ) త్రికోణం 1990లలో స్థాపించబడినప్పటికీ, ఇటీవలి ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో దీని పునరుజ్జీవనం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ మూడు దేశాలు అమెరికా ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి, ఇది వాటిని ఒకదానికొకటి చేరువ చేస్తోంది. మోదీ, పుతిన్, జిన్‌పింగ్ సమావేశం ఎస్‌సీవో సదస్సులో జరిగితే, అమెరికా దూకుడు విధానాలకు చెక్ పెట్టే వ్యూహాత్మక సహకారం ఏర్పడవచ్చు. ఈ త్రికోణం భారత్‌కు రష్యా, చైనాలతో వాణిజ్య, భద్రతా సహకారాన్ని బలోపేతం చేసే అవకాశాన్ని ఇస్తుంది, అదే సమయంలో అమెరికాతో సంబంధాలను సమతుల్యం చేస్తుంది.భారత్ తన "నాన్?అలైన్‌మెంట్" విధానాన్ని కొనసాగిస్తూ, అమెరికా, రష్యా, చైనాలతో సంబంధాలను సమతుల్యం చేస్తోంది. ట్రంప్ ఒత్తిడి ఉన్నప్పటికీ, భారత్ రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ఆపలేదు, ఇది జాతీయ ఆర్థిక, ఇంధన భద్రతకు కీలకమని పేర్కొంది. ప్రధాని మోదీ రైతులు, చేపల వేటగాళ్లు, డైరీ రైతుల ప్రయోజనాలను రాజీ పడనని స్పష్టం చేశారు, ఇది అమెరికాతో వాణిజ్య ఒప్పందంలో వ్యవసాయ రంగంపై ఒత్తిడిని తిరస్కరించే సంకేతం. ఈ విధానం భారత్ యొక్క స్వాతంత్ర్య దృక్పథాన్ని, జాతీయ ప్రయోజనాలను ప్రతిబింబిస్తుంది.ట్రంప్ టారిఫ్‌లు, భారత్?రష్యా?చైనా సహకారం అమెరికాను ఆందోళనకు గురిచేస్తోంది.

## పులివెందులలో ఉద్రిక్తత

కడప

కడప జిల్లా పులివెందులలో హై టెన్షన్ నెలకొంది. పులివెందుల జడ్పిటిసి ఉప ఎన్నిక సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. వైస్సార్సిపి నాయకులు ఎంపీ అవినాష్ రెడ్డి ఇంటి వద్ద పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. దీంతో ఎంపీ అవినాష్ రెడ్డి ఇంటి వద్ద ఉద్రిక్తత పరిస్థులు నెలకొన్నాయి. ఎంపీ అవినాష్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి కడప కు తరలించారు. ఈ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకె పోలీసులు మందుస్తూ అరెస్ట్ చేస్తున్నారు. అలాగే వేంపల్లిలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి ఇంటి వద్ద పోలీసులు మోహరించి హౌస్ అరెస్ట్ చేశారు...

## పులివెందులలో హోరాహోరి

కడప

కడప జిల్లా పులివెందులలో జడ్పిటిసి ఉప ఎన్నిక హిట్ హిట్ గా కొనసాగుతుంది. జెడ్పిటిసి స్థానం నీదా నాదా అంటూ సమరం మొదలైంది. మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి కంచుకోటలో జడ్పిటిసి స్థానం కైవసం చేసుకునేందుకు తెలుగుదేశం పార్టీ విశ్వ ప్రయత్నాలు చేస్తుంది. టిడిపి,వైసిపి నేతల మధ్య మాటల యుద్ధంతో ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. ఇరు పార్టీల నేతలు జడ్పిటిసి స్థానం కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. పోలీసులు సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు ముఖ్య నేతలను ఎక్కడికక్కడ అరెస్టు లు చేస్తున్నారు. ఎంపీ అవినాష్ తో పాటు టిడిపి ఎమ్మెల్సి రాం భూపాల్ రెడ్డిని అరెస్ట్ చేశారు..

========================

## శ్రీశైలం ఘాట్ రోడ్డుపై ఢీకొన్న రెండు ఆర్టీసీ బస్సులు

శ్రీశైలం

శ్రీశైలం ఘాట్ రోడ్డుపై రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్నాయి. దాంతో 10 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పాడింది. దోర్నాల సమీపంలో రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొనడంతో ప్రయాణీకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయాలపాలైన డ్రైవర్, ప్రయాణీకులను దోర్నాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగి మూడు గంటలైనా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో, భారీగా ట్రాఫిక్ జామ్ అయిందని వాహనదారులు మండిపడుతున్నారు.

## పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నిక ప్రారంభం

కడప

కడప జిల్లాలో జడ్పిటిసి ఉప ఎన్నికల ప్రకీయ ప్రారంభమైంది. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పిటిసి ఉప ఎన్నికలు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది. పులివెందుల జెడ్పిటిసి బరిలో 11 మంది, ఒంటిమిట్ట జెడ్పిటిసి బరిలో 11 మంది అభ్యర్థులు ఉన్నారు. బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోనెందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. ఈనెల 14 వ తేదీన ఓట్ల లెక్కింపు ఉండబోతుంది. పులివెందులలో అన్ని సమస్యాత్మక కేంద్రాలు కావడంతో పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు...

## బెల్లంపల్లిలో భారీ వ్యాను బోల్తా, డ్రైవర్ క్షేమం

బెల్లంపల్లి బెల్లంపల్లి పట్టణంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో డివైడర్ను ఢీకొన్న వ్యాను బోల్తా పడింది. జాతీయ రహదారి 162 వద్ద సబ్ స్టేషన్ పరిధిలో ఈ సంఘటన చోటుచేసుకుంది. అదృష్టవశాత్తు, వ్యానులో ఉన్న డ్రైవర్ సురక్షితంగా బయటపడటంతో పెను ప్రమాదం తప్పింది. ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# ఎర్రిపల్లి, కనంపల్లెలో ఉద్రిక్తత

కడప

పులివెందుల మండలం ఎర్రిపల్లిలో ఉద్రిక్తత నెలకొంది. అల్లరి మూకలు పోలింగ్ బూత్ ను ఆధీనంలోకి తీసుకుని పోలీసులను సైతం తరిమేసారు. గ్రామంలో మహిళలపై దాడి చేపసి అసభ్యంగా ప్రవర్తించారు. గ్రామంలో మహిళలు ఓటు వేయకుండా అడ్డుకున్నారు.

మరోవైపు, కనంపల్లెలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఓట్లు వేయకుండా పోలీసులు అడ్డుకుంటున్నారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ఓట్లు తామే వేసుకుంటామని పోలీసులపై తిరగబడ్డారు. అక్కడ పోలీసులకు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

# దేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్.

, గోదావరిఖని :

అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని స్థానిక మార్కండేయ కాలనీలో ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ముఖ్యఅతిథిగా హాజరై శ్వేత-అరుణ పతాకాన్ని ఆవిష్కరించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ భారతదేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘమని,స్వాతంత్రం రాకపూర్వమే 1936 ఆగస్టు 12న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని, లక్నో నగరంలోని బెనారస్ యూనివర్సిటీలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య పురుడోసుకున్నదాని,కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘం ఏదైనా ఉన్నదంటే అది ఒక్క ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘమే అని, నాటి నుంచి నేటి వరకు విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వ పాఠశాలలలో కళాశాలలలో మౌలిక సదుపాయాల కల్పించాలని, పెండింగ్ లో ఉన్నటువంటి స్కాలర్షిప్ ,ఫీజు



రీయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని, మెస్ ,కాస్మోటిక్ చార్జీలను ధరలకు అనుగుణంగా పెంచాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, విద్యాశాఖ మంత్రిని వెంటనే కేటాయించాలని, గురుకుల విద్యార్థులకు సొంత భవనాలను కేటాయించాలని అనేక సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు, ఉద్యమాలు చేస్తున్న ఏకైక సంఘం ఏఐఎస్ఎఫ్ అని ఆయన అన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ ఇచ్చే పిలుపులకు విద్యార్థి లోకం ఏఐఎస్ఎఫ్ ఇచ్చే పిలుపులను విజయవంతం చేయాలని, విద్యార్థులకు అండ, ఏఐఎస్ఎఫ్ జెండా ఎల్లప్పుడూ ఉంటదని ఆయన అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మొలుగూరి నితిలేష్, జిల్లా కోశాధికారి ఎల్కపల్లి సురేష్, రామగుండం కార్పొరేషన్ అధ్యక్షులు మాతంగి సాగర్, గొడిసెల ప్రణీత్, తడిగొప్పుల సాయి అనుప్, కట్ల అభినయ్ , రౌతు విదిష తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో పిహెచ్సీ ఎల్డీసీ

మంచిర్యాల

కోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎల్డీసీ గడియారం శ్రీనివాస్ మంచిర్యాల లో లంచం తీసుకుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన సీహెచ్వో తోట వేముకటేశ్వర్లు నుండి అయన ఆరు వేల రూపాయలు వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు దొరికిపోయాడు.

# స్త్రీ శక్తికి అంతా సిద్ధం

విజయవాడ, ఆగస్టు 12,

మహిళల అభివృద్ధితోనే దేశ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది. మహిళా అభివృద్ధికి దోహదం చేసేవిధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూపొందించిన మరో పథకం 'స్త్రీ శక్తి' . ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారు. మహిళలు చదువుకోవడానికి, ఉద్యోగాలు చేయడానికి, వ్యాపారాలు చేసుకునేందుకు ఈ పథకం ఉపయోగపడుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో నివాసం ఉండే మహిళలందరూ ఈ పథకానికి అర్హులే. 2025 ఆగష్టు 15 నుంచి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఈ పథకం ప్రారంభం కానుందిమహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం పేరు 'స్త్రీ శక్తి'. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి ఈ పథకం అమలు చేయనుంది. ఈ పథకం ద్వారా మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్‌లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం కల్పిస్తున్నారు. స్త్రీ శక్తి పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు ప్రభుత్వం ఆగస్టు 11న విడుదల చేసింది. 5 రకాల బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యాన్ని అందిస్తున్నారు.ంఖూఖీఅ బస్సుల్లో దాదాపు 75% బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. మంత్రి నారా లోకేష్ చొరవతో రాష్ట్ర స్థాయిలో 5 రకాల బస్సుల్లో ఈ పథకాన్ని అమలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి నెలకు రూ.1000 ఆదా అవుతుందని ఆయన చెప్పారు. అయితే, కొన్ని ప్రత్యేక బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతి లేదు.

ఆంధ్రప్రదేశ్‌లో స్థిర నివాసి అయుండాలి.

బాలికలు/ మహిళలు అయుండాలి.

ట్రాన్స్‌జెండర్లు కూడా ఉచిత ప్రయాణానికి అర్హులు.

నిర్దిష్ట గుర్తింపు కార్డు కలిగి ఉండాలి.

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం ఉద్దేశించిన స్త్రీ శక్తి పథకం కింద లబ్ధి పొందేందుకు మహిళలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నివాసి అని తెలిపే ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డును చూపించాలి. ఆర్టీసీ బస్సుల్లో ప్రధానంగా కింద పేర్కొన్న మూడు రకాల గుర్తింపు కార్డులను అంగీకరిస్తారు. అవి:

ఆధార్ కార్డు

ఓటర్ ఐడీ కార్డు

రేషన్ కార్డు

ఏయే బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు?

స్త్రీ శక్తి పథకం ద్వారా కింద పేర్కొన్న బస్సుల్లో మాత్రమే మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చు.

? పల్లె వెలుగు

? అల్ట్రా పల్లె వెలుగు

? ఎక్స్‌ప్రెస్

? సిటీ ఆర్డినరీ

? మెట్రో ఎక్స్‌ప్రెస్

నాన్ స్టాప్ బస్సుల్లో ఉచిత ప్రయాణం వర్తించదు.

ఇతర రాష్ట్రాల మధ్య తిరిగే అంతర్రాష్ట్ర బస్సు సర్వీసుల్లో ఉచిత ప్రయాణం వర్తించదు.

సప్తగిరి ఎక్స్ ప్రెస్, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, స్టార్ లైనర్ సహా ఇతర ఏసీ బస్సుల్లో స్త్రీ శక్తి పథకం వర్తించదు.

తిరుమల - తిరుపతి మధ్య తిరిగే సప్తగిరి బస్సుల్లో ఉచిత ప్రయాణం వర్తించదు.

కాంట్రాక్ట్ క్యారేజీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వర్తించదు. (ఆర్టీసీ అద్దెకు తీసుకొని నడిపే ప్రైవేట్ వ్యక్తుల బస్సులు)

చార్టర్డ్ సర్వీసుల్లో ఉచిత ప్రయాణం వర్తించదు.

ప్యాకేజీ టూర్ బస్సుల్లో ఉచిత ప్రయాణం వర్తించదు.

ఒక జిల్లాకు చెందిన వ్యక్తి (మహిళ) ఆ జిల్లా పరిధిలో ఎక్కడైనా ఉచిత ప్రయాణం చేయవచ్చని, ఇతర జిల్లా పరిధిలో ఉచిత ప్రయాణం చేయడానికి అనుమతి ఉండదని గతంలో వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో స్త్రీ శక్తి పథకం ద్వారా జిల్లాల మధ్య ప్రయాణించేందుకు అనుమతి ఉంటుందా? లేదా? అని చాలా మందిలో సందిగ్ధం ఉంది. అయితే, ప్రభుత్వం గానీ, ఏపీ ఆర్టీసీ గానీ.. ఇప్పటివరకూ అలాంటి నిబంధన గురించి ప్రస్తావించలేదు. జిల్లాల మధ్య ప్రయాణించడానికి ఎలాంటి ఆంక్షలు లేవు. ఈ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడ నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చు.

స్త్రీ శక్తి పథకం ప్రయోజనాలు:

స్త్రీ శక్తి పథకం ద్వారా విద్య, ఉద్యోగం, ఇతర అవకాశాల కోసం ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు.

ఈ పథకం ద్వారా మహిళలకు ఆర్థిక భారం తగ్గుతుంది.

పేద కుటుంబాలకు ఈ పథకం ద్వారా ఆర్థిక భారం తగ్గుతుంది.

ప్రయాణ ఖర్చుల గురించి ఆలోచించకుండా మహిళలు తమ పనులను సులుభంగా చేసుకోగలుగుతారు.

మహిళా సాధికారతకు ఈ పథకం దోహదపడుతుంది.

బాలికలు ఉన్నత విద్య చదివేందుకు ఈ పథకం ప్రోత్సహిస్తుంది.

ట్రాన్స్‌జెండర్లకు ఆర్థిక భారం తగ్గుతుంది, గౌరవం పెరుగుతుంది.

స్త్రీ శక్తి పథకం అమలుకు ఆర్టీసీ ఎలాంటి ఏర్పాట్లు చేస్తోంది?

స్త్రీ శక్తి పథకంతో బస్సుల్లో రద్దీ పెరగనుంది. రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

బస్టాండ్లలో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చించేందుకు చర్యలు చేపట్టారు. అదనంగా కుర్చీలను ఏర్పాటు చేయనున్నారు. ప్రయాణికులకు ఫ్యాన్లు, తాగునీరు, టాయిలెట్ సదుపాయాలను మెరుగుపరుస్తారు.

ఇతర రాష్ట్రాల్లో అనుభవాల దృష్ట్యా అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది.

బస్సులన్నింటిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.

కండక్టర్లకు బాడీ ఓర్న్ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆర్టీసీని ప్రభుత్వం ఆదేశించింది.

స్త్రీ శక్తి పథకం అమలు ఇలా..

స్త్రీ శక్తి పథకం అమలు కోసం ఆర్టీసీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. టిమ్స్ మెషిన్ల ద్వారా జీరో టికెట్స్ కొట్టడం పైనా శిక్షణ ఇచ్చారు. లబ్ధిదారులకు కండక్టర్ 'జీరో-ఫేర్ టికెట్' జారీ ఇస్తారు. అయితే, ఆ ప్రయాణానికి సంబంధించిన డబ్బులను ఆర్టీసీకి ప్రభుత్వం తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. అందువల్ల ఏ స్టేజీ నుంచి ఏ స్టేజీ వరకు ప్రయాణించారనే వివరాలను కండక్టర్ పక్కాగా నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ టికెట్లను బట్టి ఏపీఆర్టీసీకి ప్రభుత్వం డబ్బులు తిరిగి ఇవ్వడానికి వీలవుతుంది.

జీరో-ఫేర్ టికెట్ల జారీని నిర్వహించడానికి టిమ్స్ మెషిన్ల కోసం ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేశారు. ఇతర రాష్ట్రాల్లో అనుభవాల రీత్యా ఈ పథకాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నారు.ఉచిత బస్సు పథకం కోసం సంవత్సరానికి సుమారు రూ.1,942 కోట్లు ఖర్చవుతుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ మొత్తం డబ్బును ంఖూఖీఅకి ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది. ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున కొత్త బస్సులను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వీటిలో 1,050 ఎలక్ట్రిక్ బస్సులు కూడా ఉన్నాయి. తొలి దశలో 750 బస్సులు అందుబాటులోకి రానున్నాయి.

ఆటో డ్రైవర్లకు సాయం:

స్త్రీ శక్తి పథకం రాకతో ఆటో డ్రైవర్ల ఆదాయానికి గండిపడే ముప్పు ఉంది. ఆటోడ్రైవర్లకు ఏవిధంగా సాయం చేయాలనే అంశంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఆటో డ్రైవర్ సంఘాలతో చర్చించాలని మంత్రివర్గాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

స్త్రీ శక్తి పథకానికి సంబంధించి ఎలా ఫిర్యాదు చేయవచ్చు?

స్త్రీ శక్తి పథకం ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటివరకూ ఈ పథకానికి సంబంధించి అధికారిక వెబ్‌సైట్‌ను ప్రారంభించలేదు. ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ కూడా ప్రకటించలేదు. త్వరలో వీటిని తెలియజేసే అవకాశం ఉంది. స్త్రీ శక్తి పథకానికి సంబంధించిన మరిన్ని వివరాలను కూడా ప్రభుత్వం త్వరలో విడుదల చేయనుంది.

====================

# సూర్యలంక బీచ్ కు మహర్దశ..

గుంటూరు, ఆగస్టు 12,

పర్యాటక రంగం మీద ఏపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్‌ను అభివృద్ధి చేయాలని సంకల్పించింది. స్వదేశీ దర్శన్ 2.0 కార్యక్రమం కింద సూర్యలంక బీచ్ అభివృద్ధికి కేంద్రం రూ.98 కోట్లు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో సూర్యలంక బీచ్‌లో మౌలిక వసతుల అభివృద్ధి, పార్కింగ్ సౌకర్యాలు,. ఎలక్ట్రికల్ మినీ బస్సులు, బ్యాటరీ వాహనాలు వంటివి ఏర్పాటు చేయాలని అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. తొలివిడతలో 50 కోట్ల పనులకు టెండర్లు కూడా పిలిచారు.రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధి కోసం ఏపీ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే ఎయిర్‌డ్రోమ్‌ల అభివృద్ధి, హోమ్‌స్టేల నిర్మాణం, కారవాన్ టూరిజం వంటి సరికొత్త ఆలోచనలు చేస్తోంది. అలాగే రాష్ట్రంలో అడ్వెంచర్ టూరిజం, టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలోనే రాష్ట్రంలో ఉన్న పొడవైన సముద్రతీరాన్ని పర్యాటక రంగం అభివృద్ధి కోసం ఉపయోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. సముద్ర తీరం వెంట ఉన్న దర్శనీయ ప్రాంతాలు, సముద్ర తీరాల అభివృద్ధి మీద ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలోనే బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్‌కు త్వరలోనే మహర్దశ పట్టనుంది.సూర్యలంక బీచ్ అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వం సహకారంతో సూర్యలంక బీచ్ ను అన్నిరకాలుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా కేంద్ర పథకమైన స్వదేశీ దర్శన్ 2.0 కింద సూర్యలంక బీచ్‌ను అభివృద్ధి చేయనున్నారు. స్వదేశీ దర్శన్ 2.0 కార్యక్రమం కింద సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ.98 కోట్లు మంజూరు అయ్యాయి. దీంతో బీచ్ అభివృద్ధి కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదిక కూడా రూపొందించారు. తొలిదశలో రూ.50 కోట్ల పనులకు టెండర్లు పిలిచిన అధికారులు.. త్వరలోనే కాంట్రాక్టర్లకు పనులు అప్పగించనున్నారు. పనులన్నీ సకాలంలో పూర్తి అయితే సూర్యలంక బీచ్ రూపురేఖలు మారిపోనున్నాయి.స్వదేశీ దర్శన్ కింద మంజూరైన 98 కోట్ల రూపాయల నిధులతో సూర్యలంక బీచ్‌కు ఇరువైపులా స్వాగత ద్వారాలు ఏర్పాటు చేస్తారు. అలాగే కార్లు, బస్సులు, బైకుల కోసం పార్కింగ్ సౌకర్యాలు అభివృద్ధి చేయనున్నారు. సముద్ర తీరంలో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించి షాపులు ఏర్పాటు చేయనున్నారు. అలాగే సైక్లింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టనున్నారు. పాదచారుల కోసం వాకింగ్ ట్రాకులు.. బీచ్ చూడటానికి వచ్చే పర్యాటకుల కోసం రిసార్ట్‌లు, వ్యూపాయింట్‌లు నిర్మించనున్నారు.అలాగే సూర్యలంక బీచ్‌లో సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసి పటిష్టమైన భద్రతాఏర్పాట్లు చేయనున్నారు. డస్ట్‌బిన్‌ల ద్వారా చెత్త సేకరణ, రెండు ఎలక్ట్రికల్ మినీ బస్సులు, బ్యాటరీ వాహనాలు అందుబాటులో ఉండనున్నాయి. కార్లు, ఫోర్ వీలర్స్ కోసం 5 ఛార్జింగ్ స్టేషన్లు, ద్విచక్ర వాహనాల కోసం 3 ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు.

==============

# తప్పుడు ఫిర్యాదులతో అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారు


మంథని

మంథని మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన శనిగల శ్రీనివాస్ తప్పుడు ఫిర్యాదు చేస్తూ రెవెన్యూ అధికారులను పోలీసులను తప్పుదోవ పట్టిస్తున్నాడని ఆయన తల్లి శనిగల సుశీల సోదరి రామిడి పద్మ పేర్కొన్నారు. మంగళవారం మంథని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శనిగల సుశీల మాట్లాడుతూ తన భర్త శనిగల గంగయ్య ఇష్టపూర్వకంగానే కూతురుకు రూ. 42 లక్షలకు భూమి అమ్మడం జరిగిందని దానిని ప్రభుత్వ నిబంధనల ప్రకారమే రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందని దానిలో తాసిల్దార్ బండి ప్రకాష్ పాత్ర ఏమి లేదని ఆమె తెలిపారు. ఇప్పటికే నా భర్త పైన ఉన్న రెండు ఎకరాల భూమిని నా కొడుకు కోడలు పేరు పైకి మార్చుకున్నాడని వెంకటాపూర్ లో కట్టుకున్న ఇల్లును సైతం తన పేరు పైకి మార్చుకొని అమ్ముకున్నాడని ఆరోపించారు. తల్లిదండ్రులమైన మాకు మా కొడుకు శ్రీనివాస్ అన్నం పెట్టకపోవడం బాగోగులు చూసుకోక పోవడంతో గోదావరిఖని లోని మా కూతురు రామిడి పద్మ వద్ద ఆశ్రయం పొందుతుండగా అక్కడికి వచ్చి నా యొక్క బంగారం తాళిబొట్టు తీసుకెళ్లాడని, ఈ విషయం పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు అయిందన్నారు.

# రోజాకు బిగిస్తున్న ఉచ్చు

తిరుపతి, ఆగస్టు 12,

మాజీ మంత్రి ఆర్కే రోజా అరెస్ట్ కు రంగం సిద్ధమయినట్లు ప్రచారం ఊపందుకుంది. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పెద్దయెత్తున అవినీతి జరిగిందని కూటమి ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ నివేదికను ఈరోజు, రేపట్లో సమర్పించనుంది. ఈ నివేదిక తర్వాత ఆర్కే రోజాను అరెస్ట్ చేయడం ఖాయమని అంటును?నారు. ఇటీవల ఆర్కే రోజా రాజకీయంగా యాక్టివ్ అయ్యారు. ఆమె కూటమి ప్రభుత్వంపై పెద్దయెత్తున విమర్శలు చేస్తున్నారు. దీంతో ఆర్కే రోజా నేతృత్వంలో జరిగిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో నివేదిక అందిన తర్వాత యాక్షన్ తీసుకుంటారని అటున్నారు. అది ఎప్పుడన్నది చెప్పకపోయినా వంద కోట్లకు పైగానే ఈ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో అవినీతి జరిగిందిని విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ అధికారులు తేల్చినట్లు తెలిసింది. తెలుగుశం పార్టీలో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆర్కే రోజా తర్వాత వైసీపీలో చేరారు. నగరి నియోజకవర్గంలో రెండు సార్లు విజయం సాధించారు. మూడోసారి మాత్రం 2024 ఎన్నికల్లో గాలి భాను ప్రకాష్ చేతిలో ఓటమి



పాలయ్యారు. ఇటీవల కాలంలో కొన్ని బుల్లి తెర షోలలో కూడా ఆర్కే రోజా పాల్గొంటున్నారు. ఇదే సమయంలో వైసీపీకి వాయిస్ గా మారి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ లపై ఆర్కే రోజా తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు. దీంతో ఆర్కే రోజా లోకేశ్ రెడ్ బుక్ లో మొదటి పేజీలోనే పేరుందన్న టాక్ రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. దీంతో రోజా చుట్టూ ఉచ్చు బిగుసుకుంటున్నట్లు కనిపిస్తుంది. ఆర్కే రోజా వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తొలి రెండున్నరేళ్లు ఏపీఐఐసీ కార్పొరేషన్ ఛైర్మన్ గా పనిచేసి తర్వాత టూరిజం, క్రీడల శాఖ మంత్రిగా పదవి బాధ్యతలను చేపట్టారు. మంత్రిగా ఉన్న సమయంలో ఆడుదాం ఆంధ్ర పేరిట వైసీపీ ప్రభుత్వ హయంలో రాష్ట్రమంతటా క్రీడా సంబరాలను నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భారీగా నిధులు దుర్వినియోగం అయ్యాయని టీడీపీ నేతలు ఆరోపించారు. ఆడుదాం ఆంధ్రపేరిట వంద కోట్ల రూపాయల స్కామ్ జరిగిందని టీడీపీ నేతలు సీఐడీ అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే పాత్యా సంఘం, కబడ్డీ అసోసియేషన్ లు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై సీఐడీకి ఫిర్యాదు చేశాయి.. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో వంద కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని వారు ఆరోపించారు. విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ కూడా అదే తేల్చినట్లు తెలిసింది. ఆడుదాం ఆంధ్ర కేసులో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పేరు కూడా వినపడింది. పెద్దయెత్తున అవినీతి జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు గత కొన్నాళ్లుగా విచారణ చేసి దీనికి సంబంధించిన ఆధారాలను సేకరించారు. కేవలం వైసీపీకి చెందిన వారికే బహుమతులను అందచేశారని, అలాగే నిధులను ఖర్చు చేయడంలోనూ చేతివాటాన్ని ప్రదర్శించారని విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ విచారణలో వెల్లడయినట్లు తెలిసింది. దీంతో ఆర్కే రోజాను అరెస్ట్ చేస్తారన్న ప్రచారం జరుగుతుంది.

# కేంద్ర మంత్రి బండి సంజయ్ లీగల్ నోటీసు పంపించిన భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్:

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్), కేంద్ర హోం వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్‌కు లీగల్ నోటీసు పంపారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని, నిరాధారమైనవని, అవి తన ప్రతిష్టను దిగజార్చే ఉద్దేశంతో చేసినవని కేటీఆర్ లీగల్ నోటీసులో పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీన బండి సంజయ్ నిర్వహించిన పత్రికా సమావేశంలో చేసిన ఆరోపణలపై కేటీఆర్ ఈ నోటీసును పంపించారు.బండి సంజయ్ చేసిన ఆరోపణలు నిరాధారమైనవని, దురుద్దేశ పూరితమైనవని కేటీఆర్ తరపు న్యాయవాదులు నోటీసులో పేర్కొన్నారు. బండి సంజయ్ తన హోదాను దుర్వినియోగం చేస్తూ, ప్రజలలో కేటీఆర్ ప్రతిష్టను దిగజార్చడానికి ప్రయత్నిస్తున్నారని నోటీసులో ఆరోపించారు. కేవలం రాజకీయంగా వార్తల్లో నిలిచేందుకు అడ్డగోలుగా ప్రాపగండ చేస్తున్న బండి సంజయ్ పదేపదే ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని న్యాయవాదులు తెలిపారు. టెలిఫోన్ ట్యాపింగ్ ఆరోపణల వలన కేటీఆర్ ప్రతిష్టకు భంగం కలిగిందని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో పాటు ఆ తర్వాత మంత్రిగా కేటీఆర్ అనేక రంగాల్లో అద్భుతమైన సేవలు అందించారని అయితే బండి సంజయ్ పదేపదే చేస్తున్న వ్యాఖ్యలతో తన క్లైంట్ కేటీఆర్ పరువుకి భంగం కలుగుతుందని నోటీసులో పేర్కొన్నారు. మీడియా సమావేశంలో బండి సంజయ్ చేసిన ఏ వ్యాఖ్యలకు కూడా ఎలాంటి సాక్షాదారాలు లేవని, ఒక పార్లమెంటు సభ్యుడుగా కేంద్ర మంత్రిగా బాధ్యత కలిగిన పదవుల్లో ఉండి మరొక శాసనసభ్యుడు పైన అసత్య పూరిత అడ్డగోలు వ్యాఖ్యలు చేయడానికి లీగల్ నోటీసులు న్యాయవాదులు ప్రస్తావించారు. బండి సంజయ్ చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారం లేదని, ఇవి కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే చేశారని నోటీసులో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో, కేటీఆర్ తరపున బండి సంజయ్ కేటీఆర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, కేటీఆర్ మరియు అతని కుటుంబ సభ్యులపై భవిష్యత్తులో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎటువంటి దురుద్దేశపూర్వక వ్యాఖ్యలు చేయకుండా ఉండాలని నోటీసులో డిమాండ్ చేశారు. నోటీసు అందిన ఏడు రోజులలోగా ఈ డిమాండ్లను పాటించని పక్షంలో, చట్టపరంగా సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆరోపణల వల్ల కలిగిన నష్టానికి బండి సంజయ్ బాధ్యత వహించాల్సి ఉంటుందని నోటీసులో పేర్కొన్నారు.

# తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం కు గొల్ల కురుమల సమస్యపై వినతి పత్రం

భీమారం

ఈరోజు హైదరాబాద్ మినిస్టర్స్ క్వాటర్స్ లో తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ ని మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు గొల్ల కురుమల ఆర్థిక అభివృద్ధి 42 బిసి రిజర్వేషన్లు అమలుపరచాలని సమస్యపై వినతి పత్రం అందజేసిన తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ ఇస్తూ ఆయన మాట్లాడుతూ నూతన జిల్లాలు ఏర్పడిన తర్వాత సహకార సంఘాలను విభజన చేసి సహకార సంఘాలకు ఎన్నికలు జరపాలని చిన్నాభిన్నమై వృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా తగిన న్యాయం చేయాలని గొర్రెలు మేకలు బర్రెలు 80% సబ్సిడీతో లోన్లు మంజూరు చేయాలని. పాడి పశువులు గొర్రెలు మేకలను అడవిలో మేపుకొనుటకు హక్కులని కల్పించాలని ప్రమాదవశాత్తు మరణించిన జీవాలకు గొర్రెలకు మేకలకు పాడి పశువులకు నష్టపరిహారం ఇవ్వాలని చదువుకున్న యువతి యువకులకు పశుసంవర్ధక శాఖలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పాల ఉత్పత్తి అభివృద్ధి చెందడానికి మినీ పాల డైరీలకు 80% సబ్సిడీ ఇవ్వాలని 50 సంవత్సరాలు దాటిన వృద్ధులకి 5000 రూపాయల పింఛన్ ఇవ్వాలని ప్రమాదవశాత్తు మరణించిన గొర్రెల కాపరులకు 15 లక్షల ప్రమాద బీమా ఇవ్వాలని బిసి 42% రిజర్వేషన్ త్వరగా అమలుపరచాలని స్థానిక ఎన్నికల్లో జెడ్పిటిసి ఎంపిటిసి సర్పంచుల మరియు విద్యా ఉద్యోగాల్లో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలని మండలానికి ఒక వారసంత నియోజకవర్గానికి ఒక్క కమ్యూనిటీ హాల్ జిల్లాకు ఒక మానస విక్రియ కేంద్రం కేటాయించ లని వినతి పత్రం అందజేశారు అనంతరం బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు సానుకూలంగా స్పందించి తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దృష్టికి తీసుకువెళ్లి గొల్ల కురుమల సమస్యలపై తగిన న్యాయం చేస్తామని అన్నారు సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం వ్యవస్థాపకులు రాష్ట్ర అధ్యక్షులు సౌధాని భూమయ్య యాదవ్ ఎం కె రాజేష్ తదితర పాల్గొన్నారు.

# ఎల్బీనగర్ లో గ్యాంగ్ వార్

హైదరాబాద్

ఎల్బీ నగర్ లో విద్యార్ధులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. శుక్రవారం రోజు జరిగిన ఘటన, అలోస్యంగా వెలుగులోకి వచ్చింది. కొట్టుకున్న వాళ్లంతా అవినాష్ కాలేజి విద్యార్థులు. తరుచు గోడవలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక గ్యాంగ్ పై మరో గ్యాంగ్ దాడి చేసుకొని దృశ్యాలు..సిసి ఫోటేజ్ లో రికార్డ్ అయ్యాయి. గ్యాంగ్ వార్ పై ఎల్బీనగర్ పోలీసులు కేసులు నమోదు చేసారు. మొత్తం 15మందిపై ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు

# గులాబీ దళపతి మౌనమేలనోయి...

హైదరాబాద్, ఆగస్టు 12,

తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్. మొదటి లక్ష్యం సాధించింది. స్వరాష్ట్రం సిద్ధించింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ప్రజలు.. రాష్ట్రం సాధించిన పార్టీగా 2014లో గులాబీ పార్టీకే పట్టం కట్టారు. మరోసారి 2018లో కూడా అవకాశం ఇచ్చారు. దీంతో తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ బలమైన శక్తిగా ఎదిగింది. కానీ ఇప్పుడు పతనం దిశగా పయనిస్తోంది. గులాబీ బాస్ కేసీఆర్ వారసుల చెరోదారి.. నాయకత్వ సంక్షోభం, వ్యక్తిగత విమర్శలతో కూడిన సోషల్ మీడియా వ్యూహంతో కొట్టుమిట్టాడుతోంది. గువ్వల బాలరాజు వంటి నాయకుల వలసలు, పార్టీ సోషల్ మీడియా విధానాలు, ప్రజా సమస్యలపై పోరాటాల లేమి వంటి అంశాలు బీఆర్ఎస్ దిగజారుడుకు కారణాలుగా కనిపిస్తున్నాయి.బీఆర్ఎస్ నుంచి ఇటీవల బీజేపీలో చేరిన గువ్వల బాలరాజు వ్యవహారం పార్టీలోని అంతర్గత సమస్యలను స్పష్టంగా తెలియజేస్తోంది. బాలరాజు తన రాజీనామా లేఖలో బీఆర్ఎస్ నాయకత్వాన్ని గౌరవిస్తూనే, తన రాజకీయ భవిష్యత్ కోసం బీజేపీలో చేరినట్లు పేర్కొన్నారు. అయితే, బీఆర్ఎస్ సోషల్ మీడియా బృందం ఆయనను, ఆయన భార్యను వ్యక్తిగతంగా విమర్శిస్తూ, అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా పార్టీ ఇమేజ్‌ను మరింత దిగజార్చింది. రాజకీయ నాయకులు ఒక పార్టీ నుంచి మరొక పార్టీకి వెళ్లడం సర్వసాధారణం. అయితే, వలసపోయే నాయకులపై వ్యక్తిగత దాడులు చేయడం, బూతులతో కూడిన సోషల్ మీడియా పోస్ట్‌లు చేయడం వంటివి గులాబీ పార్టీకి రాజకీయంగా నష్టం కలిగిస్తున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో నడిచే సోషల్ మీడియా పోస్టులు ఆయనకు తెలియకుండా వస్తున్నవి కావన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటువంటి విమర్శలు ప్రజల్లో పార్టీపై చిరాకు, అసహ్యం కలిగించే అవకాశం ఉంది. బాలరాజు స్పందన కూడా ఈ విమర్శలకు బదులుగా తీవ్రంగా ఉండటం, బీఆర్ఎస్ వ్యూహం రివర్స్ అవుతున్నట్లు సూచిస్తోంది.బీఆర్ఎస్ సోషల్ మీడియా వ్యూహాలను ఏపీలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విధానాలతో పోలుస్తున్నారు. వ్యతిరేకులపై అనుచిత వ్యాఖ్యలు, బూతులతో కూడిన ట్వీట్‌లు, తప్పుడు ప్రచారం చేయడం వంటివి బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రధాన లక్షణాలుగా మారాయి. ఈ విధానం ఓటర్లను ఆకర్షించడంలో విఫలమవడమే కాక, పార్టీకి ఉన్న మద్దతుదారులను కూడా అసంతృప్తికి కారణమవుతోంది. సోషల్ మీడియాను రాజకీయ ఆయుధంగా ఉపయోగించుకోవచ్చు, కానీ అది సానుకూలంగా, ఆకర్షణీయంగా ఉండాలి. బీఆర్ఎస్ విషయంలో, సోషల్ మీడియా బృందం ప్రతికూల వ్యాఖ్యలపై దృష్టి సారించడం వల్ల పార్టీ ఇమేజ్ దెబ్బతింటోంది.ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ ప్రజా సమస్యలపై గ్రౌండ్ లెవల్‌లో ఎలాంటి పోరాటం చేయలేదు. పార్టీ నిర్వహించే కార్యక్రమాలు ఎక్కువగా రాజకీయ లక్ష్యాలతో లేదా కేసీఆర్ సమస్యల చుట్టూ తిరుగుతున్నాయి. తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న నిజమైన సమస్యలు ఉపాధి, విద్య, ఆరోగ్యం, లేదా రైతు సమస్యలపై బీఆర్ఎస్ ఎలాంటి ఉద్యమం చేపట్టలేదు. కేవలం రాజకీయ లాభాల కోసం కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పార్టీ ప్రజల నుంచి దూరమవుతోంది. ఒక బలమైన ప్రతిపక్షంగా, ప్రజల సమస్యలను గుర్తించి, వాటి కోసం గళమెత్తి, ఉద్యమాలు నడిపితేనే ప్రజల విశ్వాసం సంపాదించగలదు.బీఆర్ఎస్ నాయకత్వం స్పష్టమైన దిశానిర్దేశం లేకుండా కొట్టుమిట్టాడుతోంది. పార్టీ నుంచి నాయకులు వలసపోవడం, సోషల్ మీడియాలో అనుచిత వ్యవహారం, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కూడా వ్యక్తిగత దూషణలకు దిగడం, దిగజారుడు మాటలు మాట్లాడడం, ఇక కవిత సొంత పార్టీకి దూరం కావడం, గులాబీ నేతలపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం బీఆర్ఎస్ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. పార్టీ నాయకత్వం ఒకప్పుడు తెలంగాణ ఉద్యమానికి ఊపిరిగా నిలిచినప్పటికీ, ప్రస్తుతం పార్టీలో కొత్త నాయకత్వం, కొత్త వ్యూహాలు అవసరమైన సమయంలో పాత విధానాలతోనే ముందుకెళ్లడానికి ప్రయత్నిస్తోంది.

# రఘునందనరావుకు ఆగని బెదిరింపులు

మెదక్, ఆగస్టు 12,

తెలంగాణకు చెందిన ఓ ఎంపీకి మూడు నెలలుగా బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. అంతకు ముందు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు కూడా ఇలాగే బెదిరింపు కాల్స్ వచ్చేవి. ఫోన్ చేసిన అగంతకులు ఇద్దరికీ చంపేస్తామని హెచ్చరిస్తున్నారు. ఇప్పుడ రాజాసింగ్‌కు బెదిరింపు కాల్స్ తగ్గాయి. మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు పెరిగాయి మూడు నెలల్లో ఆరుసార్లు బెదిరింపు కాల్స్ వచ్చాయి. గతంలో రాజాసింగ్‌కు ఫోన్ చేసిన అగంతకులను పోలీసులు పట్టుకోలేదు. ఆయనకు దుబాయ్ నుంచి కాల్స్ వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. కానీ, ఎవరినీ పట్టుకోలేదు. ఇక మెదక్ ఎంపీకి వస్తున్న బెదిరింపు కాల్స్ మధ్యప్రదేశ్ నుంచి వస్తున్నట్లు మాత్రం గుర్తించారు. కానీ, ఇప్పటి వరకు ఎవరినీ పట్టుకోలేదు. దీంతో అగంతకులు రెచ్చిపోతున్నారు. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోనే ఉన్నామని, సాయంత్రం వరకు చంపేస్తామని హెచ్చరించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎవరినీ పట్టుకోలేదు. తెలంగాణ పోలీసులు లేదా కేంద్ర నిఘా సంస్థలు దుండగులను గుర్తించడంలో విఫలమవుతున్నాయి. అత్యాధునిక సాంకేతికత, కమాండ్ కంట్రోల్ సెంటర్‌లు అందుబాటులో ఉన్నా దుండగులను గుర్తించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.రఘునందన్ రావు గత జూన్ నుంచి ఆరు బెదిరింపు కాల్స్ వచ్చాయి. వీటిలో కొన్ని మావోయిస్టుల పేరుతో వచ్చాయి. ఈ కాల్స్‌లో దుండగులు ఆయనను సాయంత్రం లోగా చంపేస్తామని, హైదరాబాద్‌లోనే ఉన్నామని బెదిరించారు. కొన్ని సందర్భాల్లో, ఆంధ్రప్రదేశ్ మావోయిస్టు కమిటీ ఆదేశాల మేరకు ఐదు బృందాలు ఆయనను లక్ష్యంగా చేసుకున్నాయని కూడా చెప్పారు. ఈ బెదిరింపులు ఛత్తీస్‌గఢ్‌లోని ఆపరేషన్ కాగర్‌కు ప్రతీకారంగా ఉండవచ్చని అనుమానిస్తున్నారు. అయితే, ఈ కాల్స్ వెనుక నిజమైన ఉద్దేశం లేదా గుర్తింపు ఇంతవరకు స్పష్టంగా తెలియలేదుతెలంగాణ ప్రభుత్వం కోట్ల రూపాయల



వ్యయంతో నిర్మించిన కమాండ్ కంట్రోల్ సెంటర్, అత్యాధునిక సాంకేతికతను పోలీసులకు అందుబాటులోకి తెచ్చినప్పటికీ, ఈ కేసులో ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. కాల్స్ మధ్యప్రదేశ్ నుంచి వస్తున్నట్లు గుర్తించినప్పటికీ, దుండగులను ట్రేస్ చేయడంలో పోలీసులు విఫలమవుతున్నారు. కాల్స్ ఇంటర్నెట్ ఆధారిత సేవల ద్వారా వస్తున్నాయని, దీనివల్ల దుండగుల వివరాలను గుర్తించడం కష్టమవుతోందని కొన్ని నివేదికలు సూచిస్తున్నాయి. తెలంగాణ, మధ్యప్రదేశ్ పోలీసుల మధ్య సమన్వయం సరిగా లేదని తెలుస్తోంది. కొందరు ఈ వైఫల్యం వెనుక రాజకీయ కారణాలు ఉండవచ్చని, దుండగులను కావాలనే పట్టుకోవడం లేదని అనుమానిస్తున్నారు.బెదిరింపుల నేపథ్యంలో రఘునందన్ రావుకు పోలీసులు భద్రతను కల్పించారు. సాయుధ సిబ్బంది, ఎస్కార్ట్ వాహనం అందుబాటులో ఉన్నాయి. అయినప్పటికీ, వరుస బెదిరింపులు ఆయన అనుయాయులు, పార్టీ కార్యకర్తల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఘటనలు రాజకీయ నాయకుల భద్రతపై ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ముఖ్యంగా, ఒక ఎంపీకి వస్తున్న బెదిరింపులను నియంత్రించలేనప్పుడు సామాన్య పౌరుల భద్రత గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది.

# కృష్ణా జిల్లాలో యూరియా కొరత రైతుల అందోళన

విజయవాడ

కృష్ణా జిల్లాలో యూరియా కొరత ఏర్పడింది. దీంతో రైతులు పలు పిఎసిఎస్ల వద్ద ఆందోళనకు దిగారు. సమస్యను పరిష్కరించాలని, పూర్తి స్థాయిలో యూరియా అందించాలని నినాదాలు చేశారు. అవసరం మేరకు యూరియా సరఫరా రాకపోవడంతో రైతులకు అధికారులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ముదునూరు పిఎసిఎస్ గోదాము వద్ద రైతులు ఆందోళనకు దిగారు. ఎకరాకు అరకట్ట యూరియా మాత్రమే అందించడంతో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పూర్తి స్థాయిలో యూరియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై పిఎసిఎస్ సిఇఒ భరత్ స్పందిస్తూ, 170 టన్నుల యూరియా రావాల్సి ఉండగా, 70 టన్నులు మాత్రమే వచ్చిందని రైతులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. కొంతమందికి మాత్రమే అందింది కొంతమందికి అందకపోవడంతో నిరసన తెలిపారు. ఎరువులు కావాలని సొసైటీకి వెళితే పాసుపుస్తకం, గుర్తింపు కార్డు కావాలని అడుగుతున్నారని, తమకు గుర్తింపు కార్డు ఇవ్వనందున ఎక్కడ నుంచి తాము తెస్తామని వారు ప్రశ్నించారు. తమకూ యూరియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# హిమాయత్ సాగర్ జలాశయానికి కొనసాగుతున్న వరద

రంగారెడ్డిజంట జలాశయాల్లో ఒకటైన హిమాయత్ నగర్ జలాశయానికి వరద కొనసాగుతోంది. అధికారులు మూడు గేట్లు పైకెత్తి నీటిని మూసీలోకి వదిలారు. ఇన్ ఫ్లో 2000 , ఔట్ ఫ్లో 1400 క్యూసెక్కులు. ఈ నేపధ్యంలో తిరిగి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డును మూసివేసారు. రాజేంద్రనగర్, హిమాయత్ సాగర్ వైపు రాకపోకలకు అంతరాయం కలిగింది. మూసీ పరీవాహక ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు,.

# పులివెందులలో పోలింగ్ తీరును తప్పుపట్టిన వైసీపీ

కడపఆర్.తుమ్మలపల్లిలో పోలింగ్ కేంద్రం దగ్గర కూటమి నేతలు విందు ఏర్పాటు చేసుకున్నారు. ఎన్నికల సంఘం నిర్వీర్యమైందని వైసీపీ అభ్యర్థి హేమంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్లను బెదిరించి ప్రలోభాలకు గురి చేస్తున్నారు. ఏజెంట్లను కూటమి నేతలు తరిమికొడుతున్నారు. పోలింగ్ సక్రమంగా జరిగితే గెలుపు నాదేనని అయన అన్నారు.

పోలింగ్ బూత్ల దగ్గరకు ఓటర్లను రానివ్వడంలేదు. ఓటర్లు ధైర్యం చేసి వెళ్తే కర్రలతో కొడుతున్నారని అయన అన్నారు.

# పార్లమెంట్ లో కాంగ్రెస్ ఎంపీల వినూత్న ప్రదర్శన

న్యూఢిల్లీపార్లమెంట్ లో మంగళవారం నాడు కాంగ్రెస్ ఎంపిలు వినూత్న ప్రదర్శనకు దిగారు. మింతాదేవి బొమ్మతో కూడిన టీ షర్టు ధరించి ప్రదర్శన చేసారు. మింతాదేవి మొట్టమొదటి ఓటరుగా నమోదు చేసుకున్న మహిళ. ఆమె వయసు 124 సంవత్సరాలు. 124 నాట్ అవుట్ అన్న నినాదాన్ని టీ షర్ట్ పై రాసుకుని ఎంపీల ప్రదర్శన కొనసాగింది. ఎన్నికల కమిషన్ తప్పిదాలను వెలికి తీసేందుకు చేస్తున్న ప్రయత్నంలో భాగంగా ప్రదర్శన జరిగింది.

# రిజర్వేషన్లపై తర్జనభర్జనలు కిం కర్తవ్యం...

హైదరాబాద్, ఆగస్టు 12,

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం మల్లగుల్లా లు పడుతున్నది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిన బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉంది. మరోవైపు ప్రత్యేకంగా తీసుకొచ్చిన ఆర్డినెన్స్ గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉంది. ఇది లాఉండగా రాజ్యాంగ సవరణ చేయాల్సిన కేంద్ర ప్రభుత్వంలోని బీజేపీ బిల్లుపై కొర్రీలు పెడుతుంటే, రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలు, ప్రభుత్వం కావాలనే జాప్యం చేస్తున్నదని ఆరోపణలు గుప్పిస్తు న్నాయి.

దీనికితోడు తమకు చట్టబద్ధమైన రిజర్వేషన్లే కావాలని బీసీలు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం సందిగ్ధంలో పడింది. అయితే ప్రస్తుతం ప్రభుత్వం ముందు మూడు మార్గా లు ఉన్నాయి. ఒకటి రిజర్వేషన్‌ను అమలు చేస్తూ ప్రత్యేక జీవోను విడుదల చేయడం. రెండోది స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేయడం. మూడోది పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్లు కేటాయించడం.ఈ విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ వెల్లడించారు. దీనికి తోడు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ నెల 16, 17వ తేదీల్లో పీసీసీ, పీఏసీ సమావేశాలు జరిగే అవకాశం ఉ న్నందున బీసీ రిజర్వేషన్ల అంశంపై సుదీర్ఘంగా చర్చించినట్టు సమాచారం. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ముందు మూడు మార్గాలున్నప్పటికీ బీసీ రిజర్వేషన్ అంశాన్ని కొలిక్కి తీసుకొచ్చే మార్గంపై తర్జన భర్జన పడుతున్నట్టు తెలుస్తోంది. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని పరిష్కరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభు త్వం ఇప్పటికే అసెంబ్లీలో బిల్లు పెట్టింది. ప్రత్యేకంగా ఆర్డినెన్స్ రూపొందించింది. అయితే చివరగా రిజర్వేషన్లను అమలు చేస్తూ జీవో విడుదల చేయడమే మిగిలి ఉంది. ఈ క్రమంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తూ జీవో విడుదల చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తుంది. అయితే గత పదేళ్లలో దా దాపు 8 రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో బీసీలకు రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి నిర్ణయా లు జరిగాయి.కానీ వాటిని కోర్టులు కొట్టివేయడమో లేక స్టే ఇవ్వడమో జరిగింది. అయి తే బీసీ రిజర్వేషన్ అంశాన్ని షెడ్యూల్ 9లో చేర్చితేనే కోర్టుల్లో వేసే సవాళ్లను వంద శాతం ఎదుర్కొని బీసీల రిజర్వేషన్ అంశం నిలుస్తుందని బీసీ మేధావులు చెబుతున్నారు. దీనికి తోడు షెడ్యూల్ 9లో చేర్చినా కోర్టులో సమీక్ష చేయవచ్చనే వాదన కూడా వినపడుతున్నది.రిజర్వేషన్‌కు సంబంధించిన అంశాలు రాజ్యాంగ స్వరూపానికి వ్యతి రేకంగా ఉంటేనే కొట్టేస్తామని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఈ క్రమంలో బీసీ రిజర్వేషన్ల అంశంపై న్యాయపరమైన సమీక్షకు ఆస్కా రం లేకుండా, షెడ్యూల్ 9లో పెడితేనే రిజర్వేషన్లకు రక్షణ ఉంటుందని పలువురు వాదిస్తున్నారు. సెప్టెంబర్ 30వ తేదీలోపు రిజర్వేషన్ అంశం తేల్చాలని, లేని పక్షంలో పాత రిజర్వేషన్ల ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వ హించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం పరిస్థితుల్లో హైకోర్టు నిర్దేశించిన గడువులోగా రిజర్వేషన్ల అంశం కొలిక్కి వచ్చేలా కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ఎన్నికలను వాయిదా వేయడం ఒక మార్గంగా రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. అయితే ఎన్నికలను వాయిదా వేస్తే గ్రామా ల్లో పరిపాలన మరింత కష్టంగా మారనున్నది.ఇప్పటికే సర్పంచుల పదవీకాలం ము గిసి ఏడాదిన్నర అవుతుంది. గ్రామ పంచాయతీల్లో పాలక మండలి లేక నిధులు మం జూరు జాప్యం జరుగుతుంది. ఈ క్రమంలో గ్రామాల్లో పాలన సజావుగా సాగడం లేదు. ఈ కారణంగా గ్రామాల అభివృద్ధి కుంటుపడుతున్నది. దీంతో వెంటనే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించి గ్రామాలకు నిధులు మంజూరు చేయాలని పెద్దఎత్తున డిమాం డ్లు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదావేసే అవకాశం లేకుండాపోయింది.వాస్తవానికి బీసీ రిజర్వేషన్ల అమలు చేసే ప్రక్రియ మొదలుపెట్టినప్పటి నుంచి కాం గ్రెస్ ప్రభుత్వం పార్టీ పరంగా రిజర్వేషన్ల అం శాన్ని ప్రస్తావిస్తూ వస్తున్నది. రిజర్వేషన్లకు ఎలాంటి అడ్డంకులు తలెత్తినా పార్టీ పరంగానైనా బీసీలకు సీట్లు కేటాయిస్తామని సీ ఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే చాలాసార్లు ప్రకటించారు. కానీ పార్టీ పరంగా ఇచ్చే రిజర్వే షన్లను బీసీలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు. ఆ రకంగా వర్తించే రిజర్వేషన్లతో బీసీలకు నష్ట మే తప్పా లాభం లేదని కుండబద్ధలు కొట్టినట్టు చెబుతున్నారు.పార్టీ పరంగా టిక్కెట్లు ఇచ్చే క్రమంలో బీసీలకు ఓడిపోయే స్థానాలను కట్టబెడతారని ఆరోపిస్తున్నారు. దీంతో పాటు ఒక పార్టీ బీసీకి సీటు ఇచ్చి, వేరొక పార్టీ అగ్రవర్ణాలకు చెం దిన అభ్యర్థికి టిక్కెట్టు ఇస్తే, వారిని ఆర్థికంగా, రాజకీయంగా బీసీలు ఎదుర్కో గల రా అని ప్రశ్నిస్తున్నారు. బీసీలతో బీసీలే పో టీ పడాలని డిమాండ్ చేస్తున్నారు. రా జ్యాంగ సవరణ, చట్టబద్ధమైన రిజర్వేషన్లతో మాత్రమే ఇది సాధ్యమవుతుందని వాదిస్తున్నారు.కాంగ్రెస్ పార్టీ నిర్ణయం మంచిదే అయినా బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్ అనివార్యమని స్పష్టం చేస్తున్నారు. బీసీలకు పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇచ్చే ఆలోచన ఉన్నప్పటికీ చివరగా జీవో విడుదల చేసే ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తోంది. న్యాయపరమైన సమస్యలు తలెత్తే క్రమంలో జీవో విడుదల చేసిన వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నది.ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత న్యాయస్థానాలు జోక్యం చేసుకోవని భావిస్తున్నది. ఎవ రూ కోర్టుల్లో సవాల్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అనుకుంటున్నది. ఇందులో భాగంగా బీసీ రిజర్వేషన్ల అమలు కోసం వి డుదల చేసే జీవో అంశంపై అన్ని రాజకీయ పార్టీలను సంప్రదించనున్నట్టు సమాచారం.

## కొంప ముంచుతున్న డేటింగ్ యాప్స్...

హైదరాబాద్, ఆగస్టు 12,

ప్రస్తుతం డేటింగ్ యాప్‌లు ఎక్కువగా ఉంటున్నాయి. ఇందులో తెలియని వ్యక్తులతో డేటింగ్ చేస్తుంటారు. చివరకు ఇదే కొంపముంచుతుంది. తాజాగా ఇలాంటి ఘటనే హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఎల్‌జీబీటీ డేటింగ్ యాప్ ద్వారా హైదరాబాద్‌కు చెందిన ఓ 65 ఏళ్ల వ్యక్తి ఓ యువకుడితో మాట్లాడాడు. మొదట్లో చాటింగ్ చేసుకునే వారు. ఆ తర్వాత ఓ హోటల్‌లో ఇద్దరు కలిశారు. వీరిద్దరూ కలిసి నగ్నంగా ఉన్న సమయంలో మరో ఇద్దరు వ్యక్తులు వీరి ఫొటోలు తీసి బెదిరించారు. 65 ఏళ్ల వ్యక్తి నుంచి డబ్బులు వసూలు చేశారు. ఎన్ని సార్లు ఇచ్చినా మళ్లీ అడగడంతో ఆ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు.ప్రస్తుతం హైదరాబాద్‌లో ఇలాంటి కేసులు పెరుగుతున్నాయి. ఇలాంటి డేటింగ్ యాప్‌లో కలిసి మోసం చేస్తున్నారు. ఎక్కువగా స్వలింగసంపర్కుల మధ్య ఇలాంటివి జరుగుతున్నాయి. సాధారణంగా ఈ ఎల్‌జీబీటీ యాప్స్‌లో లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్స్ ఉంటారు. ఇందులో ఎవరైతే ధనికులు ఉంటారో వారినే టార్గెట్ చేసి మోసం చేస్తున్నారు. వీరికి ఈ యాప్స్ ద్వారా దగ్గర అయ్యి ముగ్గులోకి దించుతున్నారు. ఆ తర్వాత వారిని హోటల్స్, ఫామ్ హౌస్‌లకు పిలిచి మత్తులోకి దించి నగ్న ఫొటోలు తీస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌కి చెందిన మరో డాక్టర్‌కు కూడా ఇలానే జరిగింది. ఒక యాప్‌లో పరిచయమైన వ్యక్తితో చాటింగ్ చేశాడు. ఆ తర్వాత ఆ వ్యక్తి పిలవగానే ఒక ఫామ్‌హౌస్‌కు వెళ్లాడు. అక్కడ ఇద్దరూ మద్యం తాగారు.మద్యం మత్తులో ఉన్నప్పుడు, ఆ వ్యక్తి డాక్టర్ నగ్న ఫొటోలు తీశాడు. ఈ విషయం తెలియని డాక్టర్ అక్కడి నుంచి తిరిగి వచ్చాడు. కానీ కొన్ని రోజుల తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు డాక్టర్ నగ్న ఫొటోలను వాట్సాప్‌లో పంపి, బ్లాక్‌మెయిల్ చేయడం మొదలుపెట్టారు. భయపడిన డాక్టర్ మోసగాళ్లు అడిగిన డబ్బులు ఇచ్చారు. ఇలాంటి కేసులు ఎక్కువగా రావడంతో పోలీసులు వీరిపై నిఘా పెట్టారు. డేటింగ్స్, ట్రాన్స్ వారిని గుర్తిస్తున్నారు. మోసం చేసేవారు ముందుగా ఎల్‌జీబీటీ యాప్స్‌లో సభ్యత్వం తీసుకుంటారు. ఆ తర్వాత పలుకుబడి, డబ్బులు ఉన్న వారిని టార్గెట్ చేస్తారు. వారితో ప్రేమగా మాట్లాడి, స్నేహం చేసి మెల్లిగా తమ ఉచ్చులోకి లాగుతారు. ఇలాంటి మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు. ప్రస్తుతం సోషల్ మీడియా ఎక్కువ కావడంతో ఇలాంటి ఘటనలు జరగుతున్నాయి. తెలియని వ్యక్తులను కలిసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. మత్తులోకి ఎక్కించి ఆ తర్వాత చీట్ చేస్తున్నారని తెలిపారు.

## దేశ చరిత్రలోనే ఇంతటి దుర్మార్గమైన ఎన్నికలు ఎప్పుడు జరగలేదు

అన్నమయ్య

పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటిసి ఎన్నికల్లో టిడిపి గుండాలు స్వైరవిహారం చేస్తున్నారని రాజంపేట వైసీపీ ఎమ్మెల్యే అకేపాటి అమర్ నాథ్ రెడ్డి ఆరోపించారు. వైసీపీ ఏజెంట్ లను పోలీసుల సహకారంతో బూతులోకి పోనియకుండా అడ్డుకుంటున్నారు. ఓట్లు వేయడానికి వచ్చే ఓటర్లను విచ్చక్షణంగా రహితంగా దాడులు చేయడం దూర్మార్గమైన చర్య అని అన్నారు.

ఎంపీ అవినాష్ రెడ్డి తో పాటు వైసీపీ నాయకులను అరెస్ట్ చేయడం దారుణం. దేశ చరిత్రలోనే ఇంతటి దుర్మార్గమైన ఎన్నికలు ఎప్పుడు జరగలేదు. జగన్మోహన్ రెడ్డి సొంత అడ్డలో టిడిపి పార్టీని గెలిపించుకునేందుకు ఇలాంటి చర్యలకు పాల్పడడం దూర్మార్గమైన చర్య. రాష్ట్ర ప్రజలందరూ ఎన్నికలను బహిస్కరించే రోజు వస్తుంది. ఈవియంల ద్వారా టిడిపి అధికారంలోకి రావడం జరిగింది. ఈ ఎన్నికలను వెంటనే రద్దు చేయాలి. మళ్ళీ నోటిఫికేషన్ విడుదల చేయాలి. ప్రశాంతంగా రెండు జెడ్పీటిసి ఎన్నికలు మళ్ళీ నిర్వహించాలని డిమాండ్ చేసారు.

## చందానగర్లో కాల్పుల కలకలం

హైదరాబాద్: చందానగర్లో కాల్పుల కలకలం రేగింది. షాప్ తెరిచిన 5 నిమిషాల్లోనే గ్యాంగ్ దోపిడీ చేసింది. ఖజానా జ్యువెల్లరీ దుకాణంలో దుండగులు దోపిడీకి పాల్పడ్డారు. ఎదురుతిరిగిన సిబ్బందిపై కాల్పులు జరిపారు. ఆరుగురు దుండగులు.. రెండు రౌండ్ల కాల్పులు జరిపారు. తుపాకీ కాల్పులతోనే సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. ఈ ఘటనలో డిప్యూటీ మేనేజర్ కాలికి గాయాలయ్యాయి. జహీరాబాద్ వైపు దొంగలు పారిపోయారు. దాంతో పోలీసులు .ఇల్లాల సరిహద్దులను అలర్ట్ చేసారు. పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసారు.

## విజయనగరం ఆర్డీవో కార్యాలయంపై అవినీతి ఆరోపణలు

విజయనగరంవిజయనగరం ఆర్డీవో సీసీ కలెక్షన్ ఏజెంట్‌గా పనిచేస్తున్నారంటూ ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సోషల్ మీడియాలో ఆర్డీవో సీసీ సంతోష్ ఆడియో వైరల్ అవుతోంది. ఇటీవలనే పార్వతీపురం మన్యం జిల్లాకి ఆర్డీవో సీసీ బదిలీ అయ్యారు. గజపతినగరం నియోజకవర్గంలో ఓ భూ వివాదం పరిష్కారంలో ఆర్డీవో సీసీ సంతోష్ చక్రం తిప్పారు వివాదాస్పద భూములకు ఎన్ ఓ సీ ఇచ్చేందుకు భారీగా ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు వచ్చాయి.

## బాలరాజు బాటలో అబ్రహాం...

మహబూబ్ నగర్, ఆగస్టు 12,

తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో ఉన్న అలంపూర్ నియోజకవర్గం ఎప్పుడు రాజకీయ మ లుపులో ప్రత్యేకతను చాటుకుంటూనే వస్తుంది. మాజీ ఎమ్మెల్యే అబ్రహం ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ తన అ నుచర వర్గం మాత్రం బిజెపి వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు బిజెపి దక్షిణాది రాష్ట్రాల్లో తన వశం చేసుకోవాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్ళుతు ఆంధ్రప్రదేశ్లో ఇప్పటికే పొత్తులో భాగంగా అధికారంలోకి రాగా తెలంగాణ రాజకీయా ల వైపు పాగా వేయాలని అడుగులు వేస్తుంది. టిఆర్ఎస్ పార్టీలో పోటీ చేసి స్వల్ప మెజారిటీతో ఓడిపోయిన వారితోపాటు కాంగ్రెస్ లో ఉన్న అసంతృప్తి నా యకులను ఆకర్షించేందుకు పావులను కదుపుతుంది. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వ ల బాలరాజు ఇప్పటికే బి ఆర్ఎస్ పా ర్టీని వీ డి బిజెపి పార్టీలోకి చేరగా గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొంది తన ప్రజా బలాన్ని ఆకర్షించే నేతగా అబ్రహం ఏదిగారు. గత ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీ నుండి టికెట్ ని ఆశించి తీవ్రంగా శ్రమించిన ఆయనకు విజేయుడు రూపంలో అదృష్టం చేజారింది. నువ్వా నేనా అంటూ ఉద్రిక్త భరితంగా చివరి వరకు టికెట్ వస్తుందని ఆశించిన ఆయనకు చల్లా వెంకట్రామిరెడ్డి ఆశీస్సు లు కోల్పోయి టికెట్టు దగ్గకపోవడంతో ఆ యన భంగపడ్డారు. దీంతో వెంటనే తనని కాదని పార్టీ టికెట్ ఇచ్చిన విజేయుడు ను ఓ డించేందుకు ఏఐసీసీ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ గెలుపు కోసం చే తులు కలిపి కాంగ్రెస్ పార్టీలోకి చేరారు.రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో స్వల్ప మెజార్టీతో ఓడిన సంపత్ కుమార్ వద్ద క్రమంగా ప్రత్యక్ష రాజకీయాలకు ఆయన దూరంగా ఉంటున్నారు. క్రమంగా పార్టీ కార్యక్రమాలు సభలు సమావేశంలో హాజరు కావడం లేద ని ప్రచారం లో ఉంది. తన రాజకీయ జీవితంలో తన వారసుడు మమకమై తన వెను క ఉండి చూసుకున్న తన కొడుకును తన రా జకీయ వారసుడిగా ప్రజలకు పరిచయం చే యాలనుకున్న తరుణంలో బి ఆర్ ఎస్ పార్టీ తనకు టికెట్ ఇవ్వకపోవడంతో తన కొడుకు రాజకీయ జీవితం ఎలాగైనా చక్క పెట్టాలన్న ఆలోచనతో బిజెపిలోకి అడుగులు పెట్టేందు కు యోచిస్తున్నట్లు తన సన్నిత వర్గాల ద్వారా తెలిసింది.ఇప్పటికే బిజెపి ముఖ్య నాయకులతో సంప్రదింపులు జరిగినట్లు ప్రచార సైతం జోరుగా వినిపిస్తోంది. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బిజెపిలోకి అడుగుపెట్టిన వెంటనే సాధ్య అసా ధ్యాలపై పరిస్థితులను అంచనా వేసి ముం దుకు వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు స్పష్టమవుతుంది. పరోపక్క తను పార్టీ మారుతున్నట్లు లీకులు ఇచ్చిన వెంటనే తనను కాంగ్రెస్ పా ర్టీ బుజ్జగిస్తుందా అన్న ఆశతో కూడా ఉన్నట్లు తెలుస్తోంది.కాబోయే స్థానిక సం స్థల ఎన్నికల్లో తన కుమారుడికి క్రియాశీల పదవి ఇస్తారని ఆశతో ఉన్నట్టు ప్రచారం జోరుగా వినిపిస్తుంది. పేదల డాక్టర్ గా, వివాదరహితుడిగా ఉన్న డాక్టర్ అబ్రహం 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా, 2018లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో అబ్రహం అనుచరులు, అభిమానులు రాజకీయంగా తగిన నిర్ణయం తీసుకోవాలని అబ్రహం పై ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. పలు మండలాల నాయకులు మంతనాలు చేస్తుండ దంతో వేచి చూద్దాం అన్న ధోరణిలో మాజీ ఎమ్మెల్యే ఉన్నట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో నడిగడ్డకు చెందిన బీజేపీ ముఖ్య నేతలు రంగంలోకి దిగి అబ్రహంను బీజేపీలోకి రావలసిందిగా ఆహ్వానించినట్లు తెలుస్తోంది.స్థానిక సంస్థల ఎన్నికల లోపు నిర్ణయం తీసుకోవాలని కొంతమంది సూచిస్తుంటే.. మరి కొంతమంది స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత నిర్ణయాలు తీసుకుంటే బా గుంటుంది అని మరి కొంతమంది మాజీ ఎమ్మెల్యేకు సూచిస్తున్నట్లు సమాచారం. మొత్తం పైన డాక్టర్ అబ్రహం భారతీయ జనతా పార్టీలోనే చేరే అవకాశాలు ఉన్నాయని నియోజకవర్గంలో జోరుగా ప్రచారంజరుగుతోంది.

## సమాధులపైనే చెత్త పడేస్తున్నారు...

అదిలాబాద్, ఆగస్టు 12,

శ్మశాన వాటికలు, డంపు యార్డులుగా మారిన దృష్టాంతం ఎక్కడా కనిపించదు. స్మశాన వాటికలో ఎక్కడైనా సమాధులే ఉంటాయి. కానీ బెల్లంపల్లిలో మాత్రం శ్మశాన వాటికలో సమాధులతో పాటుగా చెత్త కుప్పలూ ఉండ డం రాష్ట్రంలో ఏ మున్సిపాలిటీలో ఎరుగం. ఈ విచిత్ర పరిస్థితి బెల్లంపల్లి బల్దియాలో మాత్రమే తాండవిస్తోంది.మంచిర్యాల జిల్లా రెండవశ్రేణి గ్రేడ్ బెల్లంపల్లి మున్సిపాలిటీకి డంపుయార్డు కష్టాలు వీడటం లేదు. డంపుయార్డు సౌక ర్యం లేక ఎక్కడబడితే అక్కడ చెత్తను పడేస్తున్నారు. ఈ పని చేసేది ప్రజలు కాదు... అధికారుల ఆదేశం మేరకు సాక్షాత్తు మున్సిపల్ పారిశుద్ధ సిబ్బంది చేయడం గమ నార్హం. ఇలా పారిశుధ్య సిబ్బంది వ్యవహరించడానికి ప్రధాన కారణం డంపు యార్డు లేకపోవడమే.కాగా మున్సిపల్ అధికారుల్లో చిత్తశుద్ధి లోపించడమే ఇందుకు ప్రధాన కారణం అన్న విమర్శలు వారిపై ఉన్నాయి. పారిశ్రామిక ప్రాంతమైన బెల్లంపల్లి మున్సిపాలిటీలో డంపు యార్డు లేకపోవడం మరీ విడ్డూరంగా ఉందని పలువురు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో 34 వార్డులు ఉన్నాయి. కాగా వార్డుల రీత్యా మున్సిపాలిటీ గరిష్ట స్థాయిని సూచిస్తోంది.డంప్ యార్డుపై పురపాలక మండలికి ఏమాత్రం పట్టింపు కనిపించడం లేదన్న విమర్శలు సర్వత్రావ్యక్తం మవుతున్నాయి. పట్టణంలోని 34 వార్డుల్లోనూ సేకరించిన చెత్తను ఎక్కడ డంపు చేయాలో అర్థం కాని పరిస్థితిలో పారిశుద్ధ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. నిత్యం విధి నిర్వహణలో పారిశు ధ్య కార్మికులు చెత్తను ఎక్కడ వేయాలో అర్థం కాని ఆగమ్యగోచారంలో పనిచేస్తున్నా రు.చేసేదేమిలేక ప్రతినిత్యం చెత్తను పట్టణ శివారులో డంపు చేసి కార్మికులు ఊపిరి పీల్చుకునే పరిస్థితిలో ఉన్నారు. సేకరించిన చెత్తను పడేయడానికి కార్మికులు అష్ట కష్టాలు పడుతున్నారు.డంపు యార్డు సౌలభ్యం కొరవడి చెత్తను శ్మశాన వాటికల్లో పడేస్తున్నారు. కుప్పలు తెప్పలుగా చెత్తకుప్పలతో శ్మశాన వాటికలు కనుమరుగవుతున్నాయి. సమాధుల మీదనే చెత్తను పడేస్తున్నారు. ఇంక్లైన్ బస్తీ, కన్నాలబస్తీ, మార్కెట్ యార్డ్ వెనుకాల శ్మశాన వాటికలను ఇప్పటికే చెత్తతో నింపేశారు.పట్టణంలో ఇప్పటి వరకు అన్ని స్మశాన వాటికలు చెత్త కుప్పలతో నిండిపోయాయి. ఇక మిగిలింది గోల్ బంగ్లా శ్మశాన వాటికను అధికారులు గుత్త పట్టారు. పట్టణంలో సేకరించిన యావత్తు చెత్తను ట్రాలీలతో ఈ శ్మశాన వాటికలోనే డంపింగ్ చేస్తున్నారు. చెత్త కుప్ప లు పేరుకొని వర్షానికి తడిసి తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతున్నది. గురజాలకు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే చెత్తను డంపు చేసిన చెత్త కుప్పలు పేరుకుపోయి ఉన్నాయి.రహదారి గుండా ప్రజలు దుర్వాసనను తట్టుకోలేక ముక్కు మూసుకొని వెళ్లే పరిస్థితి నెలకొంది. అధికారుల అనాలోచితం డంప్ యార్డుకు పరిష్కారం దొరకక ప్రజలకు శాపంగా మారింది. శాశ్వత పరిష్కారం వైపు అధికారులు దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి. 1987 మున్సిపల్ ఆవిర్భా వం తదనంతరం డంప్ యార్డును బెల్లంపల్లి పాలిటెక్నిక్ కళాశాల శివారులో ఏర్పాటు చేశారు.ఈ డంప్ యార్డులో చెత్తను కాల్చివేయడంతో తద్వారా వచ్చే పొగ సమీపం లో ఉన్న కన్నాల బస్తి, మధునన్న నగర్, ఇందిరమ్మ కాలనీ, కొత్త బస్టాండ్ ఏరియా ప్రజలను ఊపిరి సలపనివ్వలేదు. అనునిత్యం పొగ మేఘాలు కాలనీలను కమ్మేసి నరకాన్ని చూపించాయి. పిల్లలు, వృద్దులకి ప్రాణ సంకటంగా మారింది. డంపు యార్డును ఎత్తివేయాలని ప్రజలు ఆందోళనకు దిగారు. కన్నా ల బస్తి, మధునన్ననగర్, కొత్త బస్టాండ్ ప్రజ లు దినమొక గండంగా కాలం వెళ్లి తీశారు. ప్రజలు అనారోగ్యానికి గురయ్యారు. ప్రజల ఒత్తిడి మేరకు డంపు యార్డును అధికారు లు ఎత్తివేయక తప్పలేదు. ఇక అప్పటినుంచి డంప్ యార్డ్ కు అనువైన స్థలం దొరకలేదనే వంకతో కాలయాపన అవుతూనే ఉంది.అధికారుల చిత్తశుద్ధిలేమి, నిర్లక్ష్యం వెరసి బెల్లంపల్లిలో డంపు యార్డుకి ముహూర్తం రావడం లేదు. డంపు యార్డు ఏర్పాటుపై చిత్తశుద్ధి కనపరచాలని ప్రజలు కోరుతున్నా రు. బెల్లంపల్లి శివారులో విశాలమైన ప్రభు త్వ స్థలాలు కోకోలుగా ఉన్నాయి. అధికారులకు డంపు యార్డుపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఇట్టే ఫలించక మానదు. ఇకనైనా అధికారులు జాప్యం చేయకుం డా ప్రజలకు ఇబ్బంది కలగకుండా అనువైన స్థలంలో డబ్బు యార్డు ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. సమాధుల్లో చెత్త కుప్ప లు నింపివేసి చేతులు దులుపుకోవడం అటుంచితే తమ జ్ఞాపక చిహ్నాలను చెత్త కుప్పలతో నింపేసి అవమానించినట్టుగా స్థానిక ప్రజలు భావిస్తున్నారు.ఈ విషయా న్ని అధికారులు పరిగణంలోకి తీసుకోవాల్సింది ఉంది. ఇప్పటివరకు వారి మనో భా వాలను గాయపరచిన విషయాన్ని మున్సిపల్ అధికారులు తమను తాము పరిశీలిం చుకోవాలి. ప్రజల పట్ల వారి మనో భావాల ను గౌరవించడం అధికారుల ప్రధాన విధిలో ముఖ్యమైనదిగా పలువురు వారికి గుర్తు చేస్తున్నారు

### భారతదేశము నా మాతృభూమి అనే జాతీయ ప్రతిజ్ఞ రచించిన మహనీయుడు పైడిమర్రి వెంకటసుబ్బారావు

## నేడు అయిన వర్ధంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )భారతదేశంలోని విద్యార్థుల్లోనూ దేశభక్తిని పెంపొందించడానికి భారతదేశము నా మాతృభూమి అనే భారత జాతీయ ప్రతిజ్ఞ రచించిన రచయిత, బహుభాషావేత్త పైడిమర్రి వెంకటసుబ్బారావు. ఈయన 1916, జూన్ 10న పైడిమర్రి రాంబాయమ్మ, వెంకవూటామయ్య దంపతులకు నల్లగొండ కేంద్రానికి అతి సమీపంలో ఉండే అన్నెపర్తిలో జన్మించారు. విద్యాభ్యాసం మొత్తం అన్నెపర్తి, నల్లగొండలోనే సాగింది. తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్, అరబిక్ భాషల్లో నిష్ణాతులు.హైదరాబాద్ రాష్ట్రంలోనే ట్రెజరీ విభాగంలో ప్రభుత్వోద్యోగం సంపాదించారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక ఖమ్మం, నిజామాబాద్, నెల్లూరు, విశాఖపట్నం, నల్లగొండ జిల్లాల్లో పనిచేశారు.ఆయన 1962 లో విశాఖపట్నం ట్రెజరీ అధికారిగా ఉన్నపుడు ఈ ప్రతిజ్ఞ తయారు చేశాడు. భారత్-చైనా యుద్ధం జరుగుతున్న సమయమది. ఆ యుద్ధం పూర్తయిన తర్వాత చైనా ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంది. తమ దేశ ప్రజల్లో ప్రాథమిక దశ నుంచే దేశభక్తి భావం నూరిపోయాలని..! ఆ మేరకు ప్రత్యేకంగా కొన్ని దేశభక్తి గేయాలను రాయించి, పాఠశాల విద్యార్థులతో చదివించడం మొదలుపెట్టింది.అప్పటికే విదేశీ భాషల్లో ప్రావీణ్యం ఉన్న పైడిమర్రి ఈ విషయం గుర్తించాడు. మన దేశ విద్యార్థుల్లోనూ దేశభక్తిని పెంపొందించడానికి గేయాలుంటే బాగుంటుందని భావించాడు. పలు రచనలు చేసిన అనుభవంతో ఆ ఆలోచనకు రూపమివ్వడం మొదలుపెట్టాడు. ప్రతిజ్ఞకు పదాలు కూర్చాడు. విశాఖ సాహితీ మిత్రుడు తెన్నేటి విశ్వనాథంతో చర్చించాడు. 'వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలము' అన్న వాక్యాన్ని అదనంగా చేర్చాడు. అంతాబాగానే ఉంది కానీ, దాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. పాఠ్యపుస్తకాల్లో చేర్చడం ఎలా అని ఆలోచించారు.అది కాసు బ్రహ్మానందడ్డి ప్రభుత్వం. అప్పటి విద్యాశాఖ మంత్రి విజయనగరం రాజాగా పేరుగాంచిన పీవీజీ రాజు. ఆయన సాహితీవేత్త కావడం వారికి కలిసొచ్చింది. తేన్నేటి సాయంతో ప్రతిజ్ఞను పీవీజీ రాజు దృష్టికి తీసుకెళ్లాడు. దాని విలువను, అవసరాన్ని వివరించి ఓ ప్రతిని అందజేశారు. 1964లో బెంగుళూరులో ప్రముఖ న్యాయనిపుణుడు మహ్మద్ కరీం చాగ్లా అధ్యక్షతన కేంద్రీయ విద్యా సలహామండలి సమావేశం జరిపినపుడు జాతీయ ప్రతిజ్ఞగా స్వీకరించారు. తరువాత దీన్ని అన్ని భాషల్లోకి అనువాదం చేయించి 1965 జనవరి 26 నుంచి దేశమంతటా చదువుతున్నారు.పైడిమర్రి రాసిన ప్రతిజ్ఞలో కాలానుగుణంగా కొన్ని స్వల్ప మార్పులు మాత్రం జరిగాయి. గ్రాంథికంలో కొన్ని పదాల స్థానంలో వాడుక భాష వాడారు. ఇతర భాషల్లోకి అనువదించి 1963 నుంచి దేశ ప్రతిజ్ఞగా అమలులోకి వచ్చింది.ఉద్యోగ విరమణ అనంతరం 1988 ఆగష్టు 13 న ఆయన అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. పాఠ్య పుస్తకాలలో ప్రచురిస్తున్న ప్రతిజ్ఞకు పైడిమర్రి వెంకటసుబ్బారావు పేరును ముద్రించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక 2014 నవంబరు 27న రాష్ట్రపతికి, ప్రధానమంత్రికి, రాష్ట్ర గవర్నర్‌కు తెలంగాణ సీఎం కెసీఆర్ కు విజ్ఞప్తి చేయగా, 2015-16 విద్యాసంవత్సరం నుంచి కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో అన్ని భాషల్లో అన్ని ప్రభుత్వ పాఠ్యపుస్తకాలలో జాతీయ ప్రతిజ్ఞతో పాటు రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరును ముద్రిస్తున్నారు. అంతేకాకుండా తెలంగాణ ప్రభుత్వం 5వ తరగతి తెలుగు పుస్తకం అట్ట వెనుక భాగం లోపలి పేజీలో పైడిమర్రి వెంకట సుబ్బారావు జీవిత చరిత్రను ముద్రించి విశేష ప్రాచుర్యం కల్పించి గౌరవించింది. ఆయన రచించిన భారత జాతీయ ప్రతిజ్ఞ మరోసారి మనము చదువుదాము.....భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సహోదరులు. నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను.సుసంపన్నమైన, బహువిధమైన నాదేశ వారసత్వసంపద నాకు గర్వకారణం.దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషి చేస్తాను. నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్నీ గౌరవిస్తాను. ప్రతివారితోను మర్యాదగా నడచుకొంటాను. నా దేశం పట్ల, నా ప్రజల పట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

## రాజగోపాలరెడ్డి పదవికి అడ్డుకుంటున్నెదవరు..

నల్గొండ, ఆగస్టు 12,

కాంగ్రెస్ అధిష్ఠానం నాకిచ్చిన మంత్రిపదవి హామీని అమలుచేయకుండా రాష్ట్ర ముఖ్యనేతలు అడ్డుకుంటూ, అవమానిస్తున్నారు. వాస్తవాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియా ద్వారా ప్రజలకు వివరించినందుకు ధన్యవాదాలు' అని మును గోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. తనకు మంత్రి పదవి ముఖ్యం కాదని.. ప్రజలకిచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కార్ అమలు చేయాలని కోరా రు.అవినీతిరహిత పాలన అందించాలం టూ సోమవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చిన మాట నిజమేనని డిప్యూ టీ సీఎం భట్టి విక్రమార్క ఓ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్న అం శంపై రాజగోపాల్‌రెడ్డి స్పందించారు. తనకు మంత్రి పదవి రాకుండా కొందరు నేతలు అడ్డుకుంటున్నారనే వాస్తవాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బయటపెట్టారని తెలిపారు.తెలంగాణ సమాజ ఆకాంక్షలను నెరవేర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఉండాలని తాను ఆశిస్తున్నట్టు రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. గత కొన్నిరోజులుగా రాజగోపాల్‌రెడ్డి మంత్రి పదవి అంశం తెలంగాణ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. సీఎం రేవంత్‌రెడ్డిపై ఆయన పలుమార్లు విమర్శలు కూడా చేశారు.

పార్టీ వేటు తప్పదా

మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి బిగ్ షాక్ తగిలింది. సీఎం రేవంత్‌రెడ్డిని పదేపదే టార్గెట్ చేస్తూ విమర్శలు చేస్తున్న రాజగోపాల్ రెడ్డిని పార్టీలో నుంచి పంపేందుకు రంగం సిద్ధం అయినట్లుగా తెలుస్తోంది. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డితో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ భేటీ అయ్యారు. ఈ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీ రిజర్వేషన్ల అంశాలతో పాటుగా ప్రధానంగా రాజగోపాల్ వ్యవహారంపై సీఎం చర్చించినట్లుగా తెలుస్తోంది. రాజగోపాల్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకునే ప్లాన్‌లో అధిష్టానం ఉన్నట్లు సమాచారం.అటు సీఎం రేవంత్‌రెడ్డిపై కోమటిరెడ్డి బహిరంగంగా చేసిన విమర్శలపై పార్టీ హైకమాండ్‌కు కూడా నివేదికలు వెళ్లాయి. ఏఐసీసీ కూడా ఈ విషయంపై ఆరా తీసినట్లు తెలుస్తోంది.పార్టీ అంతర్గత వ్యవహారాలను బహిరంగంగా చర్చించడం సరికాదని క్రమశిక్షణ కమిటీ భావిస్తోంది. పార్టీకి నష్టం జరగకుండా ఈ అంశాన్ని సామరస్యంగా పరిష్కరించుకోవాలని అధిష్టానం చూస్తున్నట్లు సమాచారం. అయితే రాజగోపాల్ రెడ్డిపై క్రమశిక్షణ కమిటి వేటు వేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక తనకు మంత్రి పదవి రాకపోవడంపై రాజగోపాల్ రెడ్డి అసంతృప్తిగా ఉన్నారని, అందుకే సొంత పార్టీ నేతలపై విమర్శలు చేస్తున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ హైదరాబాద్ వచ్చినప్పుడు రాజగోపాల్ రెడ్డి ఆయనతో భేటీ అయ్యారు. ఈ భేటీ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఇప్పటికే ఎంపీ మల్లు రవి కూడా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో చేరేటప్పుడు తనకు మంత్రి పదవి ఇస్తామని పార్టీ నాయకత్వం హామీ ఇచ్చిందని, అయితే ఆ హామీని రాష్ట్ర ముఖ్య నేతలు అడ్డుకుంటున్నారని రాజగోపాల్‌రెడ్డి ఆరోపిస్తున్నారు. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా హైకమాండ్ రాజగోపాల్ రెడ్డికి పదవిపై హామీ ఇచ్చిన మాట వాస్తవేమేనని కానీ అది కేబినెట్ కూర్పులో కుదరలేదన్నారు. దీనిపై రాజగోపాల్ రెడ్డి డిప్యూటీ సీఎంకు ధన్యవాదాలు తెలుపుతూ ట్వీట్ చేశారు.సీఎం రేవంత్‌రెడ్డి పదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని చేసిన వ్యాఖ్యలను రాజగోపాల్ రెడ్డి బహిరంగంగా ఖండించారు. ముఖ్యమంత్రి ఎవరు అనేది పార్టీ అధిష్టానం నిర్ణయిస్తుందని, ఇలాంటి వ్యాఖ్యలు పార్టీ విధానాలకు విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే, ప్రతిపక్షాలపై సీఎం ఉపయోగించే భాషను మార్చుకోవాలని కూడా సూచించారు.

## మొబైల్ ఫోరెన్సిక్ వాహనం ప్రారంభించిన వరంగల్ పోలీస్ కమిషనర్..



ఉమ్మడి వరంగల్ బ్యూరో,(భారత శక్తి)ఆగష్టు12:నేరానికి సంబంధించి సంఘటన స్థలంలో నిందితులను గుర్తించడంతో పాటు, సాక్ష్యాధారాలను సేకరించే ఫోరెన్సిక్ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తూ, తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ విభాగం వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతనంగా మొబైల్ ఫోరెన్సిక్ వాహనం అందజేసారు. ఈ వాహనాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్బంగా వరంగల్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం అందుబాటులో వున్న పరిజ్ఞానాన్ని వినియోగించుకొని అత్యాధునిక పరికరాల తో రూపోందించబడిన ఈ మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని వరంగల్ కమిషనరేట్ పోలీసులకు మరింత మెరుగైన సేవలందించనున్నది. ఇకపై ఎద్కైనా నేరం జరిగిన ప్రదేశానికి ఫోరెన్సిక్, ఫింగర్ ప్రింట్ అధికారులు, సిబ్బంది ఈ మొబైల్ ఫోరెన్సిక్ వాహనంలో చేరుకోని, సంఘటన జరిగిన స్థలం నుండి రక్తమరకలు, వ్రేలిముద్రలతో ఇతర సాక్ష్యాదారాలను సేకరించి, ఈ మొబైల్ వాహనంలో ఏర్పాటు చేసిన అధునిక పరికరాలతో పరీక్షలను నిర్వహించి, సంబంధిత దర్యాప్తు అధికారికి ప్రాధమిక సాక్ష్యాధారాలను అందజేయడం జరుగుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ఈ కార్యక్రమములో అదనపు డిసిపిలు రవి,సురేష్‌కుమార్, రిజినల్ ఎఫ్.ఎస్.ఎల్ జాయింట్ డ్కెరక్టర్ నీరజ, ఫింగర్ ప్రింట్ విభాగం ఇన్స్‌స్పెక్టర్లు రాజ్‌కుమార్,శ్రీధర్, ఆర్.ఐలు శ్రీధర్,స్పర్జన్‌రాజ్, శ్రీనివాస్,చంద్రశేఖర్, ఫింగర్ ప్రింట్ ఎస్.ఐ కిరణ్‌తో ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్ ఆర్ రంగనాథన్ 133వ జయంతి



శ్రీకాకుళం, భారత శక్తి ప్రతినిధి, ఆగస్ట 12:గ్రంథాలయ పితామహుడు ఎస్ ఆర్ రంగనాథన్ 133వ జయంతి స్థానిక గ్రంథాలయము నందు ఘనంగా జరిగినది. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా హాజరైన విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజా మాట్లాడుతూ సీయామీలి రామ అమృత రంగనాథన్ గణితశాస్త్ర అధ్యాపకులుగా పనిచేసస్తూ గ్రంథాలయ శాస్త్రాన్ని రచించారన్నారు. గ్రంథాలయంలో పుస్తకాల వర్గీకరణ గ్రంథాలయ పరిపాలనపై క్లుప్తంగా శాస్త్రాన్ని వ్రాశారన్నారు. గ్రంథాలయాల నిర్వహణలో వారి పంచ సూత్రాలు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనకాపల్లి ఎలమంచిలి డివిజన్ ఉద్యోగులందరూ పాల్గొని ఎస్ఆర్ రంగనాథన్ సేవల గురించి వివరించారు. ఆయన పుట్టినరోజున జాతీయ గ్రంథాలయ దినోత్సవం గా జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షుడుగా విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు వి ఆనందరావు, విశిష్ట అతిథిగా అచ్యుత విద్యాసంస్థల కరస్పాండెంట్ పల్లి శేషగిరిరావు పాల్గొన్నారు. వీరితో పాటు విశాఖపట్నం జిల్లా గ్రంథాల శాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులు ఆర్ కన్నబాబు, ముఖ్య సలహాదారు జి మురళీకృష్ణ, అనకాపల్లి డివిజన్ గ్రంథాలయ ఉద్యోగులు ఎల్ వి రమణ, (అచ్చుతాపురం,) కే శ్రీనివాసరావు (అనకాపల్లి), కే వరలక్ష్మి (మునగపాక), అప్పలనర్స (గణపర్తి) జగన్ (తాళ్లపాలెం) కే లక్ష్మణరావు (పరవాడ) ఎలమంచిలి డివిజన్ నుండి జనార్ధన్ (చిన్న దొడ్డి గళ్ళు) జి గోవింద్ ఈశ్వరరావు (నక్కపల్లి) ఎస్ శకుంతల దేవి (దిమిలి), వి లక్ష్మణరావు (పాయకరావుపేట) యువకులు, పాఠకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.అనంతరం అచ్యుతాపురం ఇన్చార్జి గ్రంథాలయాధికారిగా పనిచేసిన దొడ్డి కోటేశ్వరరావును గ్రంథాలయ ఉద్యోగులు అందరూ ఘనంగా సన్మానించారు.

## మాజీ ఎమ్మెల్యే చెంచురెడ్డి మృతి : సిపిఐ నివాళి..

తిరుపతి జిల్లా ప్రతినిధి,ఆగష్టు 12(భారతశక్తి): శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలో, అందరికీ ఆప్తుడుగా, రాజకీయాలకు అతీతంగా మెలిగిన మంచి వ్యక్తి తాటిపర్తి చెంచురెడ్డి అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి హరినాథ్ రెడ్డి అన్నారు. ఈరోజు ఉదయం శ్రీకాళహస్తి పట్టణంలో ఆయన స్వగృహం లో చెంచురెడ్డి పార్థీవ దేహానికి సీపీఐ జిల్లా నాయకత్వం ఆధ్వర్యం లో పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు పి హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ చెంచు రెడ్డి రాజకీయ పరిణితి చెందిన వ్యక్తని, రాజకీయాలకు అతీతంగా అందరితో కలిసి మెలసి ఉండేవారని, నా చిన్నతనం లో నేను కూడా ఆయన రాజకీయాలను గమనించే వాడిని అని చెప్పారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కి పెద్ద దిక్కుగా ఉండినాడని గుర్తు చేశారు. మంచి వ్యక్తి మృతి చెందడం బాధాకరమన్నారు.ఆయన మృతికి సంతాపం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య,నియోజకవర్గ కార్యదర్శి జనమాలగురవయ్య,పట్టణ కార్యదర్శి ఆర్ గోపి,ఆర్ఎస్ కె మూర్తి,చారులత పాల్గొన్నారు.



## బాలికల రెసిడెన్షియల్ లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..





వేములవాడ,ఆగస్టు 12 (భారత శక్తి) : విద్యార్థులకు నాణ్యమైన బోధనతోపాటు, మెనూ ప్రకారం భోజనం అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని,మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజ్ గర్ల్స్ విద్యాలయాన్ని కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కిచెన్ స్టోర్ రూమ్ లలో తిరిగి, స్వయంగా గరిటతో వంటకాలను కలిపి వాటి నాణ్యతను,ల్యాబ్, లైబ్రరీ, ఆట స్థలమును పరిశీలించారు. విద్యార్థులతో హాస్టల్ వసతులు నాణ్యమైన భోజనం పెడుతున్నారా,అని విద్యార్థులను సౌకర్యాలు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.అలాగే విద్యాలయంలోని 9,10, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఫిజిక్స్, మ్యాథ్స్ ఎకనామిక్స్, ఇంగ్లీష్ పాఠాలను బోధించి పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కొందరు టీచర్లు, విద్యార్థులకు, సక్రమంగా పాఠాలు బోధించలేకపోవడం గమనించి, వారికి సూచనలు చేశారు, అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతు క్లాస్ రూమ్ కి వెళ్లే ఉపాధ్యాయులు ముందుగా సంబంధిత సబ్జెక్టు పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులకు సక్రమంగా పాఠాలు బోధించాలని ఆదేశించారు. దీంతో విద్యార్థులకు సబ్జెక్ట్ పై పూర్తి స్థాయిలో పట్టు వస్తుందని తెలిపారు.మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని సూచించారు. పాఠశాలకు అవసరమైన 30 బెంచీలను ఇతర విద్యాలయాల నుండి తెప్పించవలసిందిగా, ప్రతినిత్యం జిల్లా విద్యాధికారి తనిఖీలు నిర్వహించవలసిందిగా డి.ఈ.ఓ ని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్యామల, ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## మానసిక శాంతికి ధ్యానం ఎంతో అవసరం..



సంగారెడ్డి, (భారత శక్తి ప్రతినిధి)ఆగస్టు 12:ధ్యానం ద్వారా మానసిక శాంతి అనుభూతి కలుగుతుందని బ్రహ్మకుమారిస్ సంస్థ డైరెక్టర్ బి కే సుమంగళ అన్నారు.సంగారెడ్డి పట్టణంలోని రాజంపేటలో బ్రహ్మకుమారీస్ సంస్థలు మీడియా వారికి రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా బ్రహ్మకుమారీస్ సంస్థ డైరెక్టర్, బి.కె సుమంగళ పాల్గొన్నారు. రాజ్యాంగానికి నాలుగో పిల్లర్ మీడియాని ఆమె తెలిపారు. మీడియాలో పనిచేసే వ్యక్తులు ఈ రోజుల్లో చాలా సమయం బిజీగా ఉంటారు. అయినప్పటికీ కొంత సమయాన్ని ధ్యానానికి కేటాయించి మానసికంగా శాంతి అనుభూతి పొందాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీదర్ బ్రహ్మకుమారి సెంటర్ ఇన్చార్జి బి.కే. సునంద, బి.కే. అన్నపూర్ణ, బీ.కే. జగదీశ్వర్, బి.కే. రాజవర్ధన్, బి కే. సంతోష్, బి.కే. రాధిక, విశ్రాంత మండల విద్యాధికారి మరియు అద్వకేట్ డి అంజయ్య, విశ్రాంత సైనికులు పాల్గొన్నారు.

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు స్కూల్లు.

జమ్మికుంట,

జమ్మికుంట పట్టణంలోని ఒక ప్రైవేట్ హైస్కూల్, లో టిసి కోసం రెండు వేల రూపాయలు డిమాండ్ చేయగా విద్యార్థి తండ్రి ఎడ్ల శ్రీనివాస్, నిరసన వ్యక్తం చేస్తూ విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేసింది కాకుండా టిసి కోసం విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అదనంగా రెండు వేల రూపాయలు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు, నేను నిరుపేద రైతును ఫీజు కట్టడానికి డబ్బులేక ప్రభుత్వ స్కూల్లో నా కుమారుడిని చేర్పించానని , రెండు నెలల నుంచి స్కూల్ యాజమాన్యం నన్ను ఇబ్బంది పెట్టగా బిజెపి పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు, దృష్టికి తీసువెళ్ళానని, స్వయంగా బిజెపి పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు, స్కూల్ కి వచ్చి టిసి కి డబ్బులు ఎందుకు అనగా స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, రెండు వేల రూపాయలు కడితేనే టిసి ఇవ్వడం జరుగుతుందని, మాకు జిల్లా, మండల విద్యాశాఖాధికారులకు ఖర్చులు ఉంటాయని తెలిపారు, టిసి కి డబ్బులు కడుతాం దానికి రసీదు ఇవ్వమని అడుగగా అలా ఇవ్వమని తెలుపగా, మండల విద్యాధికారి హేమలతకు ఫోన్లో కొలకాని రాజు, సంప్రదించగా టిసి కి ఎలాంటి డబ్బులు కట్టాల్సిన అవసరం లేదని, మీరు వ్రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారని బిజెపి పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు, ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లగా సాయంత్రం వచ్చి టిసి తీసుకోవాలని బతిమాలడం ఏంటని ? ప్రశ్నించారు,

## ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సిటిజన్ చార్ట్ ను కచ్చితంగా ప్రదర్శించాలని అధికారులకు సూచించన రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్..

కామారెడ్డి,(భారత శక్తి ప్రతినిధి)ఆగస్టు 12:మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైట్ టు ఇన్ఫర్మేషన్ చట్టం 2025 పై రాష్ట్ర సమాచార కమిషన్ ఆధ్వర్యంలో,కలెక్టర్ కార్యాలయాలలోని సమావేశ మందిరంలో పిఐఓ అధికారులకు అవగాహన సదస్సు జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి విచ్చేసిన రాష్ట్ర ఇన్ఫర్మేషన్ కమిషన్ చీఫ్ కమిషనర్, కమిషనర్లకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్రా లు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటారు.అనంతరం కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ఆర్టిఐ చట్టం అవగాహన సదస్సులో రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సిటిజన్ చార్ట్ ను కచ్చితంగా ప్రదర్శించాలని రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి అధికారులకు సూచించారు. ఆర్టిఐ దరఖాస్తులు, ఫిర్యాదులు తక్కువ అందిన 3 జిల్లాలలో కామారెడ్డి జిల్లా ఒకటని అందుకు అధికారులను అభినందించారు. ఇదే సమయంలో కామారెడ్డి కొత్త జిల్లా కాబట్టి ఆర్టిఐ చట్టంపైన ప్రజలకు మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని సూచించారు. జిల్లాలో పెండింగ్లో ఉన్న పాత కేసులను ఈరోజు ప్రత్యేక విచారణ ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు. ప్రభుత్వ విధులలో పారదర్శకత జవాబుదారీతనం పెంపొందించేందుకు ఆర్టిఐ 2025 చట్టాన్ని ప్రభుత్వం తీసుకు వచ్చిందని తెలిపారు. చట్టం ఉద్దేశం ప్రకారం దరఖాస్తుదారు అడిగిన విధంగా నిర్ణీత 30 రోజుల సమయంలో పారదర్శకంగా ఖచ్చితమైన సమాచారాన్ని యధాతధంగా అందించాలని సూచించారు. సమాచారం ఇవ్వడానికి తిరస్కరిస్తే సరియైన కారణాన్ని చూపాలని తెలిపారు. ఆర్టిఐ చట్టం గురించి ఎలాంటి భయం లేకుండా ప్రజలు ఏది అడిగితే అది అందించాలని, ఆర్టిఐ చట్టం అమలులో నిర్లక్ష్యం వహించే అధికారులకు చట్టం ననుసరించి చర్యలు తీసుకొని గరిష్టంగా 25 వేల రూపాయల వరకు ఫైన్ వేయడం జరుగుతుందని అన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సిటిజన్ చార్ట్ ను ప్రదర్శించి వాటిలో ఆ కార్యాలయం ద్వారా అందించే సేవలు, అధికారులు, సిబ్బంది, వివరాలు, ఈ సేవలను ఎన్ని రోజులలో అందిస్తారు తదితర వివరాలను ప్రదర్శించాలని అన్నారు. ప్రపంచంలోనే ఏ మూలలో ఉన్న వారైనా కూడా సమాచారాన్ని సులభంగా తెలుసుకునేందుకు, ప్రపంచంలో అందరికీ అందుబాటులో ఉండేలా ఆయా శాఖల వివరాలను ఆన్లైన్లో పొందుపరచాలని సూచించారు. సమాచార హక్కు చట్టం ప్రకారం ఎలాంటి కారణం లేకుండా ఏ ఆఫీస్ నుంచైనా ఏ రూపంలోనైనా సమాచారాన్ని కోరేహక్కు ప్రజలకు ఉందన్నారు. అన్ని కార్యాలయాల్లో పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారిని, ఏపీఐఓ ను నియమించాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, ఆర్టిఐ చట్టంపై ప్రతి ఒక్క అధికారి పూర్తి అవగాహన పెంపొందించుకొని ఆర్టిఐ మార్గదర్శకాల ప్రకారం అధికారులు స్పందించి పారదర్శకంగా సమాచారాన్ని అందించాలని అన్నారు. నిన్నటి వరకు జిల్లాలో పెండింగ్ లో గల 220 కి పైగా ఆర్.టి.ఐ అప్పీల్ కేసులను కలెక్టరేట్ లో రాష్ట్ర ఇన్ఫర్మేషన్ కమిషన్ ప్రత్యేకంగా హియరింగ్ నిర్వహించి పరిష్కరించనున్నారని తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఇన్ఫర్మేషన్ కమిషన్ కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి మాట్లాడుతూ, ప్రజల అవసరాల కోసం ఉద్యమాల ఫలితంగా ఏర్పడ్డది ఆర్.టి.ఐ చట్టం అని, ఆర్.టి.ఐ చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యత పిఐఓలది, ఏపీఐఓ లదేనని, చట్టం ప్రకారం నిర్వర్తించాల్సిన బాధ్యతలను పూర్తిగా తెలుసుకొని దరఖాస్తు దారు కోరిన సమాచారాన్ని స్పష్టంగా నిర్ణీత సమయంలో అందిస్తే దరఖాస్తుదారుకు అధికారుల పైన, ఆర్.టి.ఐ చట్టం పైన గౌరవం పెరుగుతదని అన్నారు.ఇన్ఫర్మేషన్ కమిషన్ కమిషనర్ మోహ్సి నా పర్వీన్ మాట్లాడుతూ, నాలుగు నెలల క్రితం నూతన స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషన్ ఏర్పాటు తర్వాత పెండింగ్లో ఉన్న 18 వేల కేసులలో 2300 పైగా కేసులను పరిష్కరించడం జరిగిందని తెలిపారు. పిఐఓ అధికారులు ఆర్టిఐ చట్టం అమలుపై లేవనెత్తిన సందేశాలకు సమాధానాలు ఇచ్చారు.రాష్ట్ర ఇన్ఫర్మేషన్ కమిషన్ కమిషనర్ దేశల భూపాల్ మాట్లాడుతూ, ఆర్టిఐ చట్టం అమలై 20 సంవత్సరాలు పూర్తయిన ఈ సందర్భంగా ఈ సంవత్సరాలలో వచ్చిన కేసులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి దరఖాస్తు దారు తృప్తి పొందేలా నిర్ణీత సమయంలో సమాచారాన్ని అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, అడిషనల్ కలెక్టర్లు విక్టర్, చందర్ నాయక్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా అడిషనల్ ఎస్పీ చైతన్యరెడ్డి, పిఐఓ లు, ఏపీఐఓ తదితరులు పాల్గొన్నారు.



## దేవస్థానం అభివృద్ధి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయండి .

బ్రహ్మంగారిమఠం

బ్రహ్మంగారిమఠం అభివృద్ధి కొరకు కేంద్ర ప్రభుత్వం యొక్క ప్రసాదం స్కీం కింద దాదాపు 50 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు సంబంధిత అధికారులతో మైదుకూరు శాసనసభ్యులు శ్రీ పుట్ట సుధాకర్ యాదవ్ గారు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.సోమవారం గౌరవ మైదుకూరు శాసనసభ్యులు శ్రీ పుట్టా సుధాకర్ యాదవ్ గారి నేతృత్వములో బ్రహ్మంగారి మఠం నందలి ప్రముఖ పుణ్యక్షేత్రాలు అయినటువంటి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం, ఈశ్వరి దేవి మఠము, కక్కయ్య స్వామి మఠము, పోలేరమ్మ గుడి, శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి గారు నివసించిన నివాసము అదే విధంగా మఠము నందలి రోడ్ల విస్తరణకు కేంద్ర ప్రభుత్వమునకు సంబంధించిన ప్రసాదం స్కీము క్రింద ప్రతిపాదనలు పంపించుటకు దేవాదాయ ధర్మాదాయ శాఖ వారు మరియు టూరిజం శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగినది. దీని యొక్క ప్రధాన ఉద్దేశం ఏమిటంటే బ్రహ్మంగారి మఠం నందు ఉన్న రోడ్లు, దేవాలయాలు అభివృద్ధి పరచుటకు అవసరమైన డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ తయారు చేయడం వెంటనే జరిగిపోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు.ఈ సమీక్ష సమావేశంలో భక్తుల సౌకర్యార్థం వసతి గృహాల నిర్మాణం, కళ్యాణకట్ట, గ్రానైట్ ఫ్లోరింగ్, లడ్డు మరియు ప్రసాదం కౌంటర్ల ఏర్పాటు, భక్తుల క్యూ లైన్ ఏర్పాటు, మాడ వీధుల అభివృద్ధి, భక్తుల సౌకర్యార్థం బస్టాండ్ నిర్మాణం అలాగే నాలుగు రోడ్ల కూడలి అభివృద్ధి, మఠం సెంటర్ నందు విద్యుత్ దీపాల ఏర్పాటు, శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి నివాస గృహ పునరుద్ధరణ అలాగే స్వామివారి చరిత్రను తెలియజేస్తూ మ్యూజియం ఏర్పాటు అలాగే పోలేరమ్మ గుడికి రోడ్డు నిర్మాణ తదితర అభివృద్ధి కార్యక్రమాలకు దాదాపు 50 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు పంపుటకు సమీక్ష నిర్వహించడమైనది.

## ఓటమి పాలవుతూ తమ తప్పులను తెలుసుకోలేక ఎన్నికల కమిషన్ పై ఆరోపణలు చేస్తున్న ఇండియా కూటమి..





కామారెడ్డి, ( భారత శక్తి ప్రతినిధి) ఆగస్టు 12: వరుసగా ప్రజా క్షేత్రంలో ఓటమి పాలవుతూ తమ తప్పులను తెలుసుకోలేక ఎన్నికల కమిషన్ పై ఆరోపణలు చేస్తున్న ఇండియా కూటమి, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎం పి లు చేస్తున్న అర్థ రహిత ఆరోపణల విషయంలో బీజేపీ జిల్లా కార్యలయంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా బీజేపీ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు మాట్లాడుతూ.. దేశ ప్రయోజనాలే లక్ష్యంగా, ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తున్న బీజేపీ గత మూడు పార్లమెంట్ ఎన్నికలలో, సగానికి పైగా రాష్ట్రాల్లో ప్రజల మన్ననలు పొంది అధికారంలోకి వస్తే, ప్రజల మధ్య కులాల వారిగా, మతాల వారిగా చిచ్చు పెడుతూ,ఎప్పటికప్పుడు దేశంపై, సైనికులపై, హిందువులపై తన అక్కసును కక్కుతూ, ప్రజల చీత్కారాలకు గురవుతూ, కూడా ప్రజల నాడి తెలుసుకోకుండా ఇవిఎం లను తప్పు పడుతూ,ఇప్పుడు కొత్తగా ఎన్నికల సంఘం పైనే ఆరోపణలు చేస్తున్న రాహుల్ గాంధీ సారధ్యంలోని కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ బద్ధమైన సంస్థపై ఆరోపణలు చేయటం విడ్డూరం అని అన్నారు.నరేంద్ర మోదీ సారథ్యంలో బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజల్లో ఆదరణ రోజు రోజుకి పెరుగుతుండటం వల్లే రాహుల్ గాంధీ, ఇండియా కూటమి పార్టీలు ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేస్తున్నాయని అన్నారు. కర్ణాటక, తెలంగాణలో గెలిచినప్పుడు ఇవిఎం లపై కానీ, ఎన్నికల సంఘంపై కానీ ఆరోపణలు చేయని కాంగ్రెస్, ఓటమి చెందినప్పుడు మాత్రం ఇవిఎం లపై ఆరోపించడం సిగ్గుచేటు అని అన్నారు. ఎలాంటి అనుమానాలు ఉన్నా లిఖిత పూర్వకంగా రాసి ఇస్తే చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం స్పష్టం చేసినప్పటికీ కావాలనే ఆరోపిస్తూ ప్రజలను, మీడియాను తప్పు తోవ పట్టిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్, బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు వేణు, నాయకులు సురేష్, సంతోష్ రెడ్డి, రవీందర్, రాజేష్, రాజ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసర పరిస్థితులలో ప్రాణాలు నిలబెట్టాలనే లక్ష్యం నాది

వనపర్తి

జిల్లా కేంద్రములో క్రిటికల్ కేర్ సెంటర్ (అత్యవసర వైద్య సేవల విభాగం)నిర్మాణం,ఆధునిక పరికరాలను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి బి.ఆర్.ఎస్ శ్రేణులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఒక్క రూపాయి ఖర్చు లేకుండా సామాన్య పేద ప్రజలకు వైద్యం అందాలన్న సదుద్దేశ్యంతో ఆనాడు కె.సి.ఆర్ మండల స్థాయి,జిల్లా స్థాయి ఆసుపత్రులు అధునూతనమైన పరికరాలతో ఏర్పాటు చేయడం జరిగింది అని అన్నారు. అందులో భాగంగానే జిల్లా కేంద్రంలో నా హాయంలో 17కోట్లతో క్రిటికల్ కేర్ సెంటర్ (అత్యవసర వైద్య సేవల విభాగం)అధునాతన పరికరాలతో మంజూరు చేయించాము అని అన్నారు ఇట్టి నిర్మాణం,ఎక్విప్మెంట్లు గూర్చి ఏ.ఈ సాదిక్,కాంట్రాక్టర్ చంద్రమోహన్ రెడ్డి ని అడిగి తెలుసుకున్నారు .దాదాపు సమకురీనాయని వారు తెలిపారు.

క్రిటికల్ కేర్ సెంటర్ లో 50బెడ్సులో ఒకేసారి 50మందికి అత్యవసర వైద్య సేవలు అందుతాయి అని అదేవిధంగా 25 ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఎ.అ.జ) బెడ్స్ తో వైద్యం అందిస్తారని నిరంజన్ రెడ్డి తెలిపారు. టి దయాగ్నిటిక్ హబ్ ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించాలని 2కోట్ల 40లక్షలతో సి.టి స్కాన్ ఏర్పాటు చేశామని ఇందులో 135 పరీక్షలు నిర్వహించడానికి టి దయాగ్నటిక్ హబ్ సెంటర్ మంజూరు చేసి సేవలు అందిస్తున్నామని అన్నారు.ఇందులో 30,40పరీక్షలు నిర్వహించడం లేదని తెలిసిందని ఇట్టి విషయములో జిల్లా కలెక్టర్ తో మాట్లాడి మెరుగైన పరీక్షలు నిర్వహించాలని సూచించడం జరిగిందని అదేవిధంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కొరవడిన వసతుల,సేవల గూర్చి వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి లేఖ వ్రాస్తానని తెలిపారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రినీ పరిశీలించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి . జిల్లా కేంద్రములో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(మాత శిశు సంరక్షణ కేంద్రం)ను వార్డుల వారిగా కలియ తిరుగుతూ రోగులను ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలు సావధానంగా విని వైద్యులకు పలు సూచనలు చేశారు. సిబ్బంది రోగులతో ఆప్యాయంగా,వినమరంగా మాట్లాడాలని పరుష పదజాలం వాడరాదని హెచ్చరించారు. గర్భిణులు,నవజాత శిశువులను ఆప్యాయంగా పలకరించి తల్లుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నిరంజన్ రెడ్డి వెంట గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్ పి రమేష్ గౌడ్,నందిమల్ల.అశోక్,గంధం.పరంజ్యోతి,

## ఒడిశా, పంజాబ్, ఆంధ్రప్రదేశ్‌లో రూ.4600 కోట్ల వ్యయంతో సెమీకండక్టర్ తయారీ యూనిట్ల ఏర్పాటు.

న్యూఢిల్లీ, భారత శక్తి ప్రతినిధి, ఆగస్టు 12: సెమీకండక్టర్, అధునాతన ప్యాకేజింగ్ రంగంలో భారత్ వేగంగా వృద్ధి చెందుతున్నది.ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశం ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం) కింద మరో నాలుగు సెమీకండక్టర్ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది.ఇప్పటికే వివిధ దశల్లో అమల్లో ఉన్న ఆరు ఆమోదిత సెమీ కండక్టర్ ప్రాజెక్టులతో భారత్‌లోని సెమీ కండక్టర్ వ్యవస్థ వేగం పుంజుకుంటోంది. ఈ రోజు ఆమోదం పొందిన నాలుగు ప్రతిపాదనలు ఎస్ఐసెమ్, కాంటినెంటల్ డివైజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (సీడీఐఎల్), 3డీ గ్లాస్ సొల్యూషన్స్ ఐఎన్‌సీ, అడ్వాన్స్ సిస్టమ్ ఇన్ ప్యాకేజ్ (ఏఎస్ఐపీ) టెక్నాలజీల నుంచి వచ్చాయి.ఆమోదం పొందిన ఈ నాలుగు ప్రతిపాదనలు సుమారుగా రూ.4,600 కోట్ల పెట్టుబడితో సెమీకండక్టర్ తయారీ సౌకర్యాలను ఏర్పాటు చేసి 2034 మంది నిపుణులకు ఉద్యోగాలు కల్పిస్తాయని అంచనా వేస్తున్నారు. ఎలక్ట్రానిక్ తయారీ వ్యవస్థకు ప్రోత్సాహం పరోక్షంగా అనేక ఉద్యోగాలను సృష్టిస్తుంది. ఈ రోజు మరో నాలుగు ప్రతిపాదనలను ఆమోదించడంతో ఐఎస్ఎం ద్వారా ఆమోదం పొందిన ప్రాజెక్టుల మొత్తం సంఖ్య పదికి, మొత్తం పెట్టుబడులు 6 రాష్ట్రాల్లో రూ.1.60 లక్షల కోట్లకు చేరుకున్నాయి.టెలికాం, ఆటోమోటివ్, డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్ వినియోగ వస్తువులు, ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్‌లో సెమీకండక్టర్లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో కొత్తగా ఆమోదం పొందిన నాలుగు సెమీ కండక్టర్ ప్రాజెక్టులు ఆత్మనిర్భర్ భారత్‌కు గణనీయంగా తోడ్పడతాయి.ఎస్ఐసీసెమ్, త్రీడీ గ్లాస్ లను ఒడిశాలో నెలకొల్పుతారు. సీడీఐఎల్ పంజాబ్‌లో ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో ఏఎస్ఐపీ ఏర్పాటవుతుంది.ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఉన్న ఇన్ఫో వ్యాలీలో సిలికాన్ కార్బయిడ్ (ఎస్ఐసీ) ఆధారిత కాంపౌండ్ సెమీ కండక్టర్ సమీకృత తయారీ కేంద్రాన్ని యూకేకి చెందిన క్లాస్-సిక్ వేఫర్ ఫ్యాబ్ లిమిటెడ్ సహకారంతో ఎస్ఐసీసెమ్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేస్తోంది. ఇది దేశంలోనే మొదటి వాణిజ్య కాంపౌండ్ తయారీ వ్యవస్థ అవుతుంది. సిలికాన్ కార్బయిడ్ పరికరాలను తయారు చేయాలని ఈ ప్రాజెక్టు ప్రతిపాదించింది. ఈ కాంపౌండ్ సెమీకండక్టర్ తయారీ వ్యవస్థకు ఏడాదికి 60,000 వేఫర్ల తయారీ, 96 మిలియన్ యూనిట్ల ప్యాకేజింగ్ సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ప్రతిపాదిత ఉత్పత్తులను క్షిపణులు, రక్షణ పరికరాలు, విద్యుత్ వాహనాలు (ఈవీలు), రైల్వే, ఫాస్ట్ ఛార్జర్లు, డేటా సెంటర్ ర్యాకులు, వినియోగ వస్తువులు, సోలార్ పవర్ ఇన్వర్టర్లలో ఉపయోగిస్తారు.ఒడిశాలోని భువనేశ్వర్‌లో, ఇన్ఫో వ్యాలీలో సమీకృత అధునాతన ప్యాకేజింగ్, ఎంబెడెడ్ గ్లాస్ సబ్‌స్ట్రేట్ యూనిట్‌ను 3 డీ గ్లాస్ సొల్యూషన్స్ ఐఎన్‌సీ (త్రీడీజీఎస్) ఏర్పాటు చేస్తుంది. ఈ యూనిట్ అత్యంత ఆధునిక ప్యాకేజింగ్ సాంకేతికతను భారత్‌కు తీసుకువస్తుంది. ఈ తయారీ కేంద్రంలో పాసివ్స్, సిలికాన్ బ్రిడ్జిలు ఉన్న గ్లాస్ ఇంటర్ పోజర్, త్రీడీ హెటిరోజీనస్ ఇంటిగ్రేషన్ (3డీహెచ్ఐ) మాడ్యూళ్లతో సహా వివిధ రకాల అత్యాధునిక సాంకేతికతలు ఉంటాయి. ఏడాదికి 69,600 గ్లాస్ ప్యానెల్ సబ్‌స్ట్రేట్స్, 50 మిలియన్ అసెంబుల్డ్ యూనిట్లు, 13,200 త్రీడీహెచ్ఐ మాడ్యూళ్లను తయారు చేసే సామర్థ్యం ఈ కేంద్రానికి ఉంటుంది. ప్రతిపాదిత ఉత్పత్తులను రక్షణ, హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ, ఆర్ఎఫ్, ఆటోమేటివ్, ఫోటానిక్స్, కో-ప్యాకేజ్డ్ ఆప్టిక్స్ తదితరమైన వాటిలో ఉపయోగిస్తారు.ఆంధ్రప్రదేశ్‌లో సెమీ కండక్టర్ తయారీ యూనిట్‌ను దక్షిణ కొరియాకు చెందిన అపాక్ట్ కో లిమిటెడ్ సంస్థ సహకారంతో అడ్వాన్స్ సిస్టమ్ ఇన్ ప్యాకేజ్ టెక్నాలజీస్ (ఏఎస్ఐపీ) ఏర్పాటు చేస్తుంది. దీని వార్షిక సామర్థ్యం 96 మిలియన్ యూనిట్లు. ఇక్కడ తయారయ్యే ఉత్పత్తులను మొబైల్ ఫోన్లు, సెట్-టాప్ బాక్సులు, ఆటోమొబైల్ అప్లికేషన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల్లో ఉపయోగిస్తారు.పంజాబ్‌లోని మొహాలీలో తన ప్రత్యేక సెమీ కండక్టర్ తయారీ యూనిట్‌ను కాంటినెంటల్ డివైజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (సీడీఐఎల్) విస్తరించనుంది. సిలికాన్, సిలికాన్ కార్బయిడ్ ఉపయోగించి ఎంఓఎస్ఎఫ్ఈటీలు, ఐజీబీటీలు, షాట్కీ బైపాస్ డయోడ్లు, ట్రాన్సిస్టర్లు తరహా హై పవర్ డిస్క్రీట్ సెమీకండక్టర్ పరికరాలు ఇక్కడ తయారవుతాయి. ఇప్పటికే ఉన్న యూనిట్‌ను విస్తరించడం ద్వారా దీని వార్షిక సామర్థ్యం 158.38 మిలియన్ యూనిట్లకు చేరుకుంటుంది. ప్రతిపాదిత యూనిట్లలో తయారు చేసే పరికరాలు ఈవీలు, వాటి చార్జింగ్ మౌలిక సదుపాయాలతో సహా ఆటోమోటివ్ ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధన వ్యవస్థలు, విద్యుత్ నిల్వ చేసే పరికరాలు, పారిశ్రామిక అప్లికేషన్లు, ప్రసార మౌలిక సదుపాయాల్లో ఉపయోగిస్తారు.దేశంలోనే మొట్టమొదటి వాణిజ్య కాంపౌండ్ తయారీ వ్యవస్థ, అత్యాధునిక గ్లాస్ ఆధారిత సబ్‌స్ట్రేట్ సెమీకండక్టర్ ప్యాకేజింగ్ యూనిట్‌తో సహా ఆమోదం పొందిన ఈ ప్రాజెక్టులతో దేశంలో సెమీ కండక్టర్ల వ్యవస్థకు గణనీయమైన ప్రోత్సాహం లభిస్తుంది.278 విద్యా సంస్థలు, 72 అంకుర సంస్థలకు ప్రభుత్వం అందిస్తున్న మద్దతు అంతర్జాతీయ స్థాయి చిప్ రూపకల్పన సామర్థ్యాలను దేశంలో విస్తరించేందుకు ఉపకరిస్తుంది.ఇప్పటికే 60,000 మందికి పైగా విద్యార్థులు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం ప్రయోజనాలను పొందారు.

## అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు కేటాయించాలి ప్రభుత్వ విప్ ఆది..



వేములవాడ, ఆగస్టు 12 (భారత శక్తి) : వేములవాడ నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరగా, వెంటనే నిధులు మంజూరు చేయాలని సంబంధిత అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనుల్లో భాగంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. కథలాపూర్,మేడిపల్లి, భీమవరం మండలాల వరద ప్రాధాన్యాన్ని, కలికోట సూరమ్మ చెరువు కుడి ఎడమ కాలువల నిర్మాణానికి భూసేకరణ నిధులను విడుదల చేయవలసిందిగా కోరారు,ఇప్పటికే గత పది రోజుల క్రితం రూ 10 కోట్ల నిధులు విడుదల చేయడం జరిగిందని, మరిన్ని నిధులు విడుదల చేస్తే కుడి ఎడమ కాలువల నిర్మాణం పూర్తవుతుందని ముఖ్యమంత్రికి ప్రభుత్వ విప్ వివరించారు. ఆనాడు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే ప్రాజెక్టు పనిని ప్రారంభించి నేడు మత్తడి నిర్మాణం పూర్తి చేసుకున్నామని, ప్రస్తుతం కట్ట పనులు శరవేగంగా కొనసాగుతాయని పేర్కొన్నారు. కుడి ఎడమ కాలువల నిర్మాణం పూర్తయితే సుమారు 43 వేల ఎకరాల సాగునీరు అందించడం జరుగుతుందని తెలిపారు. స్పందించిన సీఎం రెండు విడుదలగా నిధులు మంజూరు చేయాల్సిందిగా సంబంధిత అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేశారు. తెలిపిన వెంటనే నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. అలాగే చందుర్తి మోత్కరావుపేట రోడ్డు నిర్మాణానికి, ఇప్పటికే అటవి శాఖ అనుమతులు వచ్చి ఉన్నాయని,రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి రూ 7 కోట్ల పైచిలుకు నిధులు కేటాయించిందని, రోడ్డు నిర్మాణం పూర్తవడానికి మరో రూ 10 కోట్ల అవసరం ఉందని, కోనరావుపేట మండల పరిధిలోని మూలవాగు, పెంటివాగులపై బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు,మూల వాగు, పెంటి వాగు పై ప్రత్యేకంగా ఈ గ్రామాల మధ్య బ్రిడ్జిల నిర్మాణానికి దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. బావుసాయిపేట-వెంకట్రావుపేట గ్రామాల మధ్య,మామిడిపెల్లి-నిజామాబాద్ గ్రామాల మధ్య, వట్టిమల్ల-నిమ్మపెల్లి ,వెంకట్రావుపేట -కొండాపూర్ గ్రామాలలో బ్రిడ్జిల నిర్మాణాన్ని చేయవలసిందిగా ముఖ్యమంత్రిని కోరగా హామ్ స్కీములో సంబంధిత బ్రిడ్జి లా నిర్మాణం చేపడతానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు.

## విద్యార్థుల్లో చదువుతోపాటు ఆటలు ముఖ్యం..



పోరుమామిళ్ల, (భారత శక్తి ప్రతినిధి) ఆగస్టు 12: పోరుమామిళ్ల మండలం అక్కల్ రెడ్డి పల్లె గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు విద్యనభ్యసించి మంచి స్థాయిలో ఉండగలిగిన సిద్దిపేట లయన్స్ క్లబ్ మెంబర్ దాసరిపల్లి జోజి (ఎక్స్ఆర్మీ)(జ్యోతి మన వికాస కేంద్రం సిద్దిపేట) మరియు బద్వేల్ ఎంఈఓ ప్రమీల, కాకినాడ ఎంఈఓ దాసరపల్లి డేవిడ్,చాపాడు జడ్పీ హైస్కూల్ పీడీ ఓబయ్య వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు శారీరక మానసిక దృఢత్వానికి ఆటవిడుపు ముఖ్యంగా భావించి ఆట వస్తువు లను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గురయ్య , బాల చెన్నయ్య లు మాట్లాడుతూ ఈ పాఠశాలలో ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలు జరగాలని ఇటువంటి కార్యక్రమాలకు పూర్వ విద్యార్థులు మరియు గ్రామ ప్రజలు గ్రామాలలోని ఉద్యోగులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. అదేవిధంగా దాతలు జోజి, డేవిడ్, ప్రమీల, ఓబయ్యలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య బోధనలు ఉన్నాయని గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలను గ్రామాల పెద్ద మనుషులు చిన్న మనసులు పిల్లల తల్లిదండ్రులు అభివృద్ధి పరచుకోవాలని ప్రతి ఇంట్లో ఉన్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపాలని ప్రభుత్వ సౌకర్యాలను అనుభవించాలని విద్యార్థులు తల్లిదండ్రులకు గుర్తు చేశారు. అదేవిధంగా ఉపాధ్యాయులు నవోదయ క్లాసులో బోధించే విషయంలో తగిన మెటీరియల్ అందించగలమని వారు తెలియజేశారు.ఇలాంటి కార్యక్రమం మరెన్నో జరుపుకోవాలని ప్రభుత్వ పాఠశాలను ముందుకు తీసుకెళ్లాలని ఆశ భావం వ్యక్తం చేశారు. విద్యార్థినీ విద్యార్థులకు ఆట వస్తువులను బహూకరించిన జోజి, డేవిడ్, ప్రమీల, ఓబయ్య, లకు మరియు నూతనంగా వచ్చి పాఠశాల అభివృద్ధిలో అత్యధికంగా పాటుపడుతున్న ఉపాధ్యాయులకు గ్రామ పెద్దమనుషులు పిల్లల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ సుశీలమ్మ ,వైస్ చైర్మన్ రామయ్యలు గ్రామ పెద్దలు బాలస్వామి, సాల్మన్, బాలకరయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## డ్రైవర్స్ కాలనీ వన్ అంగన్వాడీ కేంద్రాన్ని, రాజీవ్ నగర్ అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించిన సంక్షేమ శాఖ అధికారులు..







కామారెడ్డి,(భారత శక్తి ప్రతినిధి) ఆగస్టు 12: మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ రాణి జిల్లా సంక్షేమ శాఖ అధికారి కార్యాలయము కలెక్టరేట్ కామారెడ్డిని సందర్శించడం జరిగింది.ఈ సందర్భంగా శాఖలోని వివిధ శాఖలను సందర్శించి శాఖ పనితీరును అమలు చేయుచున్న పథకాలను పై సమీక్ష నిర్వహించారు.కామారెడ్డి జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల ఆధ్వర్యంలో లోని ఐదు సిడిపిఓ ప్రాజెక్టుల అధికారులతో మాట్లాడి వారి యొక్క సమస్యను అడిగి తెలుసుకున్నారు, వారికి తగు సూచనలు చేయడం జరిగింది.కామారెడ్డి నందుగల డ్రైవర్స్ కాలనీ వన్ అంగన్వాడీ కేంద్రాన్ని, రాజీవ్ నగర్ అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించడం జరిగింది.తదుపరి సఖి కేంద్రం( వన్ స్టాప్ సెంటర్) ను సందర్శించి,సఖి కేంద్ర నిర్వాణకై సిబ్బందితో సమీక్ష జరిపినారు. సిబ్బందికి తగు సూచనలు ఇవ్వడం జరిగింది, నూతనంగా నిర్మించుచున్న సఖి భవన నిర్మాణం పనితీరును పరిశీలించినారు.చివరగా ప్రభుత్వ బాలికల వసతి గృహమును సందర్శించినారు. చిల్డ్రన్ హోమ్ లోని బాలికలతో వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బాలికలకు భోజన వసతి ఆరోగ్య సదుపాయాల పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూపరిండెంట్ ఆదేశించినారు.ఈ సందర్భంగా ఆర్జెడి ఝాన్సీ మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పనితీరు సంతృప్తిగా ఉందని తెలపడం జరిగింది.

## వరికుంట్ల %KGBV% పాఠశాలలో %GCDO% డి. రూత్ ఆకస్మిక తనిఖీ..



పోరుమామిళ్ళ, (భారత శక్తి ప్రతినిధి) ఆగస్టు 12: స్థానిక వరికుంట్ల గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని (%KGBV%) మంగళవారం గిరిజన సంక్షేమ అభివృద్ధి అధికారి (%GCDO%) డి. రూత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడిన ఆమె, క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి అందుబాటులో ఉన్న అన్ని సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు.జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ శారద, ఏఎన్ఎం పద్మ, ఆశావర్కర్ విజయలక్ష్మి, పాఠశాల ప్రిన్సిపాల్ పి. మెర్సిరాణి పాల్గొన్నారు.తదుపరి %FA%1 పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు, సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు అందించారు.

## కశ్మీర్‌లో బలగాలకు సవాల్.. ఎవరీ 'బెడ్‌రూం జిహాదీలు'

జమ్మూకశ్మీర్ (%జీఖఎఎబ ఖఖంష్ట్రఎఅతీ%)లో ఉగ్రవాదులతో ఏళ్ల తరబడి ప్రత్యక్ష పోరాడిన భద్రతా సంస్థలు ప్రస్తుతం రహస్య శత్రువును ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. ఇంట్లోనే కూర్చుని సామాజిక మాధ్యమాల వేదికగా తప్పుడు సమాచార వ్యాప్తికి పాల్పడుతున్న, వర్గ విభేదాలను రెచ్చగొడుతున్న 'బెడ్‌రూం జిహాదీ'ల (%దీవసతీశీశీఎ జీఱష్ట్రుఽఱం%) రూపంలో వారికి సవాల్ ఎదురవుతోంది. సాంప్రదాయ ఉగ్రవాదులకు భిన్నంగా ఉండే ఈ దుర్మార్గులు జమ్మూకశ్మీర్‌ను అస్థిరపరిచే ప్రయత్నాలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీనికోసం సోషల్ మీడియాలో అనేక నకిలీ ఖాతాలు తెరిచినట్లు గుర్తించినట్లు వెల్లడించారు.కశ్మీర్ లోయలో మత కలహాలు, అశాంతి సృష్టించాలనే లక్ష్యంతో దుష్ప్రచారం, రెచ్చగొట్టే కంటెంట్ వ్యాప్తికి పాల్పడుతున్న సోషల్ మీడియా ఖాతాల నెట్‌వర్క్‌ను అధికారులు తమ దర్యాప్తులో గుర్తించారు. పాకిస్థాన్‌లోని ఉగ్ర సంస్థలు, వాటి సానుభూతిపరులు దీన్ని నియంత్రిస్తున్నట్లు భావిస్తున్నారు. అనేక వారాలుగా కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా వేలాది సోషల్ మీడియా పోస్టులు, వ్యాఖ్యలు, ప్రైవేటు సందేశాలను అధికారులు విశ్లేషించారు. ఈ క్రమంలోనే ఈ సంఘ విద్రోహక కార్యకలాపాలకు పాక్‌లో ఉన్న హ్యాండ్లర్లకు ప్రత్యక్ష సంబంధం ఉందనేందుకు ఆధారాలు లభ్యమయ్యాయి.

# 4,194 కోట్లతో ఫస్ట్ క్రై ఐపీఓ.. ధరల శ్రేణి, లాట్ సైజ్ వివరాలివే..




దిల్లీ: ఆన్‌లైన్ ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్ ఫస్ట్‌క్రై మాతృ సంస్థ బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్ లిమిటెడ్ ఐపీఓ ద్వారా రూ.4,194 కోట్లు సమీకరించనుంది. ఆగస్టు 6 నుంచి సబ్‌స్క్రిప్షన్ మూడు రోజుల పాటు అందుబాటులో ఉండనుంది. దీనికి సంబంధించిన ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.440-465గా నిర్ణయించింది. యాంకర్ ఇన్వెస్టర్లకు ఆగస్టు 5న సబ్‌స్క్రిప్షన్‌కు అందుబాటులో ఉంటుంది. ఐపీఓలో భాగంగా 75 శాతం షేర్లను క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు, 15 శాతం ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు, రిటైల్ ఇన్వెస్టర్లకు 10 శాతం చొప్పున రిజర్వ్ చేశారు. ఇన్వెస్టర్లు ఐపీఓలో పాల్గొనాలంటే కనీసం 32 షేర్లను (లాట్) కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ ఐపీఓ ద్వారా బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్ రూ.1666 కోట్లకు సమానమైన ఈక్విటీ షేర్లను ఫ్రెష్ ఇష్యూ ద్వారా జారీ చేస్తోంది. రూ.2,528 కోట్లకు సమానమైన 5.44 కోట్ల షేర్లను ప్రస్తుత వాటాదారులు వదులుకోనున్నారు. సాఫ్ట్‌బ్యాంక్‌కు చెందిన ఏవీఎఫ్ ఫ్రాగ్ 2.03 కోట్లు, ఆటో మొబైల్ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా 28.06 లక్షల షేర్లను విక్రయించనున్నాయి. ప్రస్తుతం బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్‌లో సాఫ్ట్‌బ్యాంక్‌కు 25.55 శాతం, మహీంద్రా అండ్ మహీంద్రాకు 10.98 శాతం వాటా ఉంది.

సాఫ్ట్‌బ్యాంక్, మహీంద్రాతో పాటు పీఐ ఆపర్చునిటీస్ ఫండ్, టీపీజీ, న్యూక్వెస్ట్ ఆసియా ఇన్వెస్ట్‌మెంట్స్, యాప్రికాట్ ఇన్వెస్ట్‌మెంట్స్, ష్రోడర్స్ క్యాపిటల్ సంస్థలు ఓఎఫ్ఎస్ ద్వారా షేర్లను విక్రయించనున్నాయి.స్వల్పంగా పెరిగిన వాణిజ్య సిలిండర్ ధర.. ఏటీఎఫ్ ధర 2% పెంపుఇక కంపెనీ విషయానికొస్తే.. 2010లో ఫస్ట్ క్రై ప్రారంభమైంది. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఓ వయసు వచ్చే పిల్లలు, వారి తల్లులకు అవసరమైన అన్ని వస్తువులను ఒకచోట అందించడమే లక్ష్యంగా ఇది ఏర్పాటైంది. భారత్ సహా యూఏఈ, కింగ్‌డమ్ ఆఫ్ సౌదీ అరేబియాకూ వ్యాపార కార్యకలాపాలను విస్తరించింది. ఐపీఓ ద్వారా సమకూరిన నిధులను కంపెనీ 'బేబీ హగ్' పేరిట కొత్త స్టోర్లను నెలకొల్పేందుకు ఆ కంపెనీ వినియోగించనుంది. విదేశాలకు ఈ బ్రాండ్‌ను విస్తరించనుంది. సేల్స్, మార్కెటింగ్ కార్యకలాపాలు, కార్పొరేట్ అవసరాలకు ఈ మొత్తాన్ని వినియోగించనున్నట్లు కంపెనీ పేర్కొంది. ఈ ఐపీఓకు కోటక్ మహీంద్రా క్యాపిటల్ కంపెనీ లిమిటెడ్, మోర్గాన్ స్టాన్లీ ఇండియా కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్, బోఫా సెక్యూరిటీస్ ఇండియా లిమిటెడ్, జేఎం ఫైనాన్షియల్ లిమిటెడ్, అవెండస్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్ బుక్ రన్నింగ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి.ఐపీఓ ముచ్చట్లు..హీరో మోటోకార్ప్‌కు చెందిన ఫైనాన్షియల్ సర్వీసెస్ విభాగం హీరో ఫిన్‌కార్ప్ ఐపీఓ ద్వారా రూ.3,668 కోట్లు సమీకరించేందుకు సెబీకి దరఖాస్తు చేసుకుంది. రూ.2,100 కోట్లు ఫ్రెష్ ఇష్యూ ద్వారా, రూ.1,568 కోట్లు ఆఫర్ ఫర్ సేల్ ద్వారా కంపెనీ నిధులు సేకరించనుంది.ఫార్మాస్యూటికల్ ఫార్ములేషన్ కంపెనీ రూబికాన్ రీసెర్చ్ లిమిటెడ్ కూడా రూ.1,085 కోట్లు సమీకరించేందుకు డ్రాఫ్ట్ పేపర్లను సెబీకి సమర్పించింది. ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.500 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో రూ.585 కోట్లు సమీకరించనుంది.

# ఐటీఆర్ ఫైలింగ్.. గడువు దాటితే వీటిని ఎదుర్కోవాల్సిందే



ఆదాయపు పన్ను చెల్లింపుదారులు రిటర్నులు దాఖలు చేసేందుకు గడువు బుధవారం (జులై 31)తో ముగియనుంది. ఓ వైపు సాంకేతిక అంతరాయాలు ఉన్నా.. గడువు పొడిగించే సూచనలైతే కనిపించడం లేదు. చాలామంది అనేక కారణాలతో రిటర్నుల దాఖలు గడువును అందుకోలేకపోతున్నారు. ఇలా నిర్ణీత గడువులోగా రిటర్నులు ఫైల్ చేయకపోతే వారు పలు ప్రయోజనాలు కోల్పోవాల్సి ఉంటుంది. అవేంటో ఇప్పుడు చూద్దాం.ఒక పన్ను విధానమే..నిర్దేశిత గడువు దాటిన తర్వాత కొత్త పన్ను విధానం మాత్రమే అమల్లో ఉంటుందనే విషయం గుర్తుంచుకోండి. అంటే పాత పన్ను విధానం ఎంచుకునే ఆప్షన్ ఉండదన్నమాట. డెడ్‌లైన్ ముగిశాక బిలేటెడ్ ఐటీఆర్‌ను కేవలం కొత్త పన్ను విధానంలో మాత్రమే దాఖలు చేయాల్సిఉంటుంది. దీనివల్ల పాత పన్ను విధానంలో మినహాయింపులు క్లెయిమ్ చేసుకునే అవకాశాన్ని ట్యాక్స్‌పేయర్లు కోల్పోతారు. దానివల్ల కొత్త పన్ను విధానం కింద అదనంగా పన్ను చెల్లించాల్సి రావొచ్చు.గడువులోపు రిటర్నులు ఫైల్ చేయకపోతే ఆదాయపు పన్ను చట్టం, 1961లోని సెక్షన్ 234ఎఫ్ కింద ఆలస్య రుసుము కట్టాల్సి ఉంటుంది. అపరాధ రుసుముతో కలిపి డిసెంబరు 31 వరకు రిటర్నులు దాఖలు చేసుకోవచ్చు. పన్ను వర్తించే ఆదాయం రూ.5 లక్షల పైన ఉంటే రూ.5000, అదే రూ.5 లక్షలలోపు ఉంటే రూ.1000 కట్టాలి. ఐటీఆర్ దాఖలు సమయంలో చెల్లించాల్సిన పన్ను సున్నా చూపిస్తున్నప్పటికీ ఆలస్యంగా ఫైల్ చేస్తే జరిమానా తప్పదు. 6 నుంచి ఫస్ట్‌క్రై ఐపీఓ సబ్‌స్క్రిప్షన్.. పూర్తి వివరాలు ఇవే..వడ్డీ అదనం ఒకవేళ ఆదాయపు పన్ను శాఖకు పన్ను బకాయి ఉంటే దానికి సెక్షన్ 234ఏ కింద వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. మీరు రిటర్నులు దాఖలు ఆలస్యం చేసినన్ని రోజులూ నెలకు 1 శాతం చొప్పున వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది.రీఫండ్లు ఆలస్యంఐటీఆర్‌లు ఆలస్యంగా దాఖలు చేస్తే రీఫండ్లు కూడా అలస్యం అవుతాయి. ఎప్పుడైతే మీరు రిటర్నులు దాఖలు చేసి, వెరిఫై చేస్తారో అప్పుడే ఐటీ శాఖ మీకు చెల్లించాల్సిన రీఫండ్‌ను జారీ చేస్తుంది.నష్టాలు బదిలీ చేసుకోలేరు

కొన్నిరకాల పెట్టుబడులపై నష్టాలు వస్తే వాటిని వచ్చే ఏడాది సమర్పించబోయే ఐటీఆర్ లో చూపించే అవకాశం ఉంటుంది. ఫలితంగా పన్ను ప్రయోజనాలు పొంది కొంత ఆదా చేసుకోవచ్చు. అయితే, గడువులోగా ఐటీఆర్ దాఖలు చేసినవారికి మాత్రమే ఈ ప్రయోజనం ఉంటుంది. స్టాక్ మార్కెట్, మూలధన రాబడి, వ్యాపారం వంటి ఆదాయాలకు ఇది వర్తిస్తుంది. ఇంటి ఆస్తిని అమ్మినప్పుడు వచ్చిన నష్టాన్ని మాత్రం గడువు తేదీ దాటినా సర్దుబాటు చేసుకునే వెసులుబాటు ఉంది.

# ఐటీఆర్ ఫైలింగ్ పూర్తయ్యిందా? రీఫండ్లకు ఎంత టైమ్ పడుతుంది?

గత ఆర్థిక సంవత్సరానికి (2023-24) ఆదాయపు పన్ను రిటర్నుల దాఖలు టఅశ్రీగడువు జులై 31తో ముగిసింది. నిర్దేశిత గడువులోగా 7 కోట్లమందికి పైగా తమ రిటర్నులు దాఖలు చేసినట్లు ఐటీ శాఖ వెల్లడించింది. నిన్న ఒక్కరోజే 50 లక్షలకు పైగా రిటర్నులు దాఖలయ్యాయి. ఇంకా ఫైల్ చేయని వారు పెనాల్టీతో డిసెంబర్ 31 వరకు చెల్లించే అవకాశం ఉంది. అయితే, ఇప్పటికే ఐటీఆర్ దాఖలు చేసిన వారు రీఫండ్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఇంతకీ రీఫండ్లు పొందడానికి ఎంత గడువు పడుతుంది? ఆలస్యానికి కారణాలేంటి?నిర్దేశిత మొత్తం కంటే ఎక్కువ పన్ను చెల్లించే వారికి ఆదాయపు పన్ను శాఖ రీఫండ్లను జారీ చేస్తుంది. నిర్దేశిత గడువులోగా ఐటీఆర్ ఫైల్ చేసి వెరిఫై చేసిన వారు రీఫండ్లను పొందేందుకు అర్హులు. దాఖలైన ఐటీఆర్‌లను ఆదాయపు పన్ను శాఖ ప్రాసెస్ చేసిన అనంతరం ఐటీ శాఖ రీఫండ్ల ప్రక్రియ మొదలు పెడుతుంది. ఈ-ఫైలింగ్ పోర్టల్ ప్రకారం (ఆగస్టు 1 నాటికి) 7.28 కోట్ల ఐటీఆర్‌లు దాఖలవ్వగా.. అందులో 6.32 కోట్ల ఐటీఆర్‌లు వెరిఫై చేశారు. ఇప్పటి వరకు 2.69 కోట్ల ఐటీఆర్‌లను ప్రాసెస్ చేసినట్లు ఐటీ శాఖ తెలిపింది.వన్‌ప్లస్ యూజర్లకు లైఫ్‌టైమ్ ఫ్రీ స్క్రీన్ అప్‌గ్రేడ్ ఆఫర్రీఫండ్లకు ఎన్ని రోజులు?రీఫండ్ల జారీకి నిర్దిష్ట గడువు అంటూ ఏదీ లేదు. సాధారణంగా ఖాతాలో నగదు జమ కావడానికి గరిష్ఠంగా 4-5 వారాలు గడువు పడుతుందని ఐటీ శాఖ వర్గాలు చెబుతున్నాయి. అయితే, సాంకేతికతను అందిపుచ్చుకోవడం, రొటీన్ టాస్కుల విషయంలో ఆటోమేషన్ వినియోగం కారణంగా గతంతో పోలిస్తే రీఫండ్ల జారీలో వేగం పెరిగింది. ఈ కారణంగానే కొందరికి



ముందుగానే నగదు జమ అవుతోంది. సంక్లిష్టతతో కూడిన రిటర్నులు, ఐటీఆర్‌లో సమర్పించిన డేటాలో వ్యత్యాసాలు కారణంగా రీఫండ్ల జారీ ఆలస్యం కావొచ్చు.రీఫండ్ స్టేటస్ ఇలా..రీఫండ్ స్టేటస్‌ను ఆన్‌లైన్‌లో చెక్ చేసుకోవచ్చు. ఈ-ఫైలింగ్ పోర్టల్‌లోకి వెళ్లి.. ఐటీఆర్ స్టేటస్‌పై క్లిక్ చేసి మీ ఐటీఆర్ స్థితిని తెలుసుకోవచ్చు. ఒకవేళ పైన చెప్పిన గడువులోగా ఎలాంటి రీఫండ్ రాకపోతే ఐటీఆర్‌లో పొరపాట్లకు సంబంధించి ఐటీ శాఖ నుంచి ఏదైనా ఇంటిమేషన్ అందిందో లేదో ఈ-మెయిల్ చెక్ చేసుకోవాలి. రీఫండ్ అందే వరకు స్టేటస్‌ను చెక్ చేసుకోవడం ఉత్తమం. ఒక్కోసారి రీఫండ్లను జారీ చేసినా ఫెయిల్ అవ్వొచ్చు. బ్యాంక్‌ను ప్రీ వ్యాలిడేట్ చేయకపోవడం, బ్యాంక్ ఖాతా పేరు పాన్ వివరాలతో సరిపోలకపోవడం, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ తప్పుగా నమోదు చేయడం, ఇచ్చిన బ్యాంక్ ఖాతాను మూసివేయడం వంటి కారణాలతో రీఫండ్లు ఫెయిల్ అవ్వొచ్చు.

# ఓటీపీతో పాటు ఇతర అథెంటికేషన్ పద్ధతులకు ఆర్‌బీఐ ప్రతిపాదన

దిల్లీ: డిజిటల్ లావాదేవీల్లో ఎస్సెమ్మెస్ ఆధారిత ఓటీపీ వ్యవస్థతో పాటు అదనపు అథెంటికేషన్ ప్రక్రియలను ప్రతిపాదిస్తూ 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' (%=దీ×%) ముసాయిదా ఫ్రేమ్‌వర్క్‌ను విడుదల చేసింది. అథెంటికేషన్ నిమిత్తం ప్రత్యేకంగా ఒక పద్ధతినే తప్పనిసరి చేయలేదని ఆర్‌బీఐ తెలిపింది. కానీ, చాలావరకు డిజిటల్ చెల్లింపు (%ణఅస్త్రఅ-ˉఖశ్రీ్ఝఎవత్ం%) వ్యవస్థలు ఎస్సెమ్మెస్ ఆధారిత విధానాన్ని అమలు చేస్తున్నాయని గుర్తుచేసింది. ఓటీపీ వ్యవస్థ పనితీరు సంతృప్తికరంగానే ఉన్నప్పటికీ.. సాంకేతికంగా వచ్చిన అభివృద్ధి కారణంగా ప్రత్యామ్నాయ అథెంటికేషన్ వ్యవస్థలు సైతం అందుబాటులోకి వచ్చాయని వివరించింది.మరోవైపు ఏదైనా అదనపు అథెంటికేషన్ వ్యవస్థను యాక్టివేట్ చేసేటప్పుడు విధిగా కస్టమర్ అనుమతి తీసుకోవాలని ముసాయిదాలో ఆర్‌బీఐ తెలిపింది. కొత్త అథెంటికేషన్ వ్యవస్థ నుంచి వైదొలిగే ఏర్పాటు ఇవ్వాలని సూచించింది. కార్డుతో కూడిన లావాదేవీలు మినహా ఇతర డిజిటల్ చెల్లింపులన్నీ (%ణఅస్త్రఖ్ఝశ్రీ్ఝఎవత్ం%) అథెంటికేషన్‌ను కచ్చితంగా ఉపయోగించుకోవాలని సూచించింది. అది కూడా చెల్లింపు ప్రక్రియ ప్రారంభమైన తర్వాత సృష్టించిన ఫ్యాక్టర్‌ను ఆ ఒక్కసారికి మాత్రమే ఉపయోగించుకొనేలా ఉండాలని తెలిపింది. ఒకే ఫ్యాక్టర్‌ను పలుమార్లు ఉపయోగించే విధానాన్ని అనుమతించబోమని స్పష్టం చేసింది.

మరోవైపు అన్ని డిజిటల్ చెల్లింపులకు అలర్ట్ పంపడాన్ని




తప్పనిసరి చేస్తున్నట్లు ముసాయిదాలో ఆర్‌బీఐ పేర్కొంది. లావాదేవీని ప్రారంభించే సంస్థలు ఏ పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లతోను ప్రత్యేకంగా ఒప్పందాలు చేసుకోవద్దని స్పష్టంచేసింది. ఫలితంగా ఎలాంటి అథెంటికేషన్ వ్యవస్థలనైనా ఎంచుకునే వెసులుబాటు కస్టమర్లకు ఉంటుందని వివరించింది.మ్యూచువల్ ఫండ్లు, బీమా ప్రీమియం, క్రెడిట్‌కార్డు బిల్లు చెల్లింపుల విలువ రూ.లక్ష వరకు, ఇతర కేటగిరీల్లో రూ.15,000 వరకు చేసే రికరింగ్ లావాదేవీలకు ఈ-మ్యాండేట్‌ను తప్పనిసరి చేయాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. పాయింట్ ఆఫ్ సేల్ టెర్మినల్ల వద్ద కాంటాక్ట్‌లెస్ విధానంలో కార్డు ద్వారా చేసే రూ.5,000 చిన్న లావాదేవీలకు అథెంటికేషన్ నుంచి మినహాయింపునివ్వొచ్చని ప్రతిపాదించింది. ఈ ముసాయిదాపై సెప్టెంబర్ 15 వరకు అభిప్రాయాలు తెలియజేయొచ్చని ఆర్‌బీఐ పేర్కొంది.

# ఎలాంటి రుణాలు ఎంచుకోవచ్చు.. వేటికి దూరంగా ఉండాలి?

చాలా మంది అవసరాలకు రుణాలు తీసుకుంటూ ఉంటారు. ముఖ్యంగా మన వద్ద పరిమిత మొత్తంలో డబ్బు ఉండి, అవసరాలు ఎక్కువ ఉన్నప్పుడు రుణానికి ప్రయత్నించడం తప్పకపోవచ్చు. తీసుకున్న రుణాన్ని ఏ విధమైన అవసరానికి, లక్ష్యానికి ఉపయోగిస్తున్నామనేది ప్రధానం. దీన్ని బట్టి అది మంచి రుణమా, చెడ్డ రుణమా అనేది ఆధారపడి ఉంటుంది. ఏదైనా రుణాన్ని తీసుకునే ముందు రుణానికి సంబంధించిన ఉద్దేశాన్ని జాగ్రత్తగా పరిశీలించాలి. రుణం కింద తీసుకున్న డబ్బును ఖర్చు చేస్తుంటే, అది దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలకు దోహదం చేస్తుందా? లేదా స్వల్పకాలిక కోరికలను మాత్రమే తీర్చగలదా? అని అంచనా వేయాలి. దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాన్ని సాధించేది అయితే దాన్ని మంచి రుణంగా పరిగణించవచ్చు. లేదంటే దాన్ని చెడు రుణంగా పరిగణించవచ్చు. రుణాలు తీసుకుని వృద్ధి చెందడానికి ఆ డబ్బును ఉపయోగించడం వల్ల చాలా ప్రయోజనాలుంటాయి. అలాంటి రుణాలు ఏంటో చూద్దాం.మంచి రుణాలువిద్య రుణం: విద్య, శిక్షణ కార్యక్రమాలు లేదా స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో పెట్టుబడి పెట్టడానికి రుణాలు తీసుకోవడం విద్యార్థి భవిష్యత్‌కు పునాది లాంటిది. విద్యా రుణం మీ భవిష్యత్ కోసం పెట్టుబడి లాంటిది. ఉన్నత విద్యనభ్యసించడానికి రుణం తీసుకోవడం అనేది ఒక బాధ్యతగా పరిగణించవచ్చు. ఎందుకంటే ఇది కెరీర్‌ను అభివృద్ధి చేయడమే కాకుండా భవిష్యత్‌లో మెరుగైన సంపాదన తెచ్చే వనరుగా విద్యార్థిని తీర్చిదిద్దుతుంది. విద్యా రుణాలు తక్కువ వడ్డీ రేట్లను కలిగి ఉండడమే కాకుండా వడ్డీపై పన్ను మినహాయింపు ఉంటుంది. మంచి భవిష్యత్‌ను నిర్మించుకోవడానికి ఇలాంటి రుణాలు తెలివైన మార్గం.ఇంటిపై రుణం: ప్రాపర్టీని కొనుగోలు చేయడానికి హోమ్‌లోన్ పొందడం వల్ల శాశ్వత నివాసమేర్పడుతుంది. స్థిరాస్తి పెట్టుబడి విలువలు కాలక్రమేణా వృద్ధి చెందుతాయి. అద్దె/లీజు వంటి ఆదాయాన్ని తెచ్చిపెట్టడమే కాకుండా.. దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వానికి దోహదం చేస్తాయి. ఇంటి పునరుద్ధరణ వంటి ముఖ్యమైన ఖర్చుల కోసం రుణాన్ని తీసుకోవడం వల్ల ఆస్తి నాణ్యతను పెంచుతుంది. ఇంటి రుణాలపై ఆదాయ పన్ను మినహాయింపు ఉంటుంది.వ్యాపారానికి రుణం: వ్యాపారాన్ని ప్రారంభించడానికి లేదా విస్తరించడానికి రుణం తీసుకోవడం ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రణాళికాబద్ధమైన వ్యాపార వెంచర్లు.. ఆదాయాన్ని, సంపదను సృష్టించగలవు. వ్యాపారం చిన్నది, పెద్దది ఏదైనా కావచ్చు. ఇది, వ్యక్తి, అతడి కుటుంబం ఉన్నతంగా జీవించడానికి అవకాశాన్నిస్తుంది.చెడు రుణాలు

క్రెడిట్ కార్డు రుణం: దీర్ఘకాల ఆర్థిక శ్రేయస్సుకు దోహదపడని ఆస్తులు లేదా ఖర్చుల కోసం చేసిన అప్పులను చెడ్డ రుణాలుగా పరిగణించవచ్చు. అంటే దీర్ఘకాలంలో మీకు సహాయం చేయని వాటికోసం డబ్బు తీసుకోవడమే చెడ్డ రుణం. అటువంటి వాటిలో క్రెడిట్ కార్డు రుణాలు ముందుంటాయి. క్రెడిట్ కార్డుతో విచక్షణ లేకుండా ఖర్చులు లేదా అనవసరమైన కొనుగోళ్లు చేసి చాలా మంది బకాయిలను పెంచేసుకుంటారు. క్రెడిట్ కార్డుతో ఏర్పడే ఖర్చులు ప్రతి నెలా ఉంటాయి. ఇలాంటి బకాయిలు కూడా తక్కువ కాలవ్యవధి రుణాలతో సమానం. ఇవి కార్డుదారులకు ఎప్పటికీ భారమే.క్రెడిట్ కార్డు బకాయిని కనీస మొత్తం చెల్లించి కొద్ది కాలం పాటు వాయిదా వేయొచ్చు. దీనివల్ల కూడా ఆ బకాయికి వడ్డీ పేరుకుపోవడం వల్ల ఎక్కువ వడ్డీతో కూడిన అనవసరపు రుణంగా మారుతుంది. ఇంకా క్రెడిట్ కార్డుతో వ్యక్తిగత రుణాలు, బకాయిపై ఫ్లెక్సీపే రుణాలు లభిస్తాయి. వీటిపై కూడా కాలవ్యవధిని బట్టి వడ్డీ రేటు ఉంటుంది. ఈ రకమైన అప్పులు అధిక వడ్డీ రేట్లతో లభించడమే కాకుండా, రుణగ్రహీతలకు తాత్కాలిక ఉపశమనాన్ని మాత్రమే అందిస్తాయి.వ్యక్తిగత రుణాలు: ప్రస్తుతం చాలా రుణ సంస్థలు, బ్యాంకులు వ్యక్తిగత రుణాలను విరివిగా ఇస్తున్నాయి. తీసుకున్న రుణాన్ని ఎలాంటి అవసరానికైనా ఖర్చు పెట్టొచ్చు. దీంతో చాలా మంది విలాసవంతమైన వస్తువులు, విహార యాత్రలు లేదా జీవనశైలి ఖర్చుల కోసం వ్యక్తిగత రుణాలు తీసుకోవడం అలవాటుగా చేసుకుంటున్నారు. ఈ స్వల్పకాలిక, అధిక వడ్డీ




రుణాలు.. నగదు ప్రవాహ సవాళ్లను ఎదుర్కొంటున్న వ్యక్తులను లక్ష్యంగా చేసుకుంటాయి. ఈ రుణాలు ఆర్థిక అస్థిరతకు దారితీయొచ్చు. శాశ్వత విలువ లేదా ఆస్తులను ఉత్పత్తి చేయనందున ఇలాంటి అప్పులను చెడ్డ రుణాలుగానే పరిగణించొచ్చు.పేడే లోన్స్: పేడే రుణాలు రోజువారీ ఖర్చులను నిర్వహించడానికి స్వల్పకాలిక ఉపశమనం అందిస్తాయి. బ్యాంకులు, వేతన ఖాతా ఉండే ఖాతాదారులకు ఇలాంటి రుణాలను ఆఫర్ చేస్తాయి. వడ్డీ కూడా ఎక్కువే. ఈ రకమైన రుణాలు పేలవమైన క్రెడిట్ స్కోరు ఉన్నవారికి కూడా అందుబాటులో ఉంటాయి. అందువల్ల, వృథా ఖర్చులు చేసేవారు సైతం ఇలాంటి రుణాలపై ఆసక్తి చూపుతారు. రుణాన్ని తీసుకున్నవారు తదుపరి పేడే (వేతనం వచ్చే రోజు) నాటికి తిరిగి చెల్లించాలి. చెల్లింపుల వ్యవధి తక్కువ ఉన్న కారణంగా కాలక్రమేణా ఈ రుణాలు ఆర్థిక అస్థిరతకు దారితీస్తాయి. చివరిగా: రుణాన్ని తీసుకున్న తర్వాత అది తిరిగి చెల్లించే వ్యూహం లేనప్పుడు అది డిఫాల్ట్‌లకు దారితీస్తుంది. కొంతమంది అనవసర ఖర్చులకు రుణాలు తీసుకుని డిఫాల్టర్‌గా మారతారు. అప్పుడు అది వారి క్రెడిట్ స్కోరుపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. దీనివల్ల తర్వాత కాలంలో రుణాలు కూడా లభించకపోవచ్చు.

## బ్యాంకు అప్పు ఇవ్వనంటే...

బ్యాంకు రుణ దరఖాస్తును పూర్తిగా పరిశీలించాకే తిరస్కరిస్తుంటుంది. ఒకప్పటితో పోలిస్తే, ఇప్పుడు రుణ దరఖాస్తులన్నీ డిజిటల్‌లోకి మారిపోయాయి. చాలా సందర్భాల్లో బ్యాంకులు వినియోగిస్తున్న కృత్రిమ మేధ (ఏఐ) మన దరఖాస్తును ప్రాథమికంగా పరిశీలించి, తదుపరి దశకు తీసుకెళ్తుంది. ఆ తర్వాతే సిబ్బంది చూస్తారు. దరఖాస్తు తిరస్కరణకు క్రెడిట్ స్కోరు తక్కువగా ఉండటం, పలుమార్లు రుణం కోసం దరఖాస్తు చేయడంలాంటివి కారణం అవుతాయి.విషయం ఏమిటో చూడండి..

మీ దరఖాస్తును బ్యాంకు ఎందుకు తిరస్కరించిందో కారణాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయాలి. రుణదాతలు కచ్చితంగా దీన్ని తెలియజేస్తారు. తగినంత ఆదాయం లేకపోవడం, ఇప్పటికే ఉన్న రుణాల వాయిదాలు మీ ఆదాయంలో 50-60 శాతానికి చేరడం, వాయిదాలను ఆలస్యంగా చెల్లించడం, ఉద్యోగంలో సమస్యలు, తాకట్టు పెట్టిన ఆస్తులకు సంబంధించి చట్టపరమైన చర్యల వంటి వాటివల్లా దరఖాస్తు తిరస్కరించే ఆస్కారం ఉంది. సాధారణంగా క్రెడిట్ స్కోరు 700 పాయింట్ల లోపు ఉన్నప్పుడు రుణ దరఖాస్తును ఆమోదించడం కష్టం. బ్యాంకు మీ దరఖాస్తును తిరస్కరించి, సరైన సమాచారం ఇవ్వకపోతే మీరు ప్రశ్నించేందుకు వీలుంది.నివేదికను చూడండి..దేశంలో ఉన్న క్రెడిట్ బ్యూరోలన్నింటి నుంచీ ఏడాదికి ఒకసారి ఉచితంగా క్రెడిట్ నివేదిక పొందేందుకు అవకాశం ఉంది. ఈ వెసులుబాటును ఉపయోగించుకొని, ఆ నివేదికను తీసుకోండి. అందులో మీ క్రెడిట్ స్కోరును, రుణ అర్హతను దెబ్బతీస్తున్న అంశాలేమైనా ఉన్నాయా చూసుకోండి. ఉదాహరణకు మీరు ఎవరికైనా హామీ సంతకం చేశారా? వారు సరిగా రుణ వాయిదాలు చెల్లించకపోతే ఆ ప్రభావం మీ స్కోరుపై పడుతుంది. తక్కువ స్కోరు వల్లే రుణం లభించలేదు అని తేలితే.. పెంచుకునేందుకు ప్రయత్నించాలి. చిన్న మొత్తంలో ఉన్న అప్పులను పూర్తిగా చెల్లించేందుకు ప్రయత్నించండి.

# గుజరాత్ లోని రిలయన్స్ రిఫైనరీని టార్గెట్ చేస్తాం: అసిమ్ మునీర్ హెచ్చరిక

* **రిలయన్స్ జామ్‌నగర్ రిఫైనరీని లక్ష్యంగా చేసుకుంటామన్న పాక్ ఆర్మీ చీఫ్**
* **అమెరికా పర్యటనలో జనరల్ అసీమ్ మునీర్ వివాదాస్పద వ్యాఖ్యలు**
* **ఇది అణు బెదిరింపేనని తీవ్రంగా స్పందించిన భారత విదేశాంగ శాఖ**
* **ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల మధ్య పెరిగిన ఉద్రిక్తతల నేపథ్యంలో వ్యాఖ్యలు**

**ఆగష్టు 12 (భారత శక్తి) :** పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్ తన అమెరికా పర్యటనలో భారత్‌పై తీవ్రమైన వ్యాఖ్యలు చేస్తూ కవ్వింపులకు పాల్పడుతున్నారు. గుజరాత్‌లోని జామ్‌నగర్ లో ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) రిఫైనరీని లక్ష్యంగా చేసుకుంటామని బెదిరించారు. ఈ రిఫైనరీ ప్రపంచంలోనే అతిపెద్ద సింగిల్‌సైట్ రిఫైనింగ్ కాంప్లెక్స్‌గా గుర్తింపు పొందింది. అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన ఒక విందు సమావేశంలో, మునీర్ ఆర్ఐఎల్ ఛైర్మన్ ముఖేష్ అంబానీ చిత్రంతో పాటు ఖురాన్ శ్లోకాన్ని ప్రస్తావిస్తూ ఒక సోషల్ మీడియా పోస్ట్‌ను ప్రస్తావించారు. అంతేకాదు, భారత్ కు అణు హెచ్చరికలు కూడా చేశారు. అమెరికా నేలపై నుంచి మునీర్ చేసిన ఈ వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ వ్యాఖ్యలు పాకిస్థాన్ యొక్క యుద్ధోన్మాద వైఖరిని స్పష్టంగా చూపిస్తున్నాయని భారత్ అభిప్రాయపడింది. కాగా, మునీర్ న్యూక్లియర్ వార్నింగ్ నేపథ్యంలో... భారత్, పాకిస్థాన్ దేశాల సైనిక, అణు సామర్థ్యంపై చర్చ మొదలైంది.

**సైనిక బలం: భారత్ ఆధిపత్యం**

ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్ ప్రకారం, భారత్ సైనిక బలం పాకిస్థాన్ కంటే చాలా ఎక్కువ. భారత్‌లో సుమారు 14 లక్షల మంది సక్రియ సైనిక సిబ్బంది ఉన్నారు, వీరిలో 12.3 లక్షలు ఆర్మీ, 75,500 నౌకాదళం, 1,49,900 వైమానిక దళం, మరియు 13,350 కోస్ట్ గార్డ్‌లో ఉన్నారు. దీనికి విరుద్ధంగా, పాకిస్థాన్‌లో 7 లక్షల కంటే తక్కువ సైనిక సిబ్బంది ఉన్నారు. 5,60,000 మంది ఆర్మీ, 70,000 మంది వైమానిక దళం, మరియు 30,000 మంది నౌకాదళంలో ఉన్నారు. అంతేకాక, భారత్‌లో 25 లక్షల మంది పారామిలటరీ బలగాలు ఉండగా, పాకిస్థాన్‌లో కేవలం 5 లక్షల మంది మాత్రమే ఉన్నారు.

*** న్యూక్లియర్ సామర్థ్యం: భారత్ ముందంజ**

రెండు దేశాలు న్యూక్లియర్ ఆయుధాలను కలిగి ఉన్నప్పటికీ, గత 20 ఏళ్ల గణాంకాలను పరిశీలిస్తే... భారత్‌లో 180 న్యూక్లియర్ వార్‌హెడ్‌లు ఉండగా, పాకిస్థాన్‌లో 170 ఉన్నాయని అంచనా. భారత్ అగ్ని5 క్షిపణులు బహుళ లక్ష్యాలను ఒకేసారి ఛేదించగల మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటబుల్ రీఎంట్రీ వెహికల్స్ (ఎంఐఆర్‌వీ) సాంకేతికతను కలిగి ఉన్నాయి. అగ్ని5 రేంజ్ 5,000 నుంచి 8,000 కి.మీ. వరకు ఉండగా, పాకిస్థాన్ యొక్క షాహీన్ 3 క్షిపణి రేంజ్ 2,750 కి.మీ. మాత్రమే.

## భారీ వర్ష సూచన.. వచ్చే మూడ్రోజులు ప్రజలు బయటకు రావొద్దు: హైడ్రా

**హైదరాబాద్, ఆగష్టు 12 (భారత శక్తి):** భాగ్యనగరంలో రేపటి నుంచి మూడ్రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైడ్రా వెల్లడించింది. ఈ నెల 13, 14, 15 తేదీల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే సూచనలున్నాయని తెలిపింది. మేడ్చల్ జిల్లాతోపాటు సైబరాబాద్ పరిధిలో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. 10 నుంచి 15 సెం.మీ వర్షపాతం పడుతుందని, కొన్ని ప్రాంతాల్లో 20సెం.మీ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని పేర్కొంది. వచ్చే మూడ్రోజులు ప్రజలెవరూ బయటకు రావొద్దని హైడ్రా విజ్ఞప్తి చేసింది. ముప్పు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

## న్యాయవాద దంపతుల హత్య కేసు సీబీఐకి.. సుప్రీంకోర్టు కీలక తీర్పు



**ఢిల్లీ, ఆగష్టు 12 (భారత శక్తి):** న్యాయవాదులైన గట్టు వామనరావు దంపతుల హత్య కేసును కోర్టు సీబీఐకి అప్పగించింది. ఈమేరకు సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది. ఈ కేసును సీబీఐ దర్యాప్తునకు ఇస్తే తమకేమీ అభ్యంతరం లేదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. మరోవైపు మరణవాంగ్మూలం వీడియో అసలుదేనని ఎఫ్ఎస్ఎల్ నివేదిక తేల్చింది. ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు వెల్లడించింది. అన్ని అంశాలను పరిశీలించి దర్యాప్తు చేయాలని సీబీఐను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. 2021 ఫిబ్రవరి 17న గట్టు వామనరావు దంపతులు హత్యకు గురయ్యారు. పెద్దపల్లి జిల్లా కల్వచర్ల వద్ద కారులో వెళ్తున్న వీరిని అడ్డుకొని రోడ్డుపై హత్య చేశారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని వామనరావు తండ్రి పిటిషన్ దాఖలు చేశారు.

## విమానం దారిమళ్లింపు ఘటన.. లోక్‌సభ స్పీకర్‌కు ఎంపీల ఫిర్యాదు




**ఢిల్లీ, ఆగష్టు 12 (భారత శక్తి) :** తాము ప్రయాణిస్తున్న తిరువనంతపురం ఢిల్లీ ఎయిరిండియా విమానాన్ని చెన్నైకు మళ్లించడాన్ని ఎంపీలు ప్రశ్నించారు. సదరు విమానయాన సంస్థ తమ హక్కుల ఉల్లంఘనకు పాల్పడిందని ఆరోపించారు. ఈ క్రమంలోనే దానిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్‌కు చెందిన కేసీ వేణుగోపాల్ సహా ఐదుగురు ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టాలని పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడును కోరారు. పార్లమెంట్ సభ్యులు కేసీ వేణుగోపాల్, కొడికున్నిల్ సురేశ్, ఆదూర్ ప్రకాశ్, కె.రాధాకృష్ణన్, సి.రాబర్ట్ బ్రూస్ సహా 150 మంది ప్రయాణికులతో కూడిన ఎయిరిండియా విమానం ఈ నెల 10న తిరువనంతపురం నుంచి ఢిల్లీకి బయల్దేరింది. మార్గమధ్యంలో సాంకేతిక లోపం కారణంగా విమానాన్ని చెన్నైకి మళ్లించారు. ఆ సమయంలో బెంగళూరు, కోయంబత్తూరు వంటి ఇతర విమానాశ్రయాలు సమీపంలోనే ఉండగా.. చెన్నైకు మళ్లించడాన్ని ఎంపీలు ప్రశ్నించారు. ఈ నిర్ణయం వెనుక కారణాన్ని సంస్థ వివరించలేదన్నారు. విమానాన్ని చెన్నైకు మళ్లించినప్పటికీ.. నేరుగా ల్యాండ్ చేయలేదని, అక్కడే గంటకుపైగా చక్కర్లు కొట్టినట్లు ఎంపీలు తెలిపారు. తొలిసారి ల్యాండింగ్‌కు విఫలయత్నం చేశారని.. బహుశా రన్‌వేపై మరో విమానం ఉండటం వల్ల కావచ్చనే పైలట్ ప్రకటనను ఉటంకించారు. ఎట్టకేలకు అర్ధరాత్రి దాటిన తర్వాత మరో విమానంలో ఢిల్లీకి వెళ్లినట్లు చెప్పారు. ఈ వ్యవహారంపై తాము ఆందోళనలు లేవనెత్తగా.. తప్పుడు ప్రకటనలు చేశామంటూ ఎయిరిండియా చిత్రీకరించిందన్నారు. తద్వారా ఎంపీల ప్రతిష్ఠకు భంగం కలిగించే ప్రయత్నం చేసినట్లు ఆరోపించారు.

## సీబీఐకి వామనరావు దంపతుల హత్యకేసు..
### స్వాగతించిన మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్, ఆగష్టు 12 (భారత శక్తి):** న్యాయవాదులు గట్టు వామనరావు దంపతుల హత్యకేసును సీబీఐకి అప్పగించడాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. హైదరాబాద్ అబిడ్స్‌లోని ఓ కార్యక్రమానికి హాజరైన మంత్రి.. ఈ విషయంపై మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో వామనరావు దంపతులను దారుణంగా హత్య చేస్తే విచారణ కూడా సరిగ్గా చేపట్టలేదని మంత్రి విమర్శించారు. దీంతో వామనరావు తండ్రి వెంకటరావు సుప్రీంకోర్టును ఆశ్రయించారని తెలిపారు. సుప్రీంకోర్టు తాజాగా ఈ కేసును సీబీఐకి అప్పగించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. వారి హత్యలో గత ప్రభుత్వంలోని కొంతమంది పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉందని, దోషులు ఎంతటివారైనా చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. న్యాయవాదుల రక్షణ కోసం, చట్టం తెచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

## తెలంగాణలో ఎనిమీ ప్రాపర్టీస్‌పై తక్షణమే సర్వే చేయండి
### కేంద్రమంత్రి బండి సంజయ్ ఆదేశం



**ఢిల్లీ, ఆగష్టు 12 (భారత శక్తి):** నెలాఖరులోపు స్వాతంత్ర్య సమరయోధుల పింఛను కేసులను పరిష్కరించాలని అధికారులను కేంద్రమంత్రి బండి సంజయ్ ఆదేశించారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. తెలంగాణలోని ఎనిమీ ప్రాపర్టీస్ కేసుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించిన ఆయన.. దీనిపై తక్షణమే సర్వే చేయాలని ఆదేశించారు. దేశవ్యాప్తంగా 12,800 ఎనిమీ ప్రాపర్టీస్ ఉన్నాయని కేంద్రమంత్రికి అధికారులు తెలిపారు. 600కుపైగా ప్రాపర్టీస్ వేలందశలో ఉన్నాయని వివరించారు. వేలం వేసిన ఆస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.107 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. పెండింగ్ ఫైళ్లను వేగంగా క్లియర్ చేసిన అధికారులను కేంద్రమంత్రి అభినందించారు.

### హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు
## రామచందర్‌రావు గృహ నిర్బంధం

* **పెద్దమ్మ గుడిలో కుంకుమార్చనకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు**
* **ఇటీవల ధ్వంసమైన ఆలయాన్ని సందర్శించాలని బీజేపీ నేతల నిర్ణయం**
* **హర్ ఘర్ తిరంగా యాత్రకూ ఆటంకం**
* **ప్రభుత్వ తీరుపై బీజేపీ నేతల తీవ్ర ఆగ్రహం**


**హైదరాబాద్, ఆగష్టు 12 (భారత శక్తి):** హైదరాబాద్‌లో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును పోలీసులు ఈ ఉదయం ఆయన నివాసంలోనే గృహ నిర్బంధం చేశారు. బంజారాహిల్స్‌లోని పెద్దమ్మ గుడికి వెళ్లకుండా అడ్డుకునేందుకే ఈ చర్యలు తీసుకున్నారు. కొన్ని రోజుల క్రితం దుండగులు ధ్వంసం చేసిన బంజారాహిల్స్ పెద్దమ్మ గుడిలో కుంకుమార్చన చేయాలని బీజేపీ నాయకులు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రామచందర్‌రావు వెళ్తారన్న సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందుజాగ్రత్త చర్యగా ఆయనను ఇంటి నుంచి బయటకు రాకుండా నిర్బంధించారు. ఈ పరిణామంతో ఆయన సికింద్రాబాద్, గోషామహల్ నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన 'హర్ ఘర్ తిరంగా' యాత్రకు కూడా ఆటంకం ఏర్పడింది. రామచందర్‌రావు గృహ నిర్బంధాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించి ప్రతిపక్ష పార్టీల నాయకులను అణచివేయాలని చూడటం దురదృష్టకరం. నిర్బంధాలతో కార్యక్రమాలను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధం" అని విమర్శించారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలనలో తేడా కనిపించడం లేదని ఆయన విమర్శించారు. ముందస్తు అరెస్టులు చేయడం పరిపాటిగా మారిందని ఆరోపించారు. ప్రభుత్వం ఇదే వైఖరిని కొనసాగిస్తే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను చేపడతామని మనోహర్ రెడ్డి హెచ్చరించారు.



## తెలంగాణలో భారీ వర్షాలు.. అన్ని శాఖల ఉద్యోగులకు సెలవులు రద్దు: సీఎం రేవంత్

**హైదరాబాద్, ఆగష్టు 12 (భారత శక్తి) :** లంగాణలో భారీ వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని ఇన్‌ఛార్జ్ మంత్రులు, అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి జిల్లా కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. మూడు రోజుల పాటు అన్ని శాఖల ఉద్యోగులకు సెలవులు రద్దు చేయాలని సీఎం ఆదేశించారు. ఆకస్మిక వరదలు వస్తే ఎయిర్‌లిఫ్టింగ్‌కు హెలికాప్టర్లు సిద్ధంగా ఉండేలా చూడాలని సూచించారు. ''ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలి. భారీ వర్షాలు పడే జిల్లాలకు సిబ్బందిని ముందుగానే పంపించాలి. రెడ్ అలర్ట్ ఉన్న జిల్లాల్లో సీనియర్ అధికారులను ప్రత్యేకంగా నియమించాలి. వర్షాలు, వరదలపై మీడియా ద్వారా సమాచారం చేరవేయాలి. వరదలపై ఫిర్యాదు కోసం టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలి. హైదరాబాద్‌లో వరదలపై హైడ్రా అప్రమత్తంగా ఉండాలి. విద్యా సంస్థలకు సెలవులపై తగు చర్యలు తీసుకోవాలి. ఐటీ ఉద్యోగులు ఇంటి నుంచి పనిచేసేలా అప్రమత్తం చేయాలి. వీలైనంత వరకు ప్రజలు రహదారులపైకి రాకుండా చూడాలి. ప్రాణ, ఆస్తి, పశుసంపద నష్టం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి''అని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.


## అమెరికాలో రోడ్డు ప్రమాదం.. హైదరాబాద్ విద్యార్థిని మృతి



**దుండిగల్, ఆగష్టు 12 (భారత శక్తి):** అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన విద్యార్థిని మృతి చెందింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా రామారుకల గ్రామానికి చెందిన శ్రీనివాస్ వర్మ, హేమలత దంపతులకు శ్రీజా వర్మ, శ్రేయా వర్మ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీనివాస్ వర్మ దంపతులు బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం నగరానికి వలస వచ్చారు. మేడ్చల్ జిల్లా గండిమైసమ్మ చౌరస్తా సమీపంలోని శ్రీకృష్ణానగర్‌లో నివాసముంటున్నారు. శ్రీనివాస్ వర్మ డ్రైవర్‌గా పనిచేస్తుండగా.. ఆయన భార్య ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నారు. వీరి పెద్ద కుమార్తె శ్రీజా వర్మ ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లింది. ఈ మధ్యే ఎంఎస్ పూర్తి చేసింది. సోమవారం రాత్రి (భారత కాలమానం ప్రకారం) అపార్ట్‌మెంట్ నుంచి బయటకు వచ్చి భోజనం చేసేందుకు కారులో రెస్టరంట్‌కు వెళ్లింది. భోజనం చేసి తిరిగి వస్తుండగా ఆమె వాహనాన్ని ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీజా వర్మ తీవ్రంగా గాయపడి మృతిచెందింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో శ్రీజా వర్మతో పాటు ఆమె స్నేహితురాలు కూడా ఉన్నట్లు సమాచారం. శ్రీనివాస్ వర్మ చిన్న కుమార్తె శ్రేయా వర్మ సైతం ఎంఎస్ చేసేందుకు 20 రోజుల క్రితం అమెరికా వెళ్లింది.

## సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసు సిట్‌కు బదిలీ: నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్


**హైదరాబాద్, ఆగష్టు 12 (భారత శక్తి):** సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసును సిట్‌కు బదిలీ చేసినట్లు నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆమె మీడియాకు వెల్లడించారు. జులైలో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు చెప్పారు. ''ఈ కేసులో మొదట 8 మందిని.. తర్వాత 16 మందిని అరెస్టు చేశాం. అరెస్టయిన వారిలో వైద్యులు, ఏజెంట్లు ఉన్నారు. రెండో కేసులో చనిపోయిన బేబీని చూపించి బాధితుల నుంచి రూ.10లక్షలు నుంచి రూ.20లక్షలు



వసూలు చేశారు. డాక్టర్ నమ్రత బ్యాంక్ ఖాతాను నిలిపివేశాం. గైనకాలజీ డాక్టర్ సూరి శ్రీమతి పేరుపై ఉన్న లైసెన్స్ నంబర్, లెటర్ హెడ్స్‌తో అక్రమాలు చేశారు. ఆమె ఫిర్యాదు చేయడంతో మరో కేసు నమోదు చేశాం. సికింద్రాబాద్‌లో సృష్టి సెంటర్‌ను ఎలాంటి అనుమతులు లేకుండా నడిపిస్తున్నారు. ఈ సెంటర్‌కు అనుమతులు రద్దయి చాలా కాలమైంది. ధనశ్రీ సంతోషి ప్రధాన ఏజెంట్ కాగా.. మరికొందరిని సబ్ ఏజెంట్లుగా నియమించుకొని నెట్‌వర్క్‌ను విస్తరించారు. విశాఖ నుంచి పిల్లల వైద్యురాలు విద్యుల్లత, వైద్యులు రవి, ఉష పనిచేశారు. ఈ కేసులో సరోగేట్‌గా, అండదానం ఇచ్చే వారిగా కొందరు మహిళా ఏజెంట్లు నటించారు. ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మా వర్కర్స్ కూడా ఈ కేసులో భాగస్వాములుగా ఉన్నారు. 9 నెలల పూర్తవుతున్న గర్భవతులను గుర్తించి సరోగసీ కోసం వచ్చిన తల్లిదండ్రులకు అప్పగించారు. మగ బిడ్డకు రూ.4.5 లక్షలు, ఆడబిడ్డకు రూ.3లక్షల ధర నిర్ణయించారు. ఇలాంటి సెంటర్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అనుమతులు ఉన్న వాటినే సంప్రదించాలి''అని డీసీపీ రష్మీ పెరుమాళ్ సూచించారు.

# ఫీజు రీఎంబర్స్ మెంట్ లేక విద్యార్థుల అరిగోస..

- సర్టిఫికెట్స్ ఇవ్వడానికి నిరాకరిస్తున్న కళాశాలలు..
- పై చదువులకు వెళ్లలేక, ఉద్యోగాలకు అటెండ్ కాలేక..
- చెల్లించడానికి ఆర్థిక స్తోమత లేక అల్లాడుతున్న స్టూడెంట్స్..
- ఫీజ్ రీ యంబర్స్ మెంట్ రాకపోవడంతో సిబ్బందికి జీతాలు చెల్లించని వైనం..
- దాదాపు రూ. 7,500 కోట్ల బకాయిలు ఉన్నట్లు సమాచారం..
- చెల్లించాల్సిన బకాయిల్లో సగానికిపైగా ఇంజినీరింగ్ కళాశాలలకే..
- వెంటనే ఫీజ్ రీ యంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్న
- " కార్పొరేట్ విద్యా నియంత్రణ జే.ఏ.సీ..
- అవసరమైతే న్యాయపోరాటానికి సిద్ధం అంటూ ప్రభుత్వానికి హెచ్చరిక..



**హైదరాబాద్, ఆగష్టు 12 ( భారత శక్తి ) :** ప్రస్తుత పరిస్థితుల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ఇంజినీరింగ్ కళాశాలలు కోర్టుకు వెళ్ళడానికి సిద్ధం అవుతున్నట్టుగా తెలుస్తోంది.. తెలంగాణ కు చెందిన ఓ ప్రముఖ కళాశాల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడం కూడా జరిగింది.. కాగా ఆ కళాశాల యాజమాన్యానికి అనుకూలంగా తీర్పు కూడా వచ్చింది.. దీంతో మరికొన్ని కళాశాలలు అదే దారిలో నడిచేందుకు సమాయత్తమవుతున్నాయి. దాదాపు మూడేళ్ల బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో ఇప్పటివరకు ఏదోక విధంగా నెట్టుకొచ్చిన ప్రముఖ కళాశాలలు సైతం సిబ్బందికి వేతనాలు చెల్లించలేక కోత పెడుతున్నాయి. రాష్ట్రంలో ఉన్నత విద్యకు సంబంధించి 202223 నుంచి 202425..అంటే గత ఆర్థిక సంవత్సరం వరకు రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ట్యూషన్




ఫీజు పేరిట దాదాపు రూ.7,500 కోట్ల వరకు ప్రభుత్వం ఆయా కళాశాలలకు చెల్లించాల్సి ఉంది. అందులో సగానికిపైగా




ఇంజినీరింగ్ కళాశాలలకే చెల్లించాల్సి ఉంది. ప్రముఖ కళాశాలల్లో 10 వేల లోపు ర్యాంకర్లు ప్రవేశాలు పొందుతారు. వారికి పూర్తి ఫీజు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన కళాశాలల్లో రూ.35 వేలు మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరిట చెల్లిస్తుంది. మిగిలిన మొత్తాన్ని విద్యార్థులే కడతారు.

ఈ కారణంగా టాప్ కళాశాలలకు భారీగా బకాయిలు ఉండటంతో ఏమి చెయ్యాలో తెలియక సతమతమవుతున్నాయి.. ఇందులో పేద, మధ్యతరగతి విద్యార్థులు బలిపశువులు అవుతున్నారు..

దాదాపు మూడేళ్ల బకాయిలు పేరుకుపోవడంతో బోధన, బోధనేతర సిబ్బందికి వేతనాలు చెల్లించడం కళాశాలలకు కష్టంగా మారింది. హైదరాబాద్ శివారులోని ఓ కళాశాల ఏప్రిల్ నెల వేతనం సగమే ఇచ్చింది. ప్రభుత్వం నుంచి బోధనా రుసుములు వచ్చిన తర్వాత మిగిలిన మొత్తాన్ని ఇస్తామని చెప్పింది. నగరంలో నాలుగు దశాబ్దాల క్రితం నెలకొల్పిన మరో కళాశాలకు రూ.60 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. యాజమాన్య కోటా సీట్లను సైతం మెరిట్ ఆధారంగా ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుకు కేటాయించే ఆ కళాశాల ఇప్పుడు నెలనెలా జీతాలు చెల్లించేందుకు ఇబ్బందిపడుతోంది. ఇక చిన్న కళాశాలలు అయితే నెలల తరబడి వేతనాలు ఇవ్వడం లేదు.

ఘట్‌కేసర్‌లోని ఒక ఇంజినీరింగ్ కళాశాల తమకు రూ.92 కోట్ల బోధనా రుసుంల బకాయిలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని, తాము నెలకు రూ.5 కోట్లు వేతనాలకు ఇవ్వాలని, ఈ పరిస్థితుల్లో తాము విద్యాసంస్థను నడిపే పరిస్థితి లేదని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దాంతో ఇప్పటికే రూ.41.27 కోట్లకు ఆర్థిక శాఖ టోకెన్లు జారీ చేసినందున ఆ మొత్తాన్ని నాలుగు వారాల్లో చెల్లించాలని న్యాయస్థానం ఇటీవల మధ్యంతర తీర్పునిచ్చింది. వాటిని వాయిదాల రూపంలో కూడా చెల్లించవచ్చని, మొదటి వాయిదా రూ.10 కోట్లు రెండు వారాల్లో చెల్లించాలని ఆర్థిక శాఖను ఆదేశించింది. ప్రభుత్వం వెంటనే స్పందించి మొదటి వాయిదా చెల్లించింది. దీంతో మరికొన్ని కళాశాలలు అదేబాటలో నడిచేందుకు సమాలోచనలు చేస్తున్నాయి.

ఈ విధంగా మిగతా కళాశాలలు కూడా పిటిషన్ దాఖలు చేయాలని భావిస్తున్నాయి' అని ఓ ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ చెప్పారు. తమకు కూడా బకాయిలు విడుదల చేయాలని ఫార్మసీ కళాశాలల సంఘం తరపున ఇటీవల పిటిషన్ దాఖలు చేశామని, విచారణకు రావాల్సి ఉందని తెలిపారు.. 'ఇప్పటికే మూడేళ్ల బకాయిలున్నాయి. కనీసం కొత్త విద్యా సంవత్సరం అంటే 202526 నుంచైనా రీయింబర్స్‌మెంట్‌ను విద్యార్థుల ఖాతాల్లోనే జమ చేయాలి. వారి నుంచి ఫీజు మొత్తాన్ని వసూలు చేసుకునేందుకు మాకు అనుమతివ్వాలి' అని కళాశాలల యాజమాన్యం ఇటీవల ప్రభుత్వాన్ని కోరినట్టు తెలుస్తోంది..

ఈ క్రమంలో ఇటు విద్యార్థుల తరపున.. అటు కళాశాలల యాజమాన్యం తరపున కూడా న్యాయ పోరాటం చేయాలని "కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ", " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ " భావిస్తోందని సంస్థ ప్రతినిధి ఒకరు తెలియజేశారు..

## సైబర్ నేరాల్లో తెలంగాణ టాప్...

**హైదరాబాద్, ఆగష్టు 12 (భారత శక్తి) :** సైబర్ నేరాల విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యధికంగా అప్రతిష్ఠను మూట గట్టుకుంది. దేశవ్యాప్తంగా నమోద వుతున్న సైబర్ క్రైమ్ రేటుతో పోలిస్తే తెలంగాణలో దాదాపు 10 రెట్లు అధికంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ షాకింగ్ విషయాలను జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) మంగళవారం విడుదల చేసిన 2022 మధ్యంతర డేటా వెల్లడించింది.ఎన్‌సీఆర్‌బీ గణాంకాల ప్రకారం, దేశవ్యాప్తంగా సైబర్ క్రైమ్ రేటు సగటున 4.8 శాతంగా ఉండగా, తెలంగాణలో ఇది 40.3 శాతంగా నమోదైంది. దీంతో ఈ జాబితాలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. దక్షిణాది రాష్ట్రాల్లోనే సైబర్ నేరగాళ్లు ఎక్కువగా క్రియాశీలంగా ఉన్నట్లు ఈ నివేదిక సూచిస్తోంది. తెలంగాణ తర్వాత కర్ణాటక రెండో స్థానంలో ఉంది. ఇతర రాష్ట్రాల విషయానికొస్తే, మహారాష్ట్రలో సైబర్ క్రైమ్ రేటు 6.6 శాతంగా నమోదు కాగా, ఆంధ్రప్రదేశ్‌లో 4.4, అసోంలో 4.9, ఉత్తరప్రదేశ్, ఒడిశాలలో 4.3 శాతం చొప్పున ఉంది. పెద్ద రాష్ట్రాల్లో పశ్చిమ బెంగాల్ కేవలం 0.4 శాతం క్రైమ్ రేటుతో మెరుగైన స్థానంలో నిలవడం గమనార్హం. కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఢిల్లీ 3.2 శాతం, పుదుచ్చేరి 3.9 శాతం క్రైమ్ రేటుతో సైబర్ నేరాలకు హాట్‌స్పాట్‌లుగా




మారాయి. ఢిల్లీ పోలీసుల డేటా ప్రకారం, 2024లో సైబర్ మోసాల ద్వారా ఢిల్లీ వాసులు రూ. 817 కోట్లు నష్టపోయారు. 2025లో జూన్ 30 నాటికి మొదటి ఆరు నెలల్లోనే రూ. 70.64 కోట్లు కోల్పోయారు. దేశంలో సైబర్ నేరాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఇటీవల లోక్‌సభకు తెలిపారు. ఇందులో భాగంగా 'ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్' (I4C) ఏర్పాటు చేశామని, ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల కోసం 'నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్' (cyber crime.gov.in) ప్రారంభించామని వివరించారు. దీంతో పాటు, మహిళలు, చిన్నారులపై జరిగే సైబర్ నేరాలపై ప్రత్యేకంగా దృష్టి సారించేందుకు పోలీస్ విభాగాల్లో ప్రత్యేక యూనిట్లను కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

## అమరావతి పనులు రికార్డు సమయంలో పూర్తి కావాలి

**అమరావతి, ఆగష్టు 12 (భారత శక్తి) :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులను రికార్డు సమయంలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిపై మంగళవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, పలు కీలక సూచనలు చేశారు. రాజధాని నిర్మాణాన్ని అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణించాలని, పనుల్లో జాప్యం జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశానికి పురపాలక శాఖ మంత్రి పి. నారాయణతో పాటు సీఆర్డీఏ, ఏడీసీకి చెందిన ఉన్నతాధికారులు, నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లు హాజరయ్యారు. రాజధాని నిర్మాణంలో ఎదురవుతున్న సవాళ్లు, పనుల ప్రస్తుత దశపై ముఖ్యమంత్రి వారితో చర్చించారు. అమరావతిలో చేపట్టాల్సిన పనుల వివరాలను అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు. రాజధానిలో మొత్తం రూ. 81,317 కోట్ల విలువైన పనులను చేపట్టాలని సీఆర్డీఏ




ప్రతిపాదించగా, ఇప్పటివరకు రూ. 50,552 కోట్ల విలువైన పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. ప్రధానంగా భవన నిర్మాణాలు, ల్యాండ్ పూలింగ్ స్కీమ్ (ఎల్పీఎస్) పరిధిలో మౌలిక సదుపాయాల కల్పన, ప్రధాన రహదారులు, డక్టుల వంటి ట్రంక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ పనులతో పాటు వరద నియంత్రణ పనుల పురోగతిని సీఎం సమీక్షించారు. నిర్దేశిత లక్ష్యాల మేరకు పనుల్లో వేగం పెంచి, నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకుండా ముందుకు సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

### రెడ్ అలర్ట్... తెలంగాణలో పలు జిల్లాల్లో

## భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు

**హైదరాబాద్, ఆగష్టు 12 (భారత శక్తి) :** తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రాగల మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. హన్మకొండ, జనగాం, మహబూబాబాద్, వరంగల్, యాదాద్రి భువనగిరి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ తదితర జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. దీంతో ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నేడు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది. బుధ, గురువారాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, మేడ్చల్‌మల్కాజ్‌గిరి, ములుగు, పెద్దపల్లి, రంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో రేపు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

## తిరుమల వెళ్లే భక్తుల వాహనాలకు 'ఫాస్టాగ్' లేకపోతే నో ఎంట్రీ

* భద్రత, రద్దీ నియంత్రణ కోసమే ఈ నిర్ణయమన్న టీటీడీ
* ఫాస్టాగ్ లేని వాహనాలకు కొండపైకి అనుమతి నిరాకరణ
* భక్తులు సహకరించాలని టీటీడీ చైర్మన్ విజ్ఞప్తి

**తిరుమల, ఆగష్టు 12 (భారత శక్తి) :** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసే భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఒక ముఖ్యమైన సూచన చేసింది. ఇకపై తిరుమలకు వెళ్లే అన్ని రకాల వాహనాలకు ఫాస్టాగ్ ను తప్పనిసరి చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త నిబంధన స్వాతంత్ర్య దినోత్సవం రోజైన ఆగస్టు 15వ తేదీ నుంచి అమల్లోకి రానున్నట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మంగళవారం స్పష్టం చేశారు. అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద వాహనాల రద్దీని నియంత్రించడం, భక్తులకు మెరుగైన భద్రతా ప్రమాణాలు కల్పించడం, పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఆగస్టు 15 నుంచి ఫాస్టాగ్ లేని వాహనాలను తిరుమల ఘాట్ రోడ్డుపైకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని ఆయన తేల్చిచెప్పారు. భక్తుల సౌకర్యార్థం, ఫాస్టాగ్ లేని వాహనదారుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు టీటీడీ తెలిపింది. అలిపిరి టోల్ ప్లాజా వద్ద ఐసీఐసీఐ బ్యాంకు సహకారంతో ఒక ప్రత్యేక ఫాస్టాగ్ జారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఫాస్టాగ్ లేని వారు ఈ కేంద్రంలో తక్కువ సమయంలోనే దాన్ని పొంది, ఆ తర్వాతే తమ వాహనాల్లో తిరుమలకు ప్రయాణించవచ్చని వివరించారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.